UNIVERSAL LIBRARY
OU_204871
UNIVERSAL LIBRARY

# చంద్రగుప్త నాటకము.

లేక

# మౌర్యాభ్యుదయము.

నెల్లూరు వాస్తవ్యులు

బందరు నోబుల్ కాలేజిలో చరిత్రోపన్యాసకులు గానుండి

కీర్తిశేషులైన

## ముత్తరాజు సుబ్బరావు, యం. ఏ., గారిచే

రచితమై

వారి జ్యేష్ఠ కుమారులగు

ముత్తరాజు సుబ్బరామరావుచే

ప్రకటింపబడినది.

ప్రథమ ముద్రణము.

రామకృష్ణ ముద్రాక్షరశాల,

నెల్లూరు.

1932

సర్వస్వామ్య సంకలితము.

వెల రు 1-0-0.

# ప్రకటన.

ఈ నాటకమును లిఖితరూపమైన నా యనుజ్ఞ లేక యెవ్వరును ప్రదర్శింపఁగూడదు.

ముత్తరాజు సుబ్బరామరావు,

ప్రకాశకుడు.



ముత్తరాజు సుబ్బరావు, యం. ఏ.,

# ప్రకాశకుల విజ్ఞప్తి.

కీర్తిశేషులగు మా తండ్రి శ్రీయుత ముత్తరాజు సుబ్బరావు పంతులవారు పెక్కేండ్ల క్రిందట రచియించిన ఈ చంద్రగుప్త నాటకమును వారు గతించిన పది సంవత్సరములకైనను ముద్రింపించి ఆంధ్రలోకమున కందింప శక్తిగలిగించినందుకు పరమేశ్వరునకు మనఃపూర్వక ప్రణామము లర్పించుచున్నాము. వారు రచియించిన మరియొక నాటకము శ్రీకృష్ణ తులాభారము మజ్జనకుని జీవిత కాలముననే ముద్రితమై ఆంధ్రదేశమున మిక్కిలి విఖ్యాతిం గాంచి యుండుట ఎల్లరకు విదితమే. ఈ గ్రంథము రచితమై చిరకాల మగుటవల్ల వ్రాతప్రతి ఖిలమై అచటచట కొన్ని యక్షరములు కానరామి చేతను, మా తండ్రిగారు దీనిని ముద్రణకు యోగ్యమగు స్థితిలోనుంచకయే స్వర్గస్థులగుట చేతను, ఈ గ్రంథ ముద్రణమునకై మా తండ్రిగారి మిత్రులు కొందరు చేయూతీవరమున దీనిని పండిత పరిష్కృతము కావించు నవకాశము లేకయే ముద్రింపవలసి వచ్చి నందునను ఈ గ్రంథమునందు ముద్రణాది దోషములు కొన్ని దొరలినవి. గ్రంథాంతమున బ్రచురించిన తప్పొప్పుల పట్టిక ననుసరించి పాఠకులు సవరించుకొన బ్రార్థితులు. ఇంకను స్ఖాలిత్యములున్న చదువరులు దయార్ద్రహృదయులై మన్నించి మాకు వాని దెలియపరిచినచో ద్వితీయ ముద్రణమున వానిని సవ రించుకొందుమని పాఠకమహాశయులకు విన్నవించుకొనుచున్నాము.

తులాభారమునకు గలిగిన అపార ప్రశస్తియే ఈ గ్రంథమున కును లభించి అచిరకాలమున ఇదియు ననేకులచే ఆదరింపబడుగాక.

నెల్లూరు శ్రీ ఆంధ్రసభవారిచే ఈ నాటకమును ప్రదర్శింప చేసియు, ఈ గ్రంథమునకు ఉపోద్ఘాతమును వ్రాసియు, మాకు మిక్కిలి ప్రోత్సాహ మొసంగిన నెల్లూరు న్యాయవాదులలో ప్రము ఖులును, ఆంధ్రనాటక కళాపోషకులును, విద్వదభిమానులును, మా తండ్రిగారి మిత్రులును, అగు శ్రీయుత తూములూరు శివరామయ్య పంతులు, బి. ఏ., బి. యల్. గారికి కృతజ్ఞతాపూర్వక నమస్కార ముల నాచరించుచున్నాము.

నెల్లూరు, 4-11-1932. ముత్తరాజు సుబ్బరామరావు.

# ఉపోద్ఘాతము.

శ్రీ నెల్లూరు ఆంధ్రసభ స్థాపితమైన 1918 వ సంవత్సరము మొదలు శ్రీ మూ_ర్తిరాజు సుబ్బరావుపంతులుగారు ఆమరణాంతము తత్సభకు ఉపాధ్యక్షులుగ నుండిరి. ఆ కాలమున నేనును అధ్యక్షుఁడనై యుంటిని. ఆయన వ్రాసిన నాటకములలో అనసూయ, కచదేవయాని, రణతిక్కన, చంద్రగు_ప్త, కృష్ణతులాభారము అను వానిని నేను చదివియున్నాను. సభవారు వీనియందు పెక్కంటిని జయప్రదముగ ప్రదర్శించియున్నారు. 1919 డిసంబరు నెలలో మొట్టమొదట కృష్ణతులాభారము ప్రదర్శితమయ్యెను. ఉత్తమోత్తములు లోకారాధ్యులు శ్రీ రుక్మిణీ కృష్ణులు ముఖ్యపాత్రములుగ, తులసీ మాహాత్మ్య కథ వస్తువుగ, సత్యభామా కృష్ణుల శృంగారలీలలు వర్ణనాంశములుగ, ప్రేమ భ_క్తిగాఢతయుట ఉద్దేశ్యముగ, వ్రాయబడిన యీ నాటకము అంతటి రసముచేతను వస్తు సంవిధానముచేతను, కవికి పూర్వపుణ్యపరిపాకమున గలిగిన హృద్య కవితాధోరణిచేతను, సర్వ జనాదరణీయమై కవికి దేశమున చిరస్థాయియైనఖ్యాతిని సంపాదించినది.

ఆంధ్రభాషయందు ఈ కాలమున కావ్యములకన్న నెక్కువగ నాటకములు, నవలలు రచితమగుచున్నవి. అందు విశేషభాగము ఆంగ్ల వంగ మహారాష్ట్రానువాదములు. ఈ స్థితికి కారణము నూహింపవలసియున్నది తొలుదొ_ల్తనే సంస్కృతాశ్రయము కల్గిన ఆంధ్రభాషాలత అందలి విశేషమును గ్రహించినను ఆ భాష

లోని గ్రంథములన్నియు నిప్పటికిని ఆంధ్రమున కానరావు. అట్లవి అనువాద రూపమున ఆంధ్రుల కందినగాని యిప్పటి పరిస్థితులలో ఆంధ్రభాషావృద్ధి సరియైన మార్గమునం బడదని నా నమ్మకము. ఇతరభాషలనుండి యెన్నియేని భావములను స్వీకరింపవచ్చును; రచనా వైఖరి ననుకరింపవచ్చును; గ్రంథానువాదములం జేయవచ్చును; మన భాషయందు లేనివిశేషములం గొనవచ్చును. కాని భాషా సంప్రదాయములను కోల్పోవరాదు. యోషనుంబోలె భాషకును సంప్రదాయానుగతములైన మతిగతులే కీర్తిగాయకములు. పూర్వము లాటిన్నుండి బైబిలును దేశభాషకు మార్చి యూరోపునందంతయు నూతన జీవము కల్పించిన లూథరువలె మహానుభావులు సంస్కృతగ్రంథముల నన్నింటిని తెలుగున వ్రాయించినంగాని సంస్కృతభాషాపాండితిలేనివారికి లోకోత్తరములగు అందలి భావములు సులభగ్రాహ్యములు కాంజాలవు. అట్లు భాషా సేవచేసినవారు ఆంధ్రవాఙ్మయాభివృద్ధికి నిక్కంపు బ్రహ్మలుగా వెలయంగలరు. ఆంధ్రుల విజ్ఞానాభివృద్ధికై ప్రత్యేకముగా నెలకొల్పంబడిన ఆంధ్రవిశ్వకళాపరిషత్తువారు (ఆంధ్రయూనివర్సిటీ) ఈవిషయమున తమ కర్తవ్యమును నిర్వర్తింతురుగాక.

రాజపోషణ క్షీణించి సామాన్య జనపోషణపై ఆధారపడు కవిత్వము నాటకరూపమునను నవలారూపమునను ఉండక తప్పదు. ఆంధ్రభాషయందేగాక ఆంగ్లాది భాషలందును ప్రస్తుతము కేవల పద్యకావ్యములు ఎక్కువగ వ్రాయంబడుటలేదు.

ఏ కాలమందును కవిత్వము జాతీయ విజృంభణమును అనుగమించును. పూర్వపు ఔన్నత్యమును స్మరించి దేశభక్తిని పాదుకొల్పి జాతీయభావమును వికసింపజేయవలసినవి యిప్పటి పరిస్థితులు. కావుననే యువకుడు, జాతీయభావోద్రేకపూరితమనస్కుడు, ఆంగ్ల

సారస్వతసారమును గ్రహించిన చరిత్రబోధకుడు గానుండిన శ్రీయుత సుబ్బరావుగారు మౌర్యాభ్యుదయమను నామాంతరముగల యీ చంద్రగుప్త నాటకమును వ్రాయుట తటస్థించినదని నమ్ముచున్నాను.

హిందూ చక్రవర్తి చంద్రగుప్తునిపై గ్రీకు రాజు శెల్యూకస్ దాడి వెడలుటయు ఓడిపోవుటయు ఆధారము చేసికొని కవి హృద్యమైన నాటకము నల్లినాడు. "అందము మందమంద" అను పద్యమున వర్ణితమైన దేశమాతను దేశభక్తుడు నీతికోవిదుడు అగు చాణక్యునకు కన్పింపఁజేసి సన్యాసిని ఆశ్రమభ్రష్టునిగావించి తిరుగ మంత్రిత్వమును స్వీకరింపఁజేసిన ఆ రంగము నాటకమునందంతటను ఉత్కృష్టమగుచున్నది. అందలి పద్యములు సందర్భోచితములై గంభీరములై కఠినుని మనస్సును కరగించునట్లు అల్లఁబడియున్నవి.

సీ॥ కలనాదగరిమంబు కతననే కీరంబు, పంజరబంధంబుఁ బడసినట్లు
క్షీరసంభారంబు చేతనే ధేనువు స్వాతంత్ర్యసుఖ మెడఁబాసినట్లు
వరవర్ణ పింఛంబువలననే బర్హిణం, బసమయమరణమ్ము నందినట్లు
వరణీయరూపంబు పట్టియే భామిని విటపీడనంబున వేగినట్లు
తే॥గీ॥ అతుల ధనధాన్యవతివౌట, నన్యరాజ దండయాత్రల కీ వాస్పదంబవైతి
వమ్మరో! కాలమహిమ నేమందు నకట! గుణములే సౌఖ్యహరణ కారణములయ్యె.

చ॥ బలమె నయంబటంచు ననివార్యమదోద్ధతి నన్యదేశమా
తల తనయుల్ ననుం జెనకి దాసిగఁ జేకొనరా, మఱియు నా
ను లరుల దాకఁ గూరక కనుంగొను వారని యేడ్చెదేమొ? త
ల్లులపగఁ దీర్పలేని సుతులుం సుతులే! భరతోర్వరాసతీ॥

శా॥ ఉల్లంబందున నిన్ను గాంచ నెటులో నూహించు జింతించుచో
సెల్లాకేశు దకారణాప్తుఁడయి, నీశ్రీ దోచరానున్న లోఁ
గల్లోలంపడినన్ను సాయమడుగంగా నిట్టులే తేరుటం
డల్లీ! నిన్ను గనుంగొనంగలిగితిన్ ధన్యత్వముం జెందితిన్॥

ఈ పద్యములు కలకాలము సామాన్యులకును కంఠస్థములై వ్యాప్తిగాంచు ననుటకు సందేహము లేదు.

శృంగార వర్ణనమునను కవి తన నేర్పును చూపించినాడు. రదనికచేయు గుణకీర్తనచే జనించి చిత్రదర్శనమున వృద్ధిగాంచి చంద్రగుప్తుని సందర్శించువాంఛ హేళినికి తీవ్రముకాగా రసికాగ్రేసరుడు ధీరుడు అగు చంద్రగుప్తుడు ఆయింతి ఆహ్వానముపై మారువేసమున వైరి శిబిరమునకు బోయి హెలెనును దర్శించుటయు, వైరిసేనాని తిరస్కృత ప్రణయుడు తత్తిరస్కారజనితేర్ష్యాపరవశుడునగు పాత్రికులుడు ఆ సందర్భమున హెలెన్‌ను బాధించుటయు, చంద్రగుప్తునిచే పరాజితుడగుటయు, కోరి పిలిపించుకొన్నను ప్రథమ సందర్భమున తమిదీర సరస సల్లాపముల వినోదింపలేక పోయినను అపాయమును శంకించి చంద్రగుప్తుని పొండని త్వరపెట్టుటయందు హెలెన్ గనబఱచిన గాఢంపు ప్రేమయు, చక్కగా వర్ణింపఁబడియున్నవి. గసమును పోషించుకొనుచు ఔచిత్యమును కాపాడుకొనుచు వెగటుకాకుండ స్పష్టముగాను నేర్పుతోను శృంగారమును కవి వర్ణించినాడు. ఇందుకు తార్కాణలీపద్యములు.

ఉ॥ ఆళులు గుంపుగూడిన రహస్యములాడిన నవ్వులాడినన్
బేల మదీయమర్మమును వీరలెఱింగి యిటుల్ చరింత్రుగా
బోలు నటంచుభ్రాంతిబడి మోమరవాంచుచు లేనిపోని గ
గ్గోలు వహించుఁ; గాముకులు గుమ్మడికాయల దొంగలారయన్.

చ॥ అసమశరుండు వేచ హృదయవ్యథ హేతువు నాకుఁదెల్పగా
విసవిసనేగుదెంచు; వెనువెంటనె వ్రీడతుఱంగలింప నా
విసరున వెన్కకేగి యలివేణి విరాళిని గుందుచుండుఁబో;
ముసుకున గ్రుద్దులాటలుగ ముగ్ధహాస్య వికాసయత్నముల్.

తే॥గీ॥ పర్ణముంబోలె మానంబుఁ బరిహరించి
పల్లవముబోలె రాగంబు పరిఢవించి
తలిరుగుమి వోలె నవనవోత్కలికమించి
కొమ్మ యలరారు నారాధ! ఇమ్మధువున.

మ॥ అరవిందాక్షి! మదీయనామమును నీ వాలించి నల్లంత నీ
సరసీ జాస్యముడాగురించి కబరీ సందర్శనప్రాప్తిం జే
కుఱగాం జేసితి, వైన నేమదియె మాకుం జాలదే? గంగ క
ద్దరి మే లిద్దరి యెగ్గటంచుగలదే? తారుణ్యపాథోనిధీ.

మ॥ అలకాచ్ఛాదితమై ప్రహాసయుతమై ఆకర్ణనేత్రాంతమై
సులభానందదమై, సుధాంశునిభమై, సూనాంబకావాసమై
విలసత్కుండల యుక్తగండతలమై వెల్గొందు నా హేళినీ
జలజాతేక్షణమోము, నేమఱి నేజాడన్ విలోకింతునో.

కవి యే యన్నట్లు నారికేళ పాకమగు కామినీ హృదయ కావ్య రసజ్ఞత యీ యనకు కొంత అలవడినట్లే పద్యములుతోపఁ జేయును. పై పద్యములలో ,,కాముకులు గుమ్మడికాయలవోంగ లారయన్'', ,,ముసుకున గ్రుద్దులాటలుగ ముగ్ధరహాస్యవికాస యత్నముల్'', ,,గంగ కద్దరి మే లిద్దరి యెగ్గటంచుగలదే'', యను నవియు ,,కాముకావళి నర్మోక్తుల కొప్పునారఁ బ్రథితవ్యాఖ్యాన కాఖ్యానముల్'', అను నదియు యిత్యాదులు పై విషయమును స్పష్టపఱచుచున్నవి.

యుద్ధారంభమైన తర్వాత చాణక్యుడు చందన దాసాదులచే మోహ పీడితుడగు పాత్రికులుని వశపఱచుకొనుటయు, యుద్ధమున గ్రీకులకు చంద్రగుప్తునిచే పరాజయమును, గ్రీకుల దేశమున ఆంటిగోనసు తిరుగుబాటు చేయగా యుద్ధము చాలింపవలసిన సంవిధాన మేర్పడి సెల్యూకస్ చంద్రగుప్తునితో సంధిచేసికొనవలసివచ్చుటయు, తర్వాతి కథ. హేళినీచంద్రగుప్తుల వివాహమే పరిణామముగా వ్రాయబడిన యీ వస్తువు ఇట్లే యుండనగును.

హిందూ చక్రవర్తి చంద్రగుప్తుడు, గ్రీక్ రాజు సెల్యూకస్, అద్వితీయ ప్రతిభాశాలి రాజనీతికోవిదుడు నగు చాణక్యుడు,

అమాత్యశేఖరుడు రాక్షసుడు, దేశభక్తులు స్వామికార్య దురంధరులు నగు చందనదాసాదులు, మెగాస్థనీసు, అసదృశ సౌందర్య రాశియగు హేలెను ఈనాటకమున ముఖ్యపాత్రములుగ వెలయుచుండ, గాంభీర్యమును మాధుర్యమును ఒక్కచోట లభించినవి. హిందూ విజయమును హిందూ ప్రాగల్భ్యమును ఉద్ఘోషించు ఈ నాటకము దేశాభిమానుల నెల్లగ సహజముగనే ఆకర్షించును.

పద్యముల శైలి అతి కఠినముగాని అతి పేలవముగాని గాక రంగమున కేని పఠనమున కేని కడుంగడు ఒప్పియున్నది. సుకుమార సరస రచనగల యీనాటకము ఉత్కృష్టమై చిరకాలము ఆంధ్రజనాదరణముగాంచి వాఙ్మయాలంకారమగు ననుటకు సందియము లేదు. కవి కోరినట్లు

"క॥ ఈ కరణిం బాటువడి నే।
నేకర మొనరించినకృతి శ్రీకరమై, శో।
భాకరమై బుధజననుతి।
కాకరమై వెలయుగాత మహాశ్రాంత మిలన్॥"

నెల్లూరు, 1-11-32 ది. తూములూరు శివరామయ్య.



# కథాసంగ్రహము.

I 1. చందనదాసుఁడు వ్యాపారార్థము బాబిలను నగరమేఁగి యచ్చట శల్యూకేశ్వరుఁడు భారతభూమిపై దండయాత్ర వెడలనున్నాఁడని విని రదనికను భారతమాతృసేవకుఁ బురికొల్పుట.

2. రదనిక హేళినికి మౌర్యునిపై వలపుగొలిపి తండ్రితోడ హిందూదేశమేఁగఁ బ్రోత్సాహ మొనర్చుట.

II 1. రాక్షస చందనదాసులు సన్యసించిన చాణక్యుని మంత్రిపదము మఱల స్వీకరింపుమని వేఁడుట.

2. శార్ఙ్గరవుఁడు మైత్రేయు సాయంబున చాణక్యునకు అమాత్యోచిత వస్త్రంబులఁ దెచ్చియిచ్చుట.

3. చంద్రగుప్తుఁడు యవన రాయబారుల రావించి ప్రత్యుత్తర మిచ్చుట.

III 1. హేళిని మోహము, శిఖరకుని శల్యూకేశ్వరుఁడు ప్రశ్నించుట. రదనిక శిఖరకుని చంద్రగుప్తునికడకు పంపుట.

2. శిఖరకుఁడు చంద్రగుప్తునకు హేళిని మోహ వృత్తాంతము నివేదించుట.

3. హేళిని రదనికకు తన మోహమును దెల్పుట. పాత్రికులుని మోహమును నిరసించుట. చంద్రగుప్తుడు వచ్చి హేళిని నోదార్చుట.

4. పాత్రికులుఁడు శల్యకేశ్వరునితో హేళిని మౌర్యుని బిలిపించినదని చెప్పుట.

5. శల్యకేశ్వరుఁడు హేళినిని పాత్రికులు బెండ్లాడుమని నిర్బంధించి ప్రయోజనము గానక చెఱయందుంచుట.

IV 1. రదనిక హేళిని దుఃఖవార్త దెల్పి మౌర్యుచే నభయహస్తము పడసి పోవుట.

2. చాణక్య రాక్షసులు సంధి విషయము నాలోచించుట. చందనదాసును బాత్రికులుని శిఖాంగుళీయకమునకై పంపుట.

3. చందనదాసు వైద్య వేషమున బాత్రికులుని వంచించి శిఖాంగుళీయకము గొనుట.

4. చంద్రగుప్తుఁడా శిఖాంగుళీయకముఁ జూపి హేళినీ రదనికల దోడ్కొని వచ్చుట.

V 1. చాణక్య చందనదాసులు శల్యకేశ్వరుని సంధి కొడంబడఁజేయుట.

2. హేళినీ చంద్రగుప్తుల వివాహము.

భరత వాక్యము.



# నాటకపాత్రములు.

## పురుషులు.

1. చంద్రగుప్తుఁడు (మౌర్యుఁడు, వృషలుఁడు) మగధాధీశ్వరుఁడు, కథానాయకుఁడు. II 3, III 2 & 3, IV 1 & 4, V 1 & 2.

2. చాణక్యుఁడు (విష్ణుగుప్తుఁడు, కౌటిల్యుఁడు) మగధాధీశ్వరుని గురువు. II I & 3, III 2, IV 2, V 1 & 2.

3. రాక్షసుఁడు, మగధాధీశ్వరుని మంత్రిపుంగవుఁడు. II 1 & 3, IV 2.

4. మైత్రేయుఁడు, మగధాధీశ్వరుని వయస్యుఁడు. II 2 & 3, III 2, IV 1, V 2.

5. చందనదాసు, మగధాధీశ్వరుని మంత్రి. I, 1, II, 1 & 3, IV 3, V 1 & 2

6. శిఖరకుఁడు, మలయకేతుని సేనాని. III 1, III 2.

7. శార్ఙ్గరవుఁడు, చాణక్యశిష్యుఁడు. II 1 & 2, IV 1 & 2.

8. చంద్రపాలుఁడు, కంచుకి ప్రతీహారి. II 3, III 2, IV 1.

9. సెల్యూకేశ్వరుఁడు, సిరియా దేశాధీశ్వరుఁడు. I 2, III, 1, 4 & 5, V 1 & 2.

10. పాత్రికులుఁడు, సిరియాదేశాధీశ్వరుని సేనాని. I 2, II 3, III 1, 3, 4 & 5, IV 3.

11. మెగస్థానీశ్వరుఁడు, సిరియాదేశాధీశ్వరుని మంత్రి. II 3, III 4, V 1 & 2.

12. హిప్పసు, సిరియా దేశాధీశ్వరుని సైనికుఁడు.

I 1, III 1, III 5, IV 4.

13. కైలక్, సిరియా దేశాధీశ్వరుని సైనికుఁడు. I 1, II 13.

స్త్రీలు.

14. హేళిని, సిరియా దేశాధీశ్వరుని పుత్త్రిక, కథానాయిక.

I 2, III 1, 3 & 5, IV 4, V 2.

15. రదనిక, హేళిని చెలికత్తె, హిందూకాంత.

I 1 & 2, III 1, 3 & 5, IV 1, 3 & 4, V 2.

16. శోణోత్తర, చంద్రగుప్తుని దాసి. II 3

ప్రస్తావవశమున వచ్చు పాత్త్రములు.

1. అలీసాందరుఁడు, మాసిడోనియాభూధవుఁడు, ధీరాగ్రేసరుఁడు.
2. అంటియోకసుఁడు, శల్యూకేశ్వరుని కుమారుఁడు, హేళిని అన్న.
3. అంటిగోనసుఁడు, యావనభూపతి, శల్యూకసు శాత్త్రవుఁడు.
4. మలయకేతువు, హిమవత్పర్వతేశ్వరుఁడు, చంద్రగుప్తుని సామంతుఁడు.
5. బిందుసారుఁడు, చంద్రగుప్తుని పుత్త్రుఁడు.

# నాంది.

ఉ॥ శ్రీకరుఁ డై యశేషసురశేఖరుఁ డై త్రిజగత్ప్రశస్తశో
భాకరుఁ డై విపద్ధిమదివాకరుఁ డై నిజభక్తశుద్ధభా
వాకరుఁ డై రిపువ్రజభయంకరుఁ డై వెలుఁగొందుచుండు ద
ర్వీకరరాజశాయి యలరించుత సభ్యులఁ గామ్యదాయి యై.

మ॥ ధరణీనాటకరంగమం దుచితపాత్రవ్యూహముం గూర్చి వా
సరనామాంక విభక్తజన్మదిమముల్ ధ్వాంతవ్యముం జేయఁగా
నరులన్ సృష్టి యొనర్చి సూత్రధరుఁ డై నాట్యంబుఁ జేయించు నా
పరముం డోముత మీ సభాసదుల సంపద్వ్రాతసంధాత యై.



# పూర్వరంగము.

సలలిత శేముషీవిభవ సంగతులార! స్వదేశభక్తి సం
కలితమనస్కులార! పరికల్పితధీరచరిత్రులార! యెం
దులకయి గ్రంథకారుఁడు వినూతనరీతిని బూర్వరంగమం
చలఁతిగ వ్రాసినాఁడొ, వినుఁడయ్యది వచించెదఁ; బూర్వమం
దలఘుచరిత్రయై యతిభయంకరయై యమలప్రతిష్ఠయై
బలజనయిత్రియై మనిన భారతమాతకు నేటికాలమం
దలవడినట్టిపాటు హృదయమ్మున దుఃఖమునింప లంకణం
బులమనుగుడ్పు భోజనపుఁబొంకములన్ స్మరియించురోగియుఁ
బలెఁదలపోసి దీనవచనంబొనరింపఁదలంచె; నింకనాం
గ్లుల కళలభ్యసించి గుణకోవిదులౌచు స్వపాలనాశయో
చ్చలితమనస్కులౌచు పరసద్వ్రతులౌచు భగీరథోద్యమం
బులఁబొనరించుమిమ్మిపుడు మూఢులుకొందఱుచేరిమీఁదనుం
గలిగెనె యాత్మగౌరవము గల్గెనె వైరి వినాశనప్రభా
కలనము గల్గెనేగుణవికాసముగల్గెనె యైకమత్యముం
గలిగెనె ధారుణీభరణకార్యధురంధరతా పటుత్వముం
చలుచుగఁ బల్కుచుండ బదులాడఁగనోడక మాకుగూడ ము
న్గలిగెనివన్ని యున్మతియుఁగల్గెనిఁకెన్నియొ యట్లె యిప్పుడుం
గలుగగనున్న వాంగ్లజనకాంతునిసత్కృపచేతనంచు మీ
రలుకవతో వచించుకొంటి కాదిమహైందవసార్వభౌము ని
స్తులగుణభూము శాత్రవనిషూదనయోగ్యనికాము లోకకం

దళితయశోభిరాము భరతక్షితిమాతృశుభప్రకాము సం
ఫలితవిరాము మహార్యకులవార్ధిసోము మహాచరిత్రలో
పల నతఁడెట్టులం యవనపాలకుశల్యుకు సేనలం గుతూ
హాలమున విష్ణుగుప్తసచివాదులసాయముచే రణస్థలిం 24
గలఁచి, మదంబడంచి యధికంబగు రాజ్యమునాక్రమించి త
త్కులతిలకంబు హేళిని చకోరవిలోచన చెట్టఁబట్టెనో
తెలిపినవాఁడు శక్తిఁగొలఁది న్వినుచుండెను హైందవాళికిం
బులకలు దేర, నెమ్మది ప్రమోదముగూర, మనోగథంబులుం 28
జిలిబిలిఁబాఱ, హైందవ విజృంభణ వైరులకెల్లకంటినీ
రొలుక, విషాదముంగులుక నుత్కలికల్ మొయిఁబ్రాఁక; నింకనిం
దులఁగల తప్పులోర్చి పరితోషితచిత్తులరై దయాళురై
వలఁతిగఁజూచిప్రోవఁగ సభాసదులార! నమస్కరించెదన్. 32

శ్రీ

# చంద్రగుప్త నాటకము.

## ప్రథమాంకము—ప్రథమరంగము.

స్థలకము:—బాబిలాను పట్టణము, రాజవీధి.

(చందనదాసు క్రోధమూర్తియై ప్రవేశించును.)

చంద:-సీ॥ అనయంబుఁ గనుమల ననిమేషులై కాచు
గిరిచరులోకక్రేవఁ గేరుచుండ
నెవ్వారినేన్ గ్రొవ్వి చివ్వకుఁ గాల్ద్రవ్వు
తక్షకులోకపట్టు దవిలియుండ
భుజముల కండూతిఁ బోఁగొట్ట వాంఛించు
మాగధులోకమూల మలయుచుండఁ
బులిమీనములను నుయ్యాలలూఁగ గమకించు
నాంధ్రులింకొకవంక నలమియుండఁ
తే॥గీ॥ జంద్రగుప్తుండు రాజ్యంబు సల్పుచుండ
రాక్షసుఁడు ముఖ్యసచివుఁడై క్రాలుచుండ
విష్ణుగుప్తుండు ధాత్రి జీవించియుండ
హిందువుల గెల్వ సాధ్యమే యేరికైన.

నాఁడు మే మనేకరాజపశులమై యంతఃకలహాంతరితమనస్కులమై యత్యంతదీనావస్థ నుండఁ గాంచినవిజయమును నేఁడుగూడఁ గాంచెద మనుకొని వీరు మాపై దాడివెడలనున్నారు. వీరిభ్రాంతి కేమనవచ్చు?

మ॥ ఎపుడో యెట్టులొ యేపరిదేశముననో యెవ్వారినో యార్యధా
త్రిపులం గొందఱఁ గెల్చినారమని యీగ్రీకులు మదోన్మత్తులై
ఇపుడీ భారతమాతృశత్రునిధనాభీష్టాప్తు శ్రీవిష్ణుగు
ప్తు పరిత్రాణముఁ గాంచు మౌర్యవిభుతోఁ బోరాడ శంకించిరే.

కానిమ్ము దీనికిఁ దగినశాంతి కాకుండునా? (తెరలో నవ్వులు, చప్పట్లు వినఁబడ నాలకించి యావైపుఁ జూచి) అదుగో! సురాపణమునుండి యవనిక సైనికు లిటు చేతులు సేతులు పట్టుకొని సొక్కుచు సోలుచు వచ్చుచున్నారు. ఇదుగో! ఈ మూల డాగికొని వీరి సంభాషణ మాకర్ణించెద.

(అట్లొనర్చు. త్రైనుడిపిన యవనసైనికులు నలుగురు ప్రవేశింతురు)

కైలన్: ఫిలిప్! ఆ మాట పోనీ కాని ఇండియానుండి నీవేమి తెచ్చుకుంటావో చెప్పకపోతివే?

ఫిలిప్: నేనా! రదనికవంటి ఒక చక్కని చుక్కను గొట్టుకవస్తా.

చంద: (జనాంతికము) యవనకన్యల మా సైనికులు చెఱఁబెట్టుకున్నఁగదా!

కైలన్: భళి, భళి, (నవ్వుచు) ఆ నల్లపిల్లతో బాగా సుఖపడవోయి! ఆర్డమిస్! నీకుగూడా ఒక నల్లపిల్లగావలెనా? వేఱేమైనాగావలెనా?

ఆర్డ: ఇంట్లోవుండే తెల్లపిల్లతోనే తల బట్టగట్టిపోతుంటే నాకింకా నల్లపిల్ల ఒకటెందుకోయి! నాకు పాలిబోత్రములోవుండే సొమ్ములు కావలెనోయి.

చంద: (జనాంతికము) మీదేశము సొమ్ములు మాకు రాకున్నఁగదా?

కైలన్: మీ ముసలాపెకుఁ బెట్టడానికటోయి? (అందరు నవ్వుచు చప్పట్లు గొట్టుదురు.)

ఆర్డ: నీ పరియాచకాల కట్టిపెట్టు కైలన్! నీకేమికావలె చెప్పవోయి.

కైలన్: నాకు పిల్లవద్దు. గండరగండడని పేరువస్తే చాలు.

చంద: (స్వగతము) ఉండినకీర్తి బోఁగొట్టకొనకున్నఁజాలు,

ఫిలిఫ్: సరే! అన్నివున్నవానికి నీకదేకదుకావాల! ఒరే హిప్పస్! మేమిట్లా వాగుతుంటే నీవేమిరా బెల్లముగొట్టినరాయివలె నున్నావు! నీవేమి తెచ్చుకుంటావురా! తొందరగా చెప్పు (ముందుకులాగును.)

హిప్ప: ముసలివానికి నేమిటెందుకు! ఆ మాయావి హిందువుల వాతఁబడక ప్రాణాలతో బయటపడితినా అదియే నాకు పదివేలు.

కైలన్: ఎవఁడురా నీకీ పిరికిమందు పోసినవాఁడు. మనకొకగనిచూస్తే భయమట్రా? మనదెబ్బకొక—

హిప: నీవు నామాదిరి ఒకసారి దెబ్బతింటే ఎట్లా అనేవాడివో తెలిసేది! ఆ చంద్రకోస్ధను కొకగురువు చాణకాస్ అనేవాడున్నాడు. వాడిబందపద వాడెక్కడ నుండాకొడుకోయి? నేను చెప్పాగదా! వాడు మనకొంప దీస్తాడు చూడు.

సైలక: (నవ్వుచు) వాడికోసరమంట్రా నీవింత బెదిరేది? వాడెప్పుడో యీ ప్రపంచము వదలి బోడి కొట్టించుకొని మూల గూర్చొని ముక్కుఁబట్టుకొని దొంగదేవుళ్ళ గొలుస్తున్నాడు.

హిప్ప: అయితే యింకంతా మనదే! మనదే! (ఎగురుచు చప్పట్లు కొట్టుచు నిష్క్రమింతురు.)

చంద: (బయటికి వచ్చి) ఏమీ! మా సెదోనియనుల యల్పసంతోషము! మార్యునితో యుద్ధారంభము నిశ్చయించినంతనే తమకు జయము కరతలామలకమైనట్లు నవ్వుచుఁ జేతులఁ జఱచుచుఁ ద్రుళ్లి త్రుళ్లి పడుచున్నారు. నేటి నవ్వులు నాఁడు నువ్వులు గాకుండునా? ఇప్పుడు చేతులు చఱచెడువారు రేపు చేతులు పిసుకుకొనకుందురా! ఈ మూర్ఖులార్యచాణక్యుడు సన్న్యసించెనని సంతసించుచున్నారు. ఆ మహానుభావుని దేశభక్తి వీరికెట్లు విదితము? ఓరి యవనదేవానాంప్రియులారా!

శా॥ సన్న్యాసంబును స్వీకరించెనఁ గదా చాణక్యుఁ డింకేమి, హిం
దూన్యక్కార మొనర్పవచ్చునని సంతోషింపఁగాఁబోకుఁడా
మానగ్రామణి మీరు హైందవుల నొంపంబూన. సన్న్యాసముల్
గిన్న్యాసంబులు ద్రోసివచ్చు, సచివక్రీడావనోత్సాహియై॥

ఆ మహనీయచరితుఁ డెట్లొనర్చునని యీమూఢులు తెలిసికొనలేక పోవుదురుగాక, వీరిరాజైన నింతమాత్ర మెఱుంగఁడాయెనా; లేక యెఱిఁగియుఁ దనకు సర్వత్ర సర్వదా జయ మొనగూడునని యిట్లొనర్చుచున్నాడా? అట్లే యుండ నోపు. ఏమి వీని మదాంధత?

శా॥ సాధింపం దరమే భవాదృశులకో సెల్యూకభూనాథ హిం
దూధాత్రీశ్వరు మార్యు నాతని కమాత్యుండై గురూత్తంసుఁడై
మేధాశాలి స్వదేశభక్తగుణగాంభీర్యుండు హైందవస్వర
జ్యాధారేయుఁడు విష్ణుగుప్తబుధుఁ డశ్రాంతంబు బోధింపఁగన్॥

ఇదిగో రదనిక యిటు వచ్చుచున్నది. నేఁడు జరిగిన వృత్తాంత మేదో కనుగొనియెద (రదనిక ప్రవేశించి నమస్కరింప నాశీర్వదించి) రదనికా! నేఁటి యుదంతముఁ గనుగొంటివా?

రద: ఆర్యా! అందులకు సందియ మేమి? నాకు సర్వవిషయముల తూచా తప్పక నివేదించు హేళినియు నామెకుఁ బ్రతివిషయమును దెలుపు తండ్రి సెల్యూక సుండ నిదెంత పని! నేఁటియుదయమున సెల్యూకసు పంపున నరకోసియానుండి మెగాస్తనీసు వచ్చి యియ్యెడ నీదండయాత్ర ధర్మము కాదనియు జయప్రదము కానేరదనియు నెంతయు బోధించె అయిన నా భూపాలుఁడు సేనాని పాత్రికులు ప్రేరణంబున నీతని వాక్యంబులఁ బెడ చెవిఁ బెట్టెను.

చంద: రాజ్యతృష్ణాధాత్రిచే వివేకరుచిఁ గోల్పోయిన యీరాజు సద్బోధనల నిరసించుట యుక్తమే కదా? ఈ మెగాస్తనీసిచ్ఛానాదనలాడు తుచ్ఛుఁడు గాక యవనుల మేలుగోరు హైందవులబల మెఱింగి యిట్లు వాక్రుచ్చె. ఈతని వాక్యములు సత్యారూఢములు. హైందవు లేక రాజవశులై ఏకఫలాభిజ్ఞులై యపూర్వపరాక్రమక్రములై విజృంభించుచున్నారు. అకారణముగా నధర్మయుద్ధమునకు నడుముకట్టిన నపజయము రాకుండదు. మఱియు నలువది యేఁబది జాతులుగల రాజ్యమున శాంతి క్షణభంగురము. పరదేశమున బాలకులకొక్క పరాజయ మొదవినఁ దత్క్షణం మల్లకల్లోలము లుప్పతిల్లు. ఒక్కచోఁ దిరుగుఁబాటు జరిగిన దూదికి నిప్పంటినట్లు దేశ మంతయు నావరించు. అదియుగాక అంటిగోనసు మున్నగు శత్రువులు శేషించియుండగనే కొండొక బలవద్వైరమునకుఁ గాలుచాచుటయుక్తము. పోనిమ్ము! వారికి లేని చింత మనకేల?

రద: తరువాత రాజన్యుఁడు మెగాస్తనీసును కూడ పాత్రికులనితో మౌర్యునొద్దకు రాయబారిగా నేగి సింధురాజ్యంబును మగధ రాజ్యంబునకుగా మృన్నీరంబుల నడిగి రమ్మన నాతఁడెంతయు సంకోచించి రాజాజ్ఞపై నెట్టకేలకు నియ్యకొనియె.

చంద: (నవ్వుచు) ఆహా! రాజ్యసంపాదనాభిలాషికి సంగ్రామము వలయుఁగాక సందేశముతోఁ గార్యమేమి? ఈ నిరర్థకపు రాయబార మేల?

శా॥ హిందూదేశము హైందవీయులకె కా కెందున్ విదేశీయరా
ట్సందోహమ్ముల కిల్లు గాదని సదా సర్వత్ర సాటించి మా
ర్త్యేందుం డేలుచునుండ సంగర మొకండేగాక యీ వైఖరిన్
సందేశం బొకఁ డేల హైందవరమాసంపాదనోత్సాహికిన్॥

ఎవరపిచ్చి వారికానందముగదా? రదనికా! మెగస్తనీసు రాజునకుఁ గలిగిన దండయాత్రోన్మాదముఁ బోగొట్టునని బాగుచేసితి. ఇంక నట్టి యాశలు నిరాశలే. యుద్ధము తప్పదు. కావున నేను రేపే మన దేశమునకు వెడలి కార్యవిజయంబునకై తగుయత్నము లొనర్చెద. అయిన నొకమాట. నీవు బుద్ధిశాలినివి, దేశభక్తురాలవు. ఇయ్యదియే నీ బుద్ధికుశలతను నీ దేశభక్తిని జాటుట కుచితమగు సమయముసుమా!

ఉ॥ మందుఁడు గాఁడు మ్లేచ్ఛుఁడు సమానపరాక్రమముండి తుండు రా
జేంద్రదిరక్తై తలంపకు మహీశుల సిద్ధుల నొక్కఁడే జయం
బందగలాఁడు గాన వనజానన మేలునకంటెఁ గీడు ము
న్నెంద దలంచి నీకుఁ దగు పూనిక నుండు జయోపలబ్ధికై॥

రద: ఆర్యా! నేను మీవలె యంతలేని కార్యంబులఁ జేయులేకున్నను నుడుతకు నుడుతభక్తి యనినట్లు నాకుఁ జేతనైనది సేయకుందునా? మఱియు నట్లొనర్చుట నాకు విధిగాదా?

ఉ॥ క్రూరగవిపక్షసైనికనిరోధవిపద్దశఁ గుందఁబోవు శ్రీ
భారతమాత కియ్యెడ నపాయముఁ బాయఁగఁ జేసి సర్వదా
భారతదేశవాసుల యపారకృతజ్ఞతఁ గాంచుకంటె నీ
ధారుణి, భారతీయులకు ధర్మము కొండొకటుండ నేర్చునే॥

చంద: రదనికా! బాగుగా నుడివితివి. ఇంక నే నేగెదను. చెప్పటియట్లు యవనుల రహస్యముల మన శకటదాసునకుఁ దెల్పుచుండుము, కార్యము జయప్రదముగాఁ జేకూరు.

(నిష్క్రమించుదురు)

రద: (నడచుచు) అక్కటా! ఆర్యచందనదాసుని పొగడ్త కుబ్బితబ్బిబ్బై ఒడలెఱుంగక మోయలేని కార్యభారము నెత్తిపై నిడికొంటి. ఇక్కార్యమును జయప్రదముగాఁ గొనసాగించుటెట్లు? ఇంతదనుక నిక్కడక్కడ వినిన సమాచారములఁ గష్టమావంతయు లేక పూసగ్రుచ్చినట్లు రాక్షసగూఢచారులకు నివేదించుటయే నాకుఁ గర్తవ్యముగానుండె. ఇంకనంతమాత్రమునఁదృప్తిఁ బొందుటకు వీలులేదుగదా! అంతకంటె ఘనకార్యమొనర్చి నామాట నిలుపుకొనవలయును. ఏమియొనర్తు? ఏదినాకు సాధ్యము? వేనవేలు యవనవీరులలో నేనొక్కతెను, అబలను, బేలను, విజాతీయను! ఛీ! ఉత్సాహ మొక్కటి కలుగ నిట్టివి కార్యాచరణమున కడ్డువచ్చునా? (యోజించుచు) ఆహా! ఇదియే దీనికిఁదగిన యుపాయము. నామాట జవదాఁటని సెల్యూకస్ పుత్రి హెలెనే నా కాధారము. ఆమె మూలముననే నాకార్యము చక్కఁబడవలయును. (యోజించి) అక్కటా! ఆ నాతి నన్ను నమ్మినదే! ఆమెకు ముప్పు నాటిల్లఁజేయ వచ్చునా? ఛీ! ఇది నా బేలతలంపుగాక ఇక్కార్యముచే నాయంగనామణికి సౌఖ్యము గలుగకుండునా? మఱియు యవన హైందవులకుఁ జిరంతనమైత్రిఁగల్పించి యిరువుర కృతజ్ఞతకుఁ బాత్రురాలనుగానా! ఇదియే నాకుఁ గర్తవ్యము. (నవ్వుచు) అబ్బా! ఇప్పటికి నా మనసు కుదుటఁబడియె. ఈ గ్రీకుల నింతవఱకు తూలనాడుచుంటి. ప్రస్తుత మాలోచింప వీరిఁబోలు సుహృత్తులు నాకుండు టరుదు.

చ॥ ఎఱుకఁగలార లార్యజనులే జననీపద సేవ స్వర్గసం
వరణముకంటె శ్రేష్ఠమని పల్కెదరట్టి స్వదేశమాతృ సే
వరచన సేతుఁ, హైందవుల వైరముతో, పనిలేనినాకు వే
గిరమున వీలుగూర్చిరల గ్రీకులఁబోలు సుహృత్తులుందురే॥

ఇఁకఁబోయి నాయుద్యమమునం దప్రమత్తనై చరించుచుండెద.

(నిష్క్రమించును.)

# చంద్రగుప్త నాటకము.

## ప్రథమాంకము—ద్వితీయరంగము.

**స్థలము:- బాబిలాను పట్టణము; అంతఃపురము; హెలెన్ మందిరము.**

(హెలెన్,రదనిక ఒకపడకపైఁగూర్చుండియుందురు.రదనిక పటములఁజూపుచుండును)

రద: ఇదిగో! ఆ శిఖరమునకంటె నున్నతమైన శిఖరము. దీనివంటి ఉన్నత శిఖరమీ ప్రపంచమున లేదుసుమా! (హెలెన్ పరధ్యానయై యుండుటఁగాంచి) హెలెన్! హిమవత్పర్వతాది చిత్రపటముల నిన్న మొన్న గాంచినంత శ్రద్ధతోఁ గాంచుటలేదేమి? అప్పుడే వీనిపై విసువుజనించెనా? అట్లయిన నేను వీనిని గొనిపోయెద (అట్లుచేయుచు) నీకులేని అక్కఱ నాకేల?

హెలెన్: (లేచి చేయిపట్టుకొని) రదనికా! రమ్ము. రమ్ము. కోపగింపకుము. వీనిని ఎన్నిపర్యాయములు గాంచినను దనివిదీరుటలేదు. నీవీ విషయమునఁ బొరపడుచున్నావు.

రద: అవును; నిక్కముగా నేను బొరవడుచున్నదాన. యౌవనవతులకు దర్శనీయాంశములు వేఱుండ రాళ్ళు రప్పలపై మనసెట్లుపోవును?

హెలెన్: రదనికా! నీ పరిహాసమేల, నితరాంశములఁ జూపుము.

రద: పోనీకాని, మీవారి చిత్రములనా మావారిచిత్రములనా?

హెలెన్: మావారివి మాకుఁ గ్రొత్తలా!

రద: ఏ కథా సందర్భములందలి చిత్రములఁ జూపుమనెదవు.

హెలెన్: మ॥ అతివా! నందపరాభవప్రతిక్రియావ్యాజంబునన్ భారత
క్షితిపాలోచ్చయమోర్చి తత్పరగతశ్రీ గొంచుఁ జాణక్యుఁడా
శ్రితుఁడౌ మౌర్యుని రాజుఁజేసిన కథాశేషంబు మున్నుండుగా
శ్రుతిపేయంబుగ వింటి, నియ్యెడలఁజక్షుఃప్రీతిగాఁజూపవే।

రద: అట్లే కానిమ్ము (కొన్ని పటములఁ ద్రిప్పి) ఇదిగో పాటలీ పుత్రనగరము. గంగా శోణానదీ సంగమస్థానము. ఇదిగో దారుమయ ప్రాకారము. ఇదిగో అఱువదినాల్గు ద్వారములు. అయిదువందలడెబ్బది అట్టాలకములు. ఇదిగో సుగాంగభవనము. ఇదే భోజనశాల, వీరిగో నవనందులు, వీఁడుగో క్రోధా పరావతారుఁడగు చాణక్యుఁడు.

మ॥ నవనందుల్ ధనగర్వపూర్ణమతులై నాఁ డగ్రపీఠస్థుఁ ద
న్నవలీలన్ శిగఁబట్టి గెంటు నెడ నత్యాకృష్టచేతస్కుఁడై
యవమానించినవారి నాశనము సేయంగల్గునందాఁక నే
సవరింప న్శిగనంచు బాసగొను నీచాణక్య వీక్షింపుమా.

హెలెన్: (కన్నులు మూసికొని) ఇంకొక పటమును దొందఱ గాఁచియుము. వీనిఁ జూచిన దేహము కంపించుచున్నది. ఈ చిత్రకారుని నైపుణ్యమును వేనోళ్ళఁ బొగడఁదగును గదా!

రద: (త్రిప్పి) ఇదిగో! ఆక్రోధావతారుని మఱచి ఈసౌమ్యాకారునింగాఁచుము. ఈతఁడెవ్వగో కనుఁగొనఁగలవా? చాణక్య సాచివ్యంబున నందాదుల మర్దించి పట్టాభిషేకోత్సవ శోభితుఁడగు చంద్రగుప్తుఁడు.

హెలెన్: ఏఁడీ! (పటమును జైకొని లేచి)

మ॥ ఇతఁడేనా నవనందశిక్షితనృపాలేంద్రానుభూతాతత
క్షితిసామ్రాజ్యధురీణుఁ డాత్మబలసాక్షీభూత రాజన్య సే
వితపాదాంబుజుహృద్యయుండు సమరోద్వేగార్తసంపాలనుం
డితఁడేనా! ఇతఁడేన! భారతధరిత్రీశానుఁడో నెచ్చెలీ.

ఎంత సౌందర్యవంతుఁడు! కృష్ణవర్ణులకును ఇట్టి సౌందర్యముండునా? చెలీ! ఇది యథార్థరూపమా? లేక చిత్రకారుని భావనాజనితమా?

రద: ఈ చిత్రకారుఁ డసార్థుఁడు. మాయ్యుఁడింతకంటె నూరురెట్లందము గానుండును. సౌందర్యమంతయు శ్వేతవర్ణులపాలి సొమ్మనియు వైరూప్య మంతయుఁ గృష్ణవర్ణులపాలి కాణాచియనియు నింకనైన భ్రమపడకుము. ఇతఁడెంతసుందరుఁడో యంతశూరుఁడు సుమా.

శా॥ చేసెన్ గ్రీకులఁ గాందిశీకులఁ, గరాసింగోసె నందాదులన్
గాసింబెట్టె విదర్భభూరమణుఁ బోకార్చెన్ సురాష్ట్రాధిపున్
వాసిం బాపె నవంతిపాలకుని, జేన న్మాపెఁ బ్రాగ్జ్యోతిష
క్ష్మాసామ్రాజ్యధురంధరుం జెలియరో! మౌర్యుండు సామాన్యుఁడే!

ఈ రాజచంద్రుఁడు సత్యపథానువర్తి, కువలయానందమూర్తి. అంతియేగాదు, అరిమనోభయంకరకీర్తి. ఇతని శౌర్యసౌజన్యసౌందర్యంబు లసమానములు. వత్సరముక్రిందట నీచక్రవర్తి పట్టమహిషి గతించె. ఇప్పుడు మఱలఁ బెండ్లియాడ నుత్సహించుచున్నాఁడు.

క॥ అనిదంపూర్వపరాక్రమ|ధనుఁడీమగధేశుఁడితనిదయితగ గానునా
యనితరదుర్లభభాగ్యం|బున కెవ్వతె నోచినదియొ పుణ్యంబోణీ.

ఇక్కడికి వచ్చి నిన్నితఁడు గాంచెనా!

హెలెన్: రదనికా! ఊరక వెఱ్ఱి నామనస్సును వికల్పింపకుము. ఇంకేవిషయమైనఁ జూపుము! (పటములనొసంగును.)

రద: (కైకొని) అట్లేకానిమ్ము. ఇది పాటలీపుత్త్రమున వసంతోత్సవము. పట్టణమెట్లు ముత్యపుఁదోరణములతో నలంకరింపఁబడినదో చూడుము. ఇది మౌర్యుని మృగయావినోదచిత్త్రము. చూడుము. రాజేఁగు మార్గమంతయు పచ్చని త్రాళ్లతోఁ గట్టఁబడి స్త్రీగణముచే రక్షింపఁబడుచున్నది.

హెలెన్: రదనికా! ఈ విశేషములఁ జూచుకొలఁది నాకు వీనిఁ దిలకింపవలయునని కుతూహలము పొడముచున్నది.

రద: మీ తండ్రిగారచిరకాలమున నచ్చటికి దండయాత్ర వెడలనున్నారుగదా! వారిని వెంటఁ గొంపొమ్మని నీవు ఏకపుత్రివి వేఁడుకొన వారందుల కంగీకరింపకుందురా?

హెలెన్: ఇది మంచి యుపాయమే. కాని మా తండ్రి రేపంపఁబోవు రాయబారమునకు మౌర్యుఁడియ్యకొని కప్పముఁగట్టి యుద్ధముఁ దప్పించుకొనునేమో.

రద: హెలెన్! రామాయణమంతయు విని రామునికి సీత ఏమగావలయు నన్నట్టున్నదే నీవాదుమాట!

ఉ॥ రాజులు సన్నుతింప, బుధరాజులజస్రము సన్నుతింపఁగా
రాజులు గొందలింపఁ గవిరాజులు స్తోత్రము లాచరింప హిం
దూజనపాలన స్సలిపి తోరపుగీర్తి గడించుచుండు
రా జోకపంద వైఖరిఁ గరంబు నొసంగునె యుద్ధభీతుఁడై.

ఎన్నఁటి కట్లొనర్పఁడు, భయపడకుము. ఇంక నిస్సంశయముగా మీ తండ్రి నడుగుము.

హెలెన్: చెలీ! మా తండ్రిమాటచే జ్ఞప్తికి వచ్చెఁగి. వారు వచ్చువేళ యయినది. ఇంకను రాలేదు. ఏమో చూచిరమ్ము. వారు రాఁగనే తోడ్కొని పొమ్మని తప్పక ప్రార్థించెదను.

రద: పోయివచ్చెదను (స్వగతము.) నేఁడి కాంత మాధుర్యలావణ్యామృతముం గన్నుల జుఱ్ఱుకొన్నది. కొలదికాలములోనే కైపు తలకెక్కఁ యవనహిం దవమైత్రి కాధారము కాఁగలదు.

(నిష్క్రమించుటనభినయించును.)

హెలెన్: (పటముఁగైకొనిచూచి)

ఉ॥ బాపురె! దైవ మిట్టి దురవాపపరాక్రమధుర్యు నిట్టివి
ద్యాపరిపూర్ణు నిట్టిసుగుణాంచితు నిట్టిసురూపు నిట్టిధా
త్రీపతిచంద్రుఁ బూజ్యమగు గ్రీకులవంశమునందుఁగాక యి
ట్లే పొరపాటుచేత సృజియించెనొ న్యూనపు హిందు
జాతిలోఁ॥

నాబోఁటులకుఁ గోరరాని విషయముగాఁ జేయుటకుఁ గాబోలు.

రద: (స్వగతము) భళీ! నాయూహయే నిజమయ్యె. ఇంక నాయెత్తు కొనసాగినదే.

హెలెన్: అయిన నేకామిని యుల్లం బీతని గాంచినంతఁ బల్లవించి ప్రణయోత్కృతి కంగనదు.

రద: (కనఁబడి) చెలీ! వీఁడుగో మీ తండ్రిగారును ప్రాత్రముల సేనానియు వచ్చుచున్నారు (పటములఁదీసి దాఁచి) మీతండ్రిగారి నడుగక మఱచెదవేమో!

(సెల్యూకస్ పాత్రకులు ప్రవేశింతురు. హెలెన్ లేచి తండ్రికి నమస్క-
రించును. అతఁడు హెలెన్‌ను దండఁజేర్చికొని)

సెల్యూ: అమ్మాయీ! రేపు పాత్రకుఁడు హిందూదేశమునకు మన రాయబారిగా నేగుచు నిన్నుఁజూచి పోవచ్చె. యుద్ధము తప్పునట్లులేదు. అయిన యుద్ధ ధర్మానుసారము రాయబారము నంపుచున్నాను. నేనును సుముహూర్తము నిర్ణయించుకొని ససైన్యముగా వెడలెదను.

హెలెన్: తండ్రీ! నన్ను మీవెంటఁగొనిపోవరా! మీరంతదూరమేఁగ నేనిందొంటరిగ నుండఁగలనా?

సెల్యూ: హెలెన్! ఇదెట్టికోరిక! ఇట్లు కోరఁదగునా.

మ॥ వనిలో వేఁటకుఁబోవుచోఁ, బురములో వాహ్యాళి కేతెంచుచో
దినమున్ దేశముఁజూడగా నరుగుచో దేవాలయంబేఁగుచో
బ్రణయోద్వాహముఁ గాంచగా వెడలుచో రావచ్చునేకాని
ఇట్లనికింబోయెడు వేళ వెంటఁ జననౌనా? స్త్రీలకున్ బాలికా!

హెలెన్: తండ్రీ! వచ్చిన భయమేమి. మీరు దండనుండ నాకేమి లోపము వాటిల్లు?

రద: రాజేంద్రా! తమకీజయఁబుఁ గన్నులారఁగాంచ నిట్లు వేఁడిన నిందుతప్పేమి?

సెల్యూ: అయిన యుద్ధభూమికి యువతులు రావచ్చునా! సేనానీ! నీ యభిప్రాయమేమి?

పాత్ర: (స్వగ) హెలెన్‌ను దినదినము గన్నులపండువుగాఁగాంచి భాషించుట కదియే యదను కాఁగలదు (ప్రకాశము) ఇందులకు నా యభిప్రాయమును వలయునా?

శా॥ కాంతానీకము చుట్టుముట్టుకొన నేకాంతంబు శుద్ధాంతసౌ
ధాంతర్భాగంబుననుండి కాంతబలె రాజ్యంబేలు హైందవ్యభూ
కాంతున్ బైకొని పోరనేఁగు నెడ నిక్కంజాతపత్రాక్షి ని
శ్చింతన్ దోడ్కొని పోక చేయనగునే సిద్ధాంతరాద్ధాంతముల్.

సెల్యూ: హెలెన్! అట్లే కానిమ్ము! నీకోర్కె నేద్రోసివేయఁగలనా! ప్రయాణసన్నాహమునసుండుము. నేనేగి సుముహూర్తమెపుడో కనుగొనియెద.

(నిష్క్రమించును.)

హెలెన్: మిత్రమా! నీవొనర్చిన సాయమునకెంతయుఁ గృతజ్ఞురాలను.

పాత్ర: హెలెన్! మనమధ్య నిట్టి మాటలేల. నీ యభీష్టము నా యభీష్టము గాదా? మఱియు నీవు సైన్యము వెంట వచ్చిన నిమ్ముఁజూచు భాగ్యము నాబోంట్లకు లభించు, అదియే నాకు పదివేలు.

హెలెన్: నేనును మీ విజయములఁ గాంచవచ్చుగదా. భారతీయులఁగూర్చి ఈ రదనిక చిత్రవిచిత్రముల నుడువుచుండు. అందు సత్యాసత్యములఁ దెలిసికొనియెద.

పాత్ర: రదనిక మాటలకేమిలే! ఆతన్వి దేశాభిమాన మతిశయోక్తికిఁ బురికొల్పి యుండును.

రద: (పెట్టెల సవరించుచు) మా దేశమునుగూర్చి యబద్ధమాడి మీ మెప్పు వడయవలసిన కాలమింకను రాలేదు. మీరచ్చట కేగనున్నారు. నిజము మీకే తెలుకపడఁగలదు. నెచ్చెలీ! ఈ నగల నిక్కడనే విడచివత్తువా! లేక తోడ్కొనివత్తువా.

హెలెన్: తోడ్కొనివత్తును. వాని నొకపేటికయందు భద్రము చేయుము.

పాత్ర: హెలెన్! ఆ దేశమున నేమైన యపూర్వాభరణములున్నఁ దెచ్చుకొనరాదా?

రద: చెలీ! ఈ నగల నీరత్నపుబేటిక నుంచుదునా లేక దంతపుబెట్టెనుంచుమనెదవా. (సామగ్రి కదల్చి శబ్దము చేయును.)

హెలెన్: ఆ దంతపుబెట్టెయందుంచుము. సేనానీ! ఇక బోయిరమ్ము. నీ రాయబారము జయంబగుగాక. (లేచి రదనికతో నిష్క్రమించును.)

పాత్ర: (పరిక్రమించుచు) నేడును, నిన్నమొన్నటివలె పదినిముసములయిన నిల్చి మాటాడక పని సాకుపెట్టి నన్నంపెను. ముందెపుడు నే వచ్చినను ఉన్న పనులన్నిటిని వదలి నాతో సంభాషించి నన్నానందాబ్ధి దేలించుచుండెడిది. ఇప్పుడీ మార్పునకుఁ గారణమేమో! ఆతన్వినడిగిన? ఏమియు లేదనును. చెలికత్తె రదనిక నడిగిన? నా చిత్తభ్రాంతి దొలఁగునేమో! ఏమో నా యంతరాత్మ హెలెన్ వర్తనమున నేదో మార్పుగలిగినదని బోధించుచున్నది. ఇదియే రూఢి. చకోరములకు వెన్నెల మాత్రములను, ప్రేయసీమోహపీయూషంబుచే జీవించుకాముకునకుఁ బ్రేమమాధుర్యములు పరతెలిఁగింపవలయునా.

ఆర్యులు నుడివినట్లు గాలిఁ బక్షినడక, కడలి నావనడక, విధుని పొలఁతి నడక, నెవ్వరెఱుంగఁగలరు? ఏమైన నేను హేలిక చెంతనే యుందునుగదా! అంతయు జాగరూకుఁడనై కనిపెట్టి, వలసినట్లొనర్చెద.

నా కిట్టి యనుమానము తనయందుఁ గలిగినట్లుఁ దోపకుండ వర్తించెద. ప్రేమ సూచక కార్యము లొనర్చెద. లేకున్న నిట్టి గోలల స్వాధీన మొనర్చుకొనుట దుస్సాధ్యము.

తే॥గీ॥ కరిని లోహశృంఖలమునఁ గట్టవచ్చు
వాజిఁ దృఢఖలీనంబున బట్టవచ్చు
యువతులను మాత్ర బంధింపనోపునట్టి
శృంఖలంబొక్కటే ప్రేమ శృంఖలంబు.

(నిష్క్రమించును.)

# చంద్రగుప్త నాటకము.

## ద్వితీయాంకము-ప్రథమరంగము.

స్థలము:-గంగానదీతీరము, తపోవనము-పర్ణకుటీరము.

(చాణక్యుడు పంచాగ్నిమధ్యస్థుఁడై ధ్యానముద్ర నవలంబించియుండ శార్ఙ్గరవుఁడు బద్ధాంజలియై వేచియుండును. కొంతకాలమునకుఁ గన్నులఁదెఱచి.)

చాణ: శార్ఙ్గరవా! ఏదో చిత్రవార్తఁ దెచ్చినట్లున్నాఁడవే?

శార్ఙ్గ: గురువర్యా! తమ దర్శనార్థము రాక్షస చందనదాసులు వచ్చియున్నారు.

చాణ: రాక్షస చందనదాసులా? చిత్రముగానున్నదే? తోడ్కొనిరమ్ము.

(శార్ఙ్గ: నిష్క్రమించును.)

(చాణక్యుఁడు పంచాగ్నిమధ్యము నుండి లేచి వేఱొకచోట నాసీనుఁడగును.)

వీరిరాక కేమి కారణము?

ఉ॥ ఎన్నడు గానివార లిపు డిన్నదు రేయిని నన్నుఁ జూడఁగాఁ
గ్రన్నన నేగుదేరుటకుఁ గారణ మేమయియుండు! మౌర్యుఁడా
పన్నుఁడొ? శత్రుశేష మభివర్ధితమో? పరసేన దాఁడిగా
నున్నదొ? ధర్మసంశయము లుద్భవమయ్యెనొ? ఏమిహేతువో॥

ఏమైన నాకు వానిజోలియేల?

(ప్రవేశము శార్ఙ్గరవుఁడు, ముందుగా రాక్షస చందనదాసులు, వారు నమస్కరింతురు)

చాణ: అభీష్టసిద్ధిరస్తు. ప్రధానపుంగవా! ఏల నిట్లు మిత్రునితో విచ్చేసితిరి? కూర్చుండుడు. (రాక్షస చందనదాసు లుచితాసనములపై నాసీనులగుదురు)

రాక్ష: ఆర్యా! కార్యార్థులమై వచ్చితిమి.

చాణ: అమాత్యశిఖామణి రాక్షసునకుఁ గోటీశ్వరుఁడు చందనదాసునకు నన్నుఁబోలు సన్యాసితో నేమిపనియుండును.

చంద: ఆర్యాగ్రణీ! తాము సావధానచిత్తులరై విని మా ప్రార్థన కియ్యకొన వలయు.

చాణ: నాకుఁ గరణీయమైన నట్టి నిస్సంశయముగా నొనర్చెద; నుడువుడు.

రాక్ష: సిరియాధీశుఁడు సెల్యూకస్ మున్ను లెగ్జాండరు మహాశయుఁ డసంపూర్ణముగా వదలిన హిందూదేశజైత్రయాత్రను సుభముగా సమాప్తమొనరించి యాతనికంటె నెక్కువ కీర్తి గడింప నిశ్చయించె.

చాణ: ఏమీ! పులినిఁజూచి నక్క వాఁతపెట్టుకొన నిశ్చయించెనా! కానిండు.

చంద: అట్లు నిశ్చయించి యుద్ధంబునకుఁ దొడంగుటకు మున్ముందొక రాయబారము నంపె. ఆ రాయబారులు ఎల్లుండి మౌర్యుని దర్శింపనున్నారు. వారిచే సెల్యూకస్ సింధుదేశమును దన కొసంగి మగధరాజ్యమునకు గప్పముఁ గట్టకున్న యుద్ధము సిద్ధమని మౌర్యునికి రాయబారమంపి యున్నారు.

చాణ: 'వినాశకాలే విపరీతబుద్ధిః' వీనికిఁ దగినశాంతి మీ రొనర్పకుందురా?

రాక్ష: ఆర్యా! అట్లె చేయనున్నారము. అందులకు మీరును మాకుఁ దోడ్పడి మార్గముఁ జూపవలయు

ఉ॥ జంకుకలంకు లేక రభసమ్మున హైందవరాజ్యవైభవా
లంకృతుఁ జంద్రగుప్తుఁ దలఁపడినంత జయంబు గూర్చునే
మంకరమౌ నటంచరసి మా సెడోనీయులు దాఁడివత్తు రా
టంకమొనర్పరమ్మిక పటూపటిమ హైందవ రాజ్యరక్షకా!

చంద: ఆర్యా! నా ప్రార్థనగూడ నదియ.

శా॥ మీ చాణక్యుఁడు సన్యసించె నిక నేమీభీతి మాకన్న, నే
మా చాణక్యుఁడు మీఁగి దాఁకి భరతక్ష్మాపుత్రసంత్రాణ బ
ద్ధాచారుండయి వచ్చునంచు యవనక్ష్మాధీశుతో నాడు వా
చాచాతుర్యము మీఱ నంటి, నటె దీక్షం బూని కావింపుమా.

చాణ: అమ్యలారా! మీకు నాయందలి యభిమానము కొంతయు సంతసించితిని గాని యిట్టి కార్యమునకు యుద్ధము మో మెఱుంగని ప్రపంచానుషంగమునొల్లని నన్నా సాయముఁగోరుట!

ఉ॥ ఈగతి నన్నుఁదోఁడనుగ నీ రరు జేరుటలెల్ల మీకు నా
పైఁగల యాదరంబునఁ గృపామతిగాక నిజంబుగా సమీ
శాగమతంత్రవేత్తృసచివాఢ్యుల సాయముగాక నన్నుఁబో
ల్జోగులసాయ మేల రిపులోకనికాయనిషూదనాప్తికిన్.

చంద: స్వగుణపర్వతఁబుల నేని పరమాణువులుగా నుడువు టార్యుల లక్షణమని మే మెఱుంగుదుము.

రాక్ష: ఘటనాఘటన సమర్థులు మీరు సాయము సేయనియెడల మాకు సత్వరముగ పమగ్రముగు జయము దుష్కరము.

చాణ: సచివసత్తమా! మీరు మీరాజ్యనిర్వహణశక్తిని వృసలుని నిర్వక్రపరాక్రమమును బాఁగుగ నెఱిఁగిన మీరిట్లు పలుకుదురా?

ఉ॥ సంతతరాజ్యపాలనవిచారవిశారదు లీరలుండ, దు
ర్దాంతబలాన్వితుం డరివిదారణశీలుఁడు మౌర్యుఁడుండ మ్లే
చ్ఛాంత మొనర్చి భారతధరావనముం బొనరింపు మంచు న
న్నింతగ వేడగావలయు నే వలనైనను తామసింతునే?

చంద: ఇప్పుడు వలనుపడక మించిపోయినదేమి?

చాణ: తెలిసియు నన్నిట్లడుగఁదగునా! నే నేనాడు సన్యసించితినో యానాడే యైహికప్రపంచాంశముల మఱచితి. మఱల వానిం దడవుటచే నాచారభ్రష్టుఁడనై రెంటికిఁజెడిన రేవడ నగుదును.

చంద: ఆర్యులు మీరిట్లాడ మేమా ప్రత్యుత్తర మీయఁగలము? 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' యను వాగ్వ్యక్తి విస్మరింతురా! అట్టిచో జన్మభూమిసేవ కామ్యము ఆచరణీయము గదా! అందుచే మీరు కామించు ముక్తిని బడయుట దుస్సాధ్యమా.

చాణ: ఆహాగుప్తాగ్రణీ! నీ పాండిత్య మనిర్వాచ్యము. కర్మజ్ఞానయోగభక్తిమార్గములు ముక్తిదాయకములని నే నెఱుగుదుగాని దేశమాతృసేవామార్గము కొండొకటి కలదని నేఁ దెలియనైతి. ఆర్యులారా! ఈ వృథాప్రసంగము నింక జాలించి పాటలీపుత్రమేగి ధైర్యమూని కార్యముఁ జయప్రదముగాఁ జక్కపెట్టుడు. నన్నింక ధ్యానమునకుఁ బోనిండు (లేవఁ గూడ లేచి)

చం: ఆర్యవర్యా! ఇట్టి స్వార్థలాభ పరాయణత్వము మీకుఁదగునా? 'పరోపకారార్థ మిదం శరీర'మ్మని మీ రెఱింగియు భారతీయులందఱకు మహోపకార మొనర్చుట మాని ఆత్మ మోక్షంబును గాంక్షించుచున్నారు.

ఉ॥ భారతమాతృ శత్రుసమవాయము మున్మను రూపుమాపికై
దీరినవాఁడ వీవని పదింబది నియ్యెడ నీసహాయముం
గోరుచునుండు మమ్ము సరకుంగొన కుండెద వాత్మమోక్ష దీ
క్షారతిఁగూరి భూమిసుర చంద్రమ! యియ్యది నీకుధర్మమే?

రాక్ష: ఆర్యసత్తమా! మా ప్రార్థన కింకను జెవులొగ్గరా! అక్కటా, మిత్రా! మన మింక మాటాడుట చెవిటికి శంఖూదుటయగు, ప్రార్థించుట నిద్రపోవు వాని పాదములకు మ్రొక్కుటయగు. మతధర్మ వ్యాజంబున స్వార్థ లాభంబును వెదకువానికి దేశభక్తి యెట్లు కలుగు. ఇంకఁ బోవుదము రమ్ము. అయిన ముందుగా నీయన యిచ్చిన మంత్రిపదవి నీయనకే యొప్పజెప్పెద. (తన మొలనున్న బాకునుదీసి) సంయమీంద్రా!

చ॥ నను మగధేశుమంత్రిగ నొనర్చితనర్చెదు నాఁడు మీరలి
చ్చిన యసిపుత్రిహస్తమునఁ జేకొని యిప్పటిదాక నెట్లొ చే
తనయిన యట్లుగా సచివధర్మము సల్పితి, నింక దానినే
నొనరుపఁజాలగాన నిదిగో గ్రహియించి చరింపుడిచ్ఛమై.

(బాకు క్రింద నుంచును.)

చంద: అక్కటా! ఎంత పాపికాలము దాపరించె, ఆర్యా! మీ కడసారిమాట యింతయేనా?

చ॥ నిరతము మాతృదేశజననీ ప్రమద ప్రతిపాదనార్థత
త్పరులగు మీరుఁదజ్జననిపైఁబడఁదెంచెడు నన్యదేశము
ష్కరుల వినాశమందు విముఖత్వ మకార్యమటంచు నేడ యో
పరులుపదేశము న్నొసగుప న్నలసెంగద యెట్టికాలమో॥

రాక్ష: మిత్రమా! మనము నడువ వలసినదంతయును నుడివితిమి. ఇంక వీరి దేశ మాతృభక్తియు, మాతృభాషానురక్తియు, హైందవావనాసక్తియు ముప్పిరిగొని మన కార్యమును సాధించు. రమ్ము.

(నిష్క్రమింతురు)

చాణ: (అటునిటు తిరుగుచు) ఆహా! ఆర్య రాక్షసుఁడు నా మనోదౌర్బల్య కారణమును జక్కఁగా గ్రహించె. నాకీ దేశభక్తియు, నాశ్రితరక్తియు లేకున్న బాగుగ నుండెడిదిగదా? అలనాడు వృషలుని పూర్ణాంగీకారముతో రాక్షసు నమాత్యుంజేసి సన్యసించినప్పు డింతతో నాకు రాజకార్యభారము తొలఁగెనని నమ్మితి. కాని యిప్పు డయ్యది మరల తలపైఁబడు నట్లున్నది కదా, ఏమిసేయుదు? ఎట్లు తప్పించుకొందును? వీరి ప్రార్థన కీయకొనకున్న దేశద్రోహి నగుదును. ఇయ్యకొన్న భ్రష్టవ్రతుఁడ నగుదును. నా సాయ మావంతయు లేకయే యిక్కార్యము నార్య రాక్షసుఁడు సేయఁగలఁడు. అయిన నాత్మవిశ్వాసము లేనిచో నాతనికి జయమగునా! (ఆకర్ణించి) అహో ఎవరీ యాశ్రమంబున గద్గద స్వరముతో దుఃఖించుచున్నారు. ఎవరో కదా (పరికించి) ఎవరును లేరే? (పైనజూచి) అహా! భారతమాతయే! ధన్యోస్మి! ధన్యోస్మి. వందేమాతరం! తల్లీ! నీ పుత్రుఁడు చాణక్యుఁడభివాదన మొనర్చుచున్నాఁడు. (అట్లుచేసి) తల్లీ! ఏల యిట్లు బాష్పాకులాక్షివై నాకడ కేతెంచితివి?

ఉ॥ అందము మందమంద, వదనాబ్జముగంద, శరీరయష్టిని
వ్రందతఁజెంద, నీసుతులస్వాంతము కొందలమంద నీద్విషత్
బృందము మోదమంద, నిటు పృథ్వికిమింటికి నేకధారగా
వందుర నెట్టియాపదలు పైకొనె, భారతమాతరో! నినుౕ.

నీబోటి వీరమాత కీపాటివంతయేల? ఎట్టియాపద వచ్చినను నిన్ను దమ ప్రాణముల నర్పించియైన రక్షింప వెనుదీయని పుత్రులున్నారే! వారింకను తమ సౌభ్రాత్రమును సాజాత్యమును దేశభక్తిని విస్మరింపలేదే? వారింకను నీకళంక మడచి, నీకీర్తి వ్యాపింపఁజేయుటయందు నిరతైకశీలురై నిరుపమోత్సాహులై నిష్ఠాగరిష్ఠులై యున్నవారే! ఇట్టియెడ నీచింతకు హేతువేమున్నది. (యోజించి)

ఓహో, ఆర్యరాక్షసుండు నుడివిన దండయాత్రయేనా! నీదోస మావంత లేదన్నను, నీకీ దండయాత్రిలబాధ తీరదుగదా? అవునిది కాలమాహాత్మ్యము.

సీ॥ కలనాదగరిమంబు కతననే కీరంబు,
పంజరబంధంబుఁ బడసినట్లు
క్షీరసంభారంబుచేతనే ధేనువు
స్వాతంత్ర్యసుఖ మెడఁబాసినట్లు
వరవర్ణ పింఛంబువలననే బర్హిణ,
మసమయమరణమ్ము నందినట్లు
వరణీయరూపంబు పట్టియే భామిని
విటపీడనంబున వేగినట్లు

తే॥గీ॥ అతుల ధనధాన్యవతి వౌట, నన్యరాజ
దండయాత్రిల కీవాస్పదంబ వైతి
వమ్మరో! కాలమహిమ నేమందు నకట
గుణములే సౌఖ్యహారణకారణములయ్యె॥

మ॥ సిరియేశుండట, సెల్యుకాఖ్యుడట నిక్కజేగ్పాటుగావించి ధీ
వరకోటీపరిగుప్తతావక రమావాల్లభ్యమార్జించునం
టరరే, సింగమునోటి సొమ్ముగొనగా నాసించెనోమాయువే
కరణింగార్యము మీఱునోయనుచు నాకఁ్రిందింతు వే తల్లిరో.

తలపంకించెద నిదియేనా నీ దుఃఖ కారణము. ఔరా! ఈ యధృష్టుని దాడి యొంతెంతవారికి భీతిగొల్పుచున్నది. తల్లీ! ఈ దండయాత్రకుఁ బ్రతీకారము సేయకుందురా?

చ॥ బలమును నయంబటంచు ననివార్యమదోద్ధతినన్య దేశమా
తల తనయుల్ననుంజెనకి వాసిగఁ జేకొనరా, మదీయమూ

ను లరులదాఁకఁగూరకకనుంగొనువారని యేడ్చెదేమో త
ల్లులపగఁదీర్పలేని సుతులుం సుతులే భరతోర్వరాసతీ॥

కావున భయమందక పొమ్ము. నీ పుత్త్రులకే జయమగు, ఇంకను బోవా! దుఃఖమును మానవా? తల్లీ! నన్నే మైనవచ్చి వృషలాదులకు సాయమొనర్పుమందువా? (తలపంకించి) ఔనా! ధన్యుఁడనైతి.

శా॥ ఉల్లంబందున నిన్నుగాంచ నెటులానోయంచు జింతింతుచో
నెల్లా కేశుడ కారణాప్తుడయి, నీశ్రీదోచరానున్న లో
గల్లోలంపడినన్న సాయముడుగంగా నిట్టులే తేరుటం
దల్లీ! నిన్నుగనుంగొనంగలిగితిం ధన్యత్వముం జెందితిం.

(బాకును గైకొని) ఇంకనీ ఇష్టానుసారమే వర్తించెద. దుఃఖమును వీడుము.

శా॥ నీపుత్త్రుండగు విష్ణుగుప్తునకు బోందింపాత్రిణముండంగ, నీ
కీపాటింబలవింపనేలఁ దృటిలో హిందూజన భ్రాతృసే
వాపారీణత సెల్యుకేశ్వర చమూపవిధ్వంసముం జేసి, నీ
కాపాదింతు శుభోచ్ఛ్రయంబుజననీ యందాక శాంతింపుమా.

తల్లీ! ఇప్పటికి నీ దుఃఖము తీరెనా! నీ ముఖ కమలము వికసించెనా! నీ కన్నీరుఁదుడిచి నీ కెలనవ్వొలయఁజేయుటకంటె భారతీయునకుఁ గార్యమెద్ది? మోక్షప్రదమేది? ఈ నూతన ముక్తిమార్గమును గురించి పిదప వేదాంతులు సిద్ధాంత రాద్ధాంతంబు లొనర్తురు గాక. తల్లీ! ఆశీర్వదించి తిరోధాన మొందితివా? కానిమ్ము, ఇక నీదండయాత్ర యంతమగుదాక భవత్సేవాలంపటుఁడనై యుండెద. శార్ఙ్గరవా.

ఈ మౌంజి, ఈ దర్భాసనము, ఈ కాషాయ వస్త్రములు, ఈ కమండలువు భద్రమొనర్పుము. నేనుఁ గారణాంతరమున మంత్రి పదమును మఱల స్వీకరించితిని. నీవేగి రేపకట వృషలుని కీ వృత్తాంతమును దెలిపి నాకుచితమైన వస్త్రాద్యలంకారములఁ గొనిరమ్ము. గూఢచారాధ్యక్షుని గూడ నాకడకు రమ్మనుము.


(శార్ఙ్గ, నిష్క్రమించును.)

(మోహించి) దేవీ శాంభవీ! నా నూతనోద్యమము నెట్లాశీర్వదింతువో.

సీ॥ చేదోడుగా నైతి శ్రీమత్తనవనంద
కంఠలుంఠన మేర్చు కాలమందు
వాదోడుగా నైతి, వసుధేశనీతియు
నర్థశాస్త్రము జెప్పు సదనమందు
నెచ్చెలివైతివి నిఖిలావనికి మౌర్యుఁ
బట్టభద్రుని జేయు పట్టునందు
ప్రాపకంబైతివి రాక్షసు మౌర్యుని
సచివుగా నొనరించు సమయమందు

తే॥గీ॥ కాని మన భూమిపై సెల్యుకశక్తి తీవుఁ
డెత్తివచ్చెను! గెల్వ నాకిప్పు డెల్లు
శక్తిఁ గూర్చెదో! యేరీతి సాయపడెదో
సర్వభక్తేప్సితాలంబ! చండికాంబ!

(యవనిక పడును)



# చంద్రగుప్త నాటకము.

## ద్వితీయాంకము-ద్వితీయ రంగము.

స్థలము:-పాటలీపుత్రము, రాజనగరద్వారము. వసంతోత్సవము.

(మైత్రేయుఁడు రాచనగరులోనికేఁగఁ బ్రయత్నింప దాసీజనులు లోపలినుండి చిమ్మనగ్రోవులతో వసంతముఁ జల్లుచుందురు.)

మైత్రే: (ఇటు నటుఁబరువెత్తుచు) నేఁడీ వసంతోత్సవము నా ప్రాణము దీయుటకు వచ్చినట్లున్నదే! త్రోవను వచ్చుచుండ మగవాఁడనక, ఆడుదనక యెల్లరు అవ్వనుబట్టుక వసంతములాడినట్లు నాతో నెకసక్కెములాడి నాపై వసంతముల జల్లి నా క్రొత్త చలువగుడ్డల పాడుఁజేసిరి. ఈ బట్టల వదలి నూతన వస్త్రముల ధరించి నావయస్యునితోడ నీసుగాంగ భవన ప్రాసాద మెక్కి పురజనుల యలంకారముల, సంతోషోత్సుక్యములఁ జూడవలెనని కొనిన, నీ దాసిముండలు దగ్గరకేగినప్పుడెల్ల వసంతముల జిమ్మి గంధపు బొడి జల్లి నా యుసురుఁబోసికొను చున్నారు. ఏమిసేయుదును? వీరిని తప్పించుకొనుట కేతంత్రమును పన్నెదను? (యోజించి) భళీ తెలిసినది, తెలిసినది. ఇట్లు నుడివెద (బిగ్గఱగా) ఓసీ! దాసీజనులారా! ఇదే మగధేశ్వరుడు మహారాజ చంద్రగుప్తుఁడు వచ్చుచున్నాడు. పరాక్ మహారాజ పరాక్ (అని దగ్గరుచు) నా పన్నుగడ నెరవేరినది. ఈ దాసి ముండల మోసపుచ్చుట నా కొక్క లెక్కయా? (ప్రవేశింపఁబోవ లోపలినుండి వసంతము చిమ్మఁబడును. అంతను వెనుకకుఁ బరుగెత్తుచో శార్ఙ్గరవుఁ డెదురుకాగా భయపడి నమస్కరించుచు) మహాపురుషా! నాపై వసంతముఁ జిమ్మవలదు. నీకిదే వేయి నమస్కారములు.

శార్ఙ్గ: మైత్రేయా! ఈ దొంగవేషమేమిటి? ఈ దొంగ నమస్కారము లేమిటి.

మైత్రే: (కన్నులు నులుము కొనుచు) ఎవరు? శార్ఙ్గరవా! మిత్రా! (కౌగిలించుకొనబోవును.)

శార్ఙ్గ: (తప్పించుకొని) సఖా! దూరమునుండియే నీ స్వాగతముతోఁ దృప్తిజెందెద నిఁకఁ జెప్పుము.

మైత్రే: ఈ దినము వసంతోత్సవము. ఊరి తొత్తుకొడుకులందరు నాపై విచ్చలవిడి చెలరేగి వసంతముజిమ్మి తల ప్రాణము తోకకుఁ దెచ్చినారు; వారిని దప్పించుకొని యిక్కడికివచ్చిన నీ దాసి కూతుండ్రు నన్నె డాటలాడించుచున్నారు. ముందున కేగుటకు వెనుక కేగుటకుఁ దోచకున్నది. రెండగ్నుల మధ్యఁజిక్కితిని. నన్ను లోనికిఁ గొంపోయి పుణ్యముఁ గట్టికొనుము.

శార్ఙ్గ: అబలలు వినోదార్థము జల్లువసంతవారికా నీవు వెనుఁదీయుట? ఎట్టి శూరాగ్రేసరుఁడవోయి!

మైత్రే: అబలలా! లబలబలాడించుచున్నారు. నీవు నా స్థానములోనున్న వినోదమో, విషాదమో తెలిసియుండును. అబలలయెడ నా శౌర్యము ప్రదర్శనీయమగునా (దగ్గరి) ఇంక రానిమ్ము, లోనికేగుదము.

శార్ఙ్గ: (తొలగి) దూరముగానుండి మాటాడుము. నే వచ్చెదకాని నాకు ప్రత్యుపకారమొనర్చెదవా?

మైత్రే: నన్నీయాడుబెబ్బులుల బారినుండి రక్షించితివా, నీకు తప్పక వేయిప్రత్యుపకారములొనర్తు.

శార్ఙ్గ: పూర్వము మాగురువులవారు మంత్రిపద మలంకరించినప్పుడు వారు ధరించుచు వచ్చినట్టి వస్త్రాలంకారాదులువలయునట. వారు సకల ప్రధానిశేఖరులై రాజ్యతంత్రముల నడపెదరట.

మైత్రే: అయ్యయో! నా గుండెలలో రాయివైచితివే! ఇంక నా మాటలుసాగవే?

శార్ఙ్గ: రేపు రాజసభకు వచ్చునట. నీ వీ వార్త నీ వయస్యునకుఁదెల్పి నాకు వానినందఁజేయుము.

మైత్రే: అదెంతపని, ముందీ వ్యాసఘట్టమును దాటుదమురా.

శార్ఙ్గ: రమ్ము, నిర్భయముగా నా వెంటరమ్ము.

మైత్రే: (రెండడుగు లిడి వెనుకకు గంతులువైచి) వారుగో-ఒకరు-ఇద్దరు మనలఁ బొంచి పొంచి చూచుచున్నారు. ఈ సారిరువురికిని వసంతస్నానమే. (వెనుకఁజేరును.)

శార్ఙ్గ: భయపడకుము. ఆర్యచాణక్య శిష్యునిపై వసంతము ను చల్ల నెవరికి గుండె లున్నవి రమ్ము. (నిష్క్రమింతురు.)

# చంద్రగుప్త నాటకము.

## ద్వితీయాంకము-తృతీయరంగము.

### స్థలము:-సుగాంగభవనము-సభామంటపము.

(చంద్రగుప్తుఁడు రాక్షసుఁడు చందనదాసు మున్నగువా రాసీనులై యుందురు. శోణోత్తర మార్యునికి వీవనతో విసరుచుండును. చంద్రపాలుఁడు ద్వారము గాచియుండు.)

చంద్ర: అమాత్యశేఖరా! ఈ యవనేశుఁడు మనపై దాడివెడలుట సౌహార్ద్ర సూచకము సుడీ!

మ॥ హిమవద్వింధ్యమహీధ్ర మధ్యగత పృథ్వీశోచ్చయోన్మాలనో
ద్యమసాఫల్యముఁ గన్న దాదిగను, మా యమ్ముల్, యసుల్, ఖడ్గముల్
సమలంబయ్యెడునంచుఁ జింతిలెడుచో శల్యాకసుండిక్రియన్
సమరంబున్ లభియింపఁజేయుట మహాసౌహార్ద్రమౌ మాయెడన్.

మఱియు నిందుమూలమున మా గురువర్యుని బోధనంబునఁ జిరకాలంబు నుండి నా మనంబున నెలకొన్న యొక కోర్కె నీడేర్చుకొనుటకు సమయమొదవె.

శా॥ ఆర్యావర్తమునందరక్షితము వాయవ్యాశ కౌనకన్ హిమా
హార్యంబాదిగ హిందుకోశనగపర్యంతావనిన్ గెల్చి, గ్రీ
కార్యక్షోణుల మధ్యరాష్ట్రముగఁ జేయన్ భద్రమౌనంచు నే
బర్యాలోచనమూన, దైవికముగాఁ బ్రాపించె నీవైరమున్.

మఱియు నీయుద్ధవార్త గురువర్యునిఁ దొంటి మంత్రి పదమవలంబింపఁ జేసి నన్ను ధన్యునిఁజేసినది. వారండగానుండ నన్ని కార్యములు సులభసాధ్యములగు. ఇందులకు మీకెంతయుఁ గృతజ్ఞుఁడ.

రాక్ష: రాజేంద్రా! ఇంక యవన పరాభవముఁ దప్పింప బ్రహ్మతరమైనఁగాదు.

చంద్రపాలుఁడు: (ప్రవేశించి) మహారాజా! పరాకు! ఆర్యచాణక్యులవారు వచ్చుచున్నారు.

(ప్రవేశము; అమాత్యోచితవస్త్రధారి చాణక్యుఁడు. అందరులేచి ప్రణతశిరస్కులగుదురు.)

చాణ: మంత్రి సామంతులారా! మీకు శుభమగుగాక.

చంద్ర: (మోకరించి) గురువర్యా! మీ యాశ్రితుఁడు వృషలుఁడు నమస్కరించుచున్నాడు.

చాణ:-సీ॥ స్వస్త్యస్తు సర్వసర్వంసహాసంభార
భరణక్షమాభుజావరణ నీకు
శ్రీరస్తు శరణాగతారాతిసంఘాత
సంపాలనవ్రతాచరణ నీకు
విజయోస్తు ప్రథితదోర్వీర్యగర్వాంధభూ
దారతాభ్యర్చనాదరణ నీకు
మహనీయతాస్తు భామామణీమానసా
హరణైకచారుతాభరణ నీకు

తే॥గీ॥ వివిధవిభవోస్తు సర్వదిగ్విజయ నీకు
సర్వశుభమస్తు శాశ్వతైశ్వర్య నీకు
సతతస్ఫూర్తోస్తు లోకప్రశస్త నీకు
బహుళభోగోస్తు మౌర్యభూపాల నీకు.

చంద్ర: గురువరా! నేఁడెంతయు సుదినము. ఈ సభయందు మీ ముఖారవిందమును సందర్శింప మాకు నూరు మడుంగులు ధైర్య మెక్కుఁడయ్యె. మా వైరులకట్లే నూరు మడుంగులు తక్కువయై యుండును.

చాణ: వత్సా! నీకు సాయపడుటకుఁ దగిన సామర్థ్యంబును సదాశివుఁడు నాకొసంగుగాక.

చంద్రపాల: రాజేంద్రా! యవనరాయబారులు వచ్చియున్నారు.

చంద్ర: లోనికి రానిమ్ము.

(ప్రవేశము, పాత్రికుల మెగాస్థనీసులు.)

మెగా: మగధేశ్వరా! జోహారు. మంత్రి సత్తములారా! అభివాదనము. మేము సిరియాధీశుఁడు నిరంతర 'విజయ' బిరుదాంకితుఁడు నగు సెల్యూకసు రాయబారులము. ఇతఁడా రాజేంద్రు సేనాని పాత్రకులుఁడు.

పాత్ర: ఇతఁడా రాజేంద్రుని మంత్రివరుఁడు మెగాస్థనీసు.

చంద్ర: ఈయన మాకుఁ బూర్వపరిచితుఁడే. ఆర్యులారా! మీ రోడ దిగినప్పటి నుండియు మా విదేశీయావేక్షాకాంక్షోద్యోగులు మీ కుచితసత్కారము లొనర్చిరి కదా?

మెగా: బాగుగా నొనర్చిరి. ఈయాదరణమునకు కరము కృతజ్ఞులము.

చంద్ర: ఆర్యా! సిరియాధీశునకు భద్రమే.

పాత్ర: భగవత్కటాక్షమున భద్రమే.

చంద్ర: ఆర్యులారా! మీరు వచ్చిన విశేషము విచారింపనగునా.

పాత్ర: మా భూపాలుని సందేశమిది, మగధేశ్వరా,

శా॥ ఆలీసాండ్రుఁడ కాలమృత్యువాతఁబడ్డ నల్లంతనే మేము చిం
తాలగ్నాత్ములమై తపించునెడ సందర్భం బదే యందు గ్రీ
క్జాలంకృతసింధుమండల సమాక్రాంతమ్ము గావించితో
శాలీనా! దొర లేనియింటను యాథేచ్ఛం దోచు దొంగల్ బలెన్

శా॥ ఆ రాజ్యంబును గ్రమ్మఱం గెలుచు నూహం జేసి నీతోద్ధతం
బోరాడం జను దేరువాఁడ ననిలోఁ బోగాడెదో లేనిచో
మా రాజ్యంబును మాకుఁ గూర్చి మగధక్ష్మామండలం బెల్ల న
త్కారం బార నొసంగి కప్పమిడ నాకాంక్షింతువో తెల్పుమా.

మైత్రే: దొంగలు బడిన పదునారేండ్లకుఁ గుక్కలు మొఱుగఁ జొచ్చినవే.

చంద్ర: అమాత్యులారా! వింటిరిగదా యవనరాయబారము. దీనికిఁ దగిన ప్రత్యుత్తర మొక్కటియే. అయిన మంత్రిబోధన ముడుగుట రాజధర్మము గాన నడిగెద. గురువర్యా! తమ యభిప్రాయమును వినగోరెద.

మెగా. (వివర్ణుఁడై పాత్రకులునితో జనాంతికము) సేనానీ! అదిగో అతఁడే సుమా అభిచారవజ్రముతో నందపర్వతమును రూపుమాపిన చాణక్యుఁడు. ఇతఁడేల మంత్రిపదమును మఱల స్వీకరించెనో!

పాత్ర: (జనాం) మంత్రీ భయమేల! ఈ చాణక్యుడు గీణక్యుఁడు మనల నేమి సేయఁగలఁడు?

చాణ: వృషలా! ఈ రాయబారమున కొసగవలసిన ప్రత్యుత్తరములను గుఱించి పౌరుషావతారులగు హైందవులకు భిన్నాభిప్రాయములుండవు. ఐన నీ రాయబారమునఁ గొన్ని సందిగ్ధ విషయములున్నవి. రాయబారులారా! గ్రీక్జాలంకృత సింధు మండల మన నేమి?

మెగా: ఆర్యా! అలెగ్జాండరు సింధుభూమిని గెల్చిన నాఁటఁగోలె గ్రీకు లనేకులం దధిని వేశముల నేర్పాటుఁ జేసికొనియున్నారు. ఆ కారణమున నా భూమిని గ్రీక్జాలంకృత మంటిమి.

చాణ: అహో భ్రాంతి! ఇంకను మీ గ్రీకులు గ్రీకులుగా మా దేశమునఁ గూర్చుండి యున్నారా? వారెన్నఁడో హైందవులఁ బెండ్లాడి భ్రమరకీటక న్యాయముగ హైందవులై పోయిరి. వారి నిప్పు డెవ్వఁ డేర్పఱుపఁగలఁడు.

శా॥ గంగాసింధుతరంగిణుల్ జలధిలోఁ గాల్వెట్టి నాత్మాభిధా
నాంగవ్రాతముఁ బాసి యైక్యమగు ఛాయన్ హిందుదేశంబునం
దుం గాల్వెట్టిన గ్రీకు లాత్మగుణవైదుష్యంబుఁ బోనాడి మా
భంగిన్ మారినవారు వారికొఱకై వైరింపగాఁ జెల్లునే?

పాత్ర: గ్రీకు లిప్పు డందున్న నేమి! లేకున్న నేమి? మేమా భూమి నాక్రమించికొని మా యత్యుత్తమ నాగరికతను నేర్పి హైందవులనే మా వారిగా మార్చుకొనెదము.

చాణ: ఏమీ! మీరా హైందవులకు నాగరికత గఱపువారు?

చ॥ అనితరసాధ్యనాగరికతాఢ్యులు నాగ ననాదిగా యశం
బును గనుచుండు మాకు మొనమొన్నటినుండి యలంతికీర్తిమై
దనరెడు మీకు నాగరికతావరరూపవిధావిధాన బో
ధన మొనరింప నూల్కొనుట ధాతకు సృష్టులు నేర్పుటల్ గదా.

పాత్ర: ఇయ్యది విచారణీయము. ఎట్లున్నను రాజ్యము వీరభోజ్యముకదా. మీ రిందుల కియ్యకొనిచో యుద్ధము సిద్ధము. మున్నింబోలె మాచేత మీకుం బరాజయము సిద్ధము.

చాణ: రాయబారీ! మీకు జయమగునని మీరు పొరబడుచున్నారు. అట్టిది పొసగు కాలము దాటినది.

శా॥ బందీభూతమనస్కులౌచు తమసౌభ్రాత్రంబు సాజాత్యముం
హిందూజాతులు విస్మరించి మనునాడేశాని మర్నాడు మా
హిందూదేశ మడంగ లేదడగఁబో దింకన్ విజాతీయరా
ట్సందోహమ్ములదాడి కోడి, యవనక్ష్మాపాలవార్తాహరా॥

పాత్ర: ఈ విషయము మాటలచేతఁగాదు. చేతలచేఁ దీర్మానింపంబడవలయును.

చంద: నిస్సంశయముగ నట్లే రూఢిపరుపఁబడును. ఆనాటిపురుషోత్తమునివలె సౌభూతిబలె నీ చంద్రగుప్తరాజకంఠీరవుఁడు యుద్ధమన్న శరణాస్మి యనుననుకొంటిరి గాబోలు. ఎంతప్రమాదము.

సీ॥ అడిగి యీనుగక మున్నరి తోడ బుత్తెంచి
యరిమైత్రి నల్పుట కంభి కాదు
కనుబ్రామి తనుఁదాక ననువేది శత్రుకై
వసముఁ జేఁదుటకుఁ బోగసుఁడు గాడు
తొలిఁ దాకకయమున్న దాసోహమని సంధి
బొనరించుటకు నవభూతిగాదు
సచివులు మోసంబు సల్పఁ బ్రాణముల గో
ల్పడుటకు మూషికేశ్వరుడుగాడు

తే॥గీ॥ చణకపుత్రోక్తసచ్ఛాత్రు శాసితుండు
రాక్షసామాత్యసాచివ్యరాజితుండు
పరవగేంద్రుండు, శస్త్రాస్త్రపారగుండు
చండదండుండు చంద్రగుప్తుండునుమ్ము.

పాత్రి: అగుగాక! గ్రామమునకు సింహమైన నడపికి సింహ మగునా! మాతో యుద్ధ మొనర్చి జయించిననా డీప్రగల్భములు సార్థకములగు. ఇక యుద్ధము సిద్ధమేనా?

రాక్ష: ఏమి రాయబారీ! యుద్ధము యుద్ధమని స్మరణఁజేసెదవు.

ఉ॥ యుద్ధము మేమెఱుంగమని యోమును యోద్ధలఁ గాంచమంచునో
యుద్ధము యుద్ధమంచుఁ బ్రబలోద్ధతిమై మగధేశుముందు సం
బద్ధపుఁబ్రగ్గెలాడెదవు బాపురె యెత్తటిదైన యుద్ధసం
సిద్ధుల మేమటం చెఱిఁగి చేతలఁజూటుఁడు మాటలేటికిన్.

పాత్రి: ఇట్టిదే మీ రాజేంద్రుని యుత్తరమైన నయ్యదియుఁ గొలఁదికాలములోనే చేకూఱు.

చంద్ర: సందేశహరా! నా యుత్తరము మంత్రులయుత్తరముకంటె భిన్నమగునా? మీ రాజన్యునకు హైందవులనినఁ గేవలము భీరువులని యభిప్రాయమున్నట్లున్నది. కావున నీ సందేశమంపినట్లు తోచుచున్నది.

సీ॥ వీఁగవిస్ఫారదుర్వారగర్వాంతంబు
వెన్నతోఁ బెట్టినవిద్య మాకు
సన్నద్ధశాత్రవసంహారకలనంబు
షడ్రసోపేతభోజనము మాకు
దేశమాతృరిపువినాశనోద్యోగంబు
మంచినీర్ద్రావెడుమాత్ర మాకు
ఉద్ధతారాతివంశోన్మూలనక్రీడ
యుగ్గుపాల నిడినయుక్తి మాకు
తే॥గీ॥ శూరవిజయంబు తంగేటిజున్ను మాకు
రణవిహారంబు పూరుషార్థంబు మాకు
నట్టిచో శత్రుఁ దాకముం దంజ లిడక
అరి నొసంగ దలంచునే హైందవుండు.

పాత్రి: రాజేంద్రా! మా గ్రీకువారు మాత్రము మీకుఁ దీసిపోవువారనుకొనెదరేమో.

సీ॥ సర్వపాథోనిధీసమవేత రాజ్యంబు
సేకరించినవారు గ్రీకువారు
పనరమాపర రాష్ట్రపరబిరుదావళుల్
స్వీకరించినవారు గ్రీకువారు
సకలశాస్త్రగ్రంథసంఘట్టనామృతం
బాకళించినవారు గ్రీకువారు
పరదేశవాసనాగరికతార్ణోరాశిఁ
జౌకళించినవారు గ్రీకువారు

తే॥గీ॥ పరనృపతులకేని పరదేవతలకేని
మోకరింపనివారలు గ్రీకువార
లట్టిచో మాగధేశ్వర! అరిప్రగల్భ
వాక్యములను విని బెదరెడువారె వారు.

చంద్రి: రాయబారీ! మా యెట్టయెదుట గ్రీకుల నేవిషయమునైన నగ్గింపకుము. వారి ధర్మాధర్మవిచక్షణకు మీ రాయబారమే సాక్షి. వారి ధైర్యకార్యములకు సుభోపాంతమున మొన్న మొన్న జరిగిన యుద్ధమున మా భటులచే జిక్కిన మీవారి యార్తారవములే సాక్షి. ఇతరము లిట్లే యతిశయోక్తులు.

ఉ॥ ఇంతకుమున్ను హైందవు లొకింతయు మీ యవనాదియోధవి
క్రాంతి నెఱుంగనట్లు పలుకం గమకించెద వేల? మున్ను భో
పాంతమునందు మా భటులఁ బైకొని మీ రెటు లోడిపోతిరో
యంతయు నే మెఱుంగమనియా? యిటులాడెదవో చమూపతీ.

మెగా: రాజశేఖరా! జయాపజయంబులు కావడికుండలు. అట్టిచో స్వల్పసంఖ్యాకులగు మావారు మీచే నొకవ్రాతతి నోటొందినవారు నిరంతరము శౌర్యరహితులగుదురా? వారి యవక్రపరాక్రమమునకు ననన్యరణోత్సాహమునకు

శరణాగతరక్షణ దీక్షకు వ్యూహకౌశలమునకు మేరథాన్, ఇస్సస్, కర్బేలా జీలము రణాంగణములు సాక్ష్యమిచ్చుటలేదా? ఈ మాటలకేమిగాని సంధి కుదురుట యుభయపక్షములకు శ్రేయస్కరము గాన నేతన్మార్గ మన్వేషింపుడు.

చంద్ర: మీ వసుధేశుఁడు వీరపురుషాగ్రాహ్యమగు నిబంధనలఁగోరిన నెట్లు మాకు సంధిపొసఁగు. అతఁడు రాజ్యాతురుఁడై నితాంతజయసురాపానమందీకృతాత్ముఁడై కుడిచి కూర్చుండనొల్లక పాఱెడు బండ్లకుఁ గాళ్ళు సాచునట్లు ఈ యుద్ధమునకు దిగెను. ఇందుకుఁదగిన శిక్షదప్పదు. మీరు దానిని దప్పింప నెంచిన మా క్షమాపణవేడికొని మీ రాజున కుచితరీతి బోధించి కృతకృత్యులగుడు.

పాత్ర: అట్లొనర్చు దుర్గతి మారాజుండ మాకెన్నటికిఁబట్టదు.

శా॥ చండాత్యాహిత మేఘమండలమహాఝంఝానిలుం డూర్జితో
ద్దండారీంధనకీలి దిగ్విజయకోదండుండు మధ్యందినో
చ్చండాంశుప్రతిమానదీప్తియుతుఁడా సెల్యూకసుండుండగా
మండాడం బనియేమి మాకు మగధక్ష్మామండలాఖండలా.

మైత్రే: పోనీ, నా వయస్యునితోఁజెప్పి మీ గ్రీకు సైనికునకుఁ బొడుగునుబట్టి యాఱడుగులైన నేడడుగులైన నేల నిప్పించెద. దానికైకొని సంధిఁజేసికొనెదరా? (పాత్రికులుఁడు లేవ వారించి.)

చాణ: వృషలా! అతి విస్తరమేల! వీరల కుచిత ప్రత్యుత్తరమిచ్చి పంపివేయుము.

చంద్ర: రాయబారులారా! నామాటగా మీ రాజుతో నిట్లు నుడువుడు.

ఉ॥ దొంగనొ లేక నే దొరనొ దోర్యుగవిక్రమలీల, సంగర
ప్రాంగణమందు, సీభటచయుంబును నిన్నును జుట్టుముట్టి, మా
తంగశతాంగ సైంధవయుతంబుగ భంగమొనర్చునాఁ డెఱుం
గంగలవాఁడ, వంతదనుకన్ యువనాధిప! తాల్మిఁదాల్పుమా.

శా॥ సింగం బాత్మబిలంబునన్ క్షుధను గాసింజెందుచో, డాసి పో
రం గాల్ దువ్వు మతంగజంబుక్రియ, గ్రీకాధిజన్య! నన్నీవు రే
పం గాంక్షించెద, వింక దెల్పెదను గప్పం బెవ్వఁ డర్పించునో
భంగం బెవ్వఁడు గాంచునో వెస, రణప్రారంభసంరంభినై.

ఉ॥ భారతదేశమాతృబహుభాగ్యమహాధనధాన్యరత్నసం
భారము గాంచి, యాసపడి, భారతవీరులఁ బోరఁజీరి, యసం
గారకకేలఁ గాంచి దుముకన్ గమకించుపతంగవైఖరిన్
గోరితి; నీదుకోర్కె నొనగూర్చెద రమ్మ రణాంగణంబునన్.

చాణ: భళి, భళి.

చంద్ర: స్వామీ, భారతీయుఁడు నార్యచాణక్య ఛాత్రుఁడిట్లేకదా యనును.

మెగా: రాజేంద్రా! ఇదియేనా మీ కడసారిమాట. ఇక మాకు సెలవిండు.

చంద్ర: పోయిరండు! సత్వరముగ రణాంగణమునఁ గలయుదము గాక.

పాత్ర: అట్లే కానిండు.

(పాత్రికుల మెగాస్థనీసులు నిష్క్రమింతురు.)

చంద్ర: తమరు కరణీయము నిర్ణయించి నాకాజ్ఞనొసంగింపుడు. ప్రస్తుతము నాకు సెలవిండు.

(నిష్క్రమించును. చాణక్య, రాక్షసులుదక్క ఇతరులు ననుగమింతురు.)

చాణ: ఆర్య! వేగరులనంపి సిరియారాజ్యమున నల్లకల్లోలముల సత్వరముగఁ గల్పింప వలయును.

రాక్ష: చిత్తము.

చాణ: అంటిగోనసున కిదియే యదనని, మన మనుకొన్నఁ దెలుంగునఁ హెచ్చరింపుఁడు.

రాక్ష: చిత్తము.

చాణ: ఇతరకార్యములం జక్కపెట్టుదము రండు.

(నిష్క్రమింతురు.)



# చంద్రగుప్త నాటకము.

## తృతీయాంకము-ప్రథమ రంగము.

స్థలము:-కుభాకనుమ-సెల్యూకస్ పట కుటీరముముందు రాజవీధి.

(రదనిక యోచనచేయుచు నడచుచు ప్రవేశించును.)

రద: అలనాడు హెలెన్ మనస్సీమ నే విత్తిన మౌర్యప్రణయబీజము దినదిన స్మరణాంబుల మోహలతయై విస్తరించి మౌర్యవిటపాశ్రయము నే గోరుచున్నది. ఇదే తార్కాణము.

ఉ॥ ఆళులు గుంపుగూడిన రహస్యములాడిన నవ్వులాడినన్
జేల మదీయమర్మమును వీరలెఱింగి యిటుల్ చరింత్రుగా
బోలు నటించుభ్రాంతివడి మోముజవాంచుచు లేనిపోని గ
గ్గోలు వహించుఁ గాముకులు గుమ్మడికాయలదొంగ లారయన్.

మౌర్యపటము చేపీడరాదు. పాత్రికులుఁడు దగ్గఱకు రానాదు. ఈమె విరహార్తయై యెంతయుఁ గుందుచున్నది. తనయవస్థ నొక్కచెలితో నేని కడకు నాతో నేని వక్కాణింపదు. ఎన్నిమోసారు లేమో పనియున్నట్లువచ్చి మోహవృత్తాంతమును నాలుక చివరకురానిచ్చి సిగ్గునఁ జెప్పకయే మరలును. ఇట్టివేళలో నే నేమి సేయుదును.

చ॥ అసమశరుండు వేచ హృదయవ్యథ హేతువు నాకుఁ దెల్పగా
వినవిన నేగుదెంచు; వెనువెంటనె వీడకుఱుంగలించు నా
విసరున వెన్కకేగి యలివేణి విరాళిని గుందుచుందుబో.
ముసుకునగుద్దులాటలుగ ముగ్ధరహస్యవికాసయత్నముల్.

ఈ దినమేని తనగుట్టు బయటబెట్టునేమో చూచెద. తెల్పకున్న నీతన్వియనుజ్ఞ లేకయే మౌర్యసమాగమము నొనగూర్తును. దానికేగి నెచ్చెలింజూచెద.

(పరిక్రమించును.)

(హెలెన్ విరహవేదనా దోధూయమానమానస సెజ్జపైఁబరుండి కదలుచుండును.)

రద: (డాసి) స్వప్నావస్థయందున్నదే! మాటాడెద. నెచ్చెలీ! నెచ్చెలీ!

హెలెన్: (కోపముతో) ఏలనన్ను మేలుకొల్పుట.

రద: స్వప్నభంగమాయెనా? క్షమింపుము. నీకీ నడుమ కోపము.

హెలెన్: రదనికా! ఉల్లసములాడుటలు మానవుగదా, తండ్రిగారు వచ్చుచున్నారా?

రద: వారుగో! కాని ఎంత మారితివి. కారణము చెప్పవా. కానీ కానీ ఎంత కాలము దాచెదవు.

హెలెన్: (నవ్వుచు సెల్యూకసున కెదురేగును) (ప్రవేశము సెల్యూకస్, ఇరువు రాసీనులగుదురు.) తండ్రీ! ఈ దినము దండయాత్రా విశేషము లేమి?

సెల్యూ: ఇక నాలుగు గడియలకు హిమవత్పర్వతాధిపతి మలయకేతువు తన మంత్రి సామంత సైనిక నికాయంబులఁగూడి భైరవ్యాలయంబున జయార్థము పూజలొనర్చెదరట. అప్పటికియ్యెడ గూఢమార్గమునఁ బాత్రకులనిఁ గొందఱు సైనికులతో నంపి వారిని నిర్బంధించి శేపరక్షితమగు నీ మార్గమున హిందూదేశమును బ్రవేశింప నిశ్చయించితిని.

హెలెన్: మీకు జయమగుగాక!

సెల్యూ: జయమునకేమి. కాని తల్లీ, మనపట్టణమును వదలిననాటనుండి నీచర్య నాకు దుఃఖప్రదముగా నున్నది. నీవు ఎంత లేనిసంతోషమును నటించినను ప్రేమాంజనాయుక్తములగు నా నేత్రములకు వాస్తవము గోచరింపదా! నీ మనంబున నేదో మనోరథమున్నది. నాకుఁ దెల్పరాదా? తెల్పిన నేను దానిని నీ కొనగూర్పనా?

చ॥ కిలకిలనవ్వి ప్రేమతులకించెడు సేతలఁజేసి ముద్దులం
గులికెడు మాటలాడి నెఱకూరుము లొల్కెడిపాటఁ బాడి న
న్నలరగఁజేయు నీవిటు ప్రయాణమొనర్చినదాది నొక్కటే
న్నలుప దలంపవేమి గ్రహచారమొ తెల్పఁగరాదె యాత్మజా!

హెలె: ఇది మీ భ్రాంతి. మీ ప్రీతికిక లోపముండునా?

సెల్యూ: రదనికా! కుమారియందు నీకొక విధమగు మార్పు కననగుచుండుట లేదా?

రద: రాజేంద్రా! నాకును భేదమగపడుచునే యున్నది. తల్లిని పీడిసచ్చుటచేఁ గాఁబోలు.

హిప్పు: (ప్రవేశించి) రాజేంద్రా! సేనాని

సెల్యూ: రమ్మనుము. (హిప్పస్ నిష్క్రమించును. ప్రవేశము. పాత్రకులుడు హిప్పసుతో) నీరాక యెందులకు?

పాత్ర: మేము భైరవాల్యాలయమునకు బయలుదేరుచుండ, చారులొక గిరిచరుని, మన శిబిరము ప్రక్కగా దొంగవలె నేగుచుండ పట్టిరి. ఇతని ప్రశ్నించిన మన కింకను విషయము తెలుకవడునేమోయని తోడ్కొని వచ్చితి. అనుజ్ఞయైన రప్పించెదను.

సెల్యూ: అట్లే కానిమ్ము. (హిప్పసు నిష్క్రమించి బద్ధుఁడగు శిఖరకునితో ప్రవేశించును) ఓరీ నీవెవ్వడవు?

శిఖ: ఎవ్వఁడనైనది నా యుడుపులే జెప్పుచుండుట లేదా?

సెల్యూ: నీ పేరేమి! నీవు మోటుపర్వతీయుఁడవని మే మెఱుంగుదుము.

శిఖ: శత్రువులచేఁ జిక్కిన పౌరుషహీనునకు నామధేయాదు లెక్కడివి?

సెల్యూ: ఓహో! అంత పౌరుషవంతుఁడవా.

శిఖ: నా పౌరుషమును నా శత్రువెఱుఁగవలయును. ఈ బంధమును విప్పిన మీకును దేటపడఁగలదు.

సెల్యూ: ఓరీ వాచాటా! ఎన్ని గుండెలతో మాముందిట్లతిక్రమించి మాటాడెదవు. భయము లేదా?

శిఖ: భయము మా యింటను లేదు, ఒంటను లేదు. మేము భయమును భయపెట్టువారము.

సెల్యూ: ఈ బింకములకేమి! చెప్పుము మలయకేతువుతో నెందఱు సైనికులు గలరు?

శిఖ: నా తల వెంట్రుకలందఱు. వలసిన లెక్కఁబెట్టికొనుడు.

పాత్ర: దుర్జాతా! ఈ యధిక ప్రసంగమును వదలకున్న నిన్నిక్కడనే చక్కాడెద.

శిఖ: (నవ్వుచు) ఎంత శౌర్యవంతుఁడవోయి! యవనేశా! మీ సేనయందందరిట్టి వీరాగ్రేసరులేనా? ఇట్టి ధర్మపరులేనా?

పాత్ర: (కత్తితో శిఖరకుని పొడవఁబోవును)

సెల్యూ: పాత్రకులా! నిల్వుము నిల్వుము. ప్రల్లదుఁడా! మేమడుగు ప్రశ్నలకు సరియగు ప్రత్యుత్తరమిమ్ము లేనిచో జేటుమూడును. ఇప్పుడు చంద్రగుప్తుఁ డెచ్చోట నున్నాడు.

శిఖ: దైవమున కెఱుక. ఎచ్చటనున్నను మీరు నాసి సెదుర్కొనకుండుటయే మీకు శ్రేయస్కరము.

సెల్యూ: ఏమిరా! నీ ప్రత్యుత్తరములు నీ రాజు ప్రత్యుత్తరములకంటె మదోద్ధతములుగ నున్నవే. మా కన్న నతఁడే విషయమున గొప్ప?

శిఖ; ఏ విషయమునను మిమ్మువంటియుఁ బోలకుండుటయే యతని గొప్ప.

సెల్యూ: క్షుతిమించి రాగమున బడుచున్నదే!

శా॥ ఓరీ ధూర్తవిరోధి! మాయెదుటనే యున్మత్తుచందంబులన్
మాఱుంబల్కుచు మా రిపుం బొగడుచున్ మమ్ముల్లసంబాడుచున్
బీరంబుల్ప్రచరింపఁ జూచెదవు, జీవింపంగ వాంఛింపవే
ఏగా! ఈ చెరలాటముల్పొసగునా యేనుంగుతో దోమకున్

ఇఁకన్ నిట్లు మాట్లాడిన మరణదండన విధించెదను సుమా.

శిఖ: బ్రహ్మదేవుఁడు పుట్టువుతోడనే మన కందఱకు మరణదండన విధించె. అది కొంచెము ముందైననేమి, కొంచెము వెనుకైననేమి? దానికిఁ బ్రాజ్ఞుఁడెవ్వఁడు చింతిఁచు? మరియు నేఁగోరఁదగినదియు నీ వీదగినదియుఁ నొక్కటే- మరణము.

శిఖ: సిరియేశ్వరా! నానోటనుండి భారతీయుల గుట్టుఁ గనుగొన యత్నించుట ఇసుమునఁ దైలముఁదీయఁ బూనుటయే. మరి, నాబోటి వానికి మరణభీతిఁ గల్పించి మాతృద్రోహమునకుఁ బురికొల్పుట మీకు శూరాచారము తెలియమి గాని వేఱు గాదు. మరణమన్న వెనుదీయువాడను గాను.

పాత్ర: అట్లైన ధూర్తా! నీకోర్కె నెరవేర్చుకొనుము(కత్తితోఁ బొడువ శిఖరకుఁడు నేలబడును.)

హెూలెన్: సేనానీ! - ఇదేటి బీరము. తండ్రీ! నీ యెట్టయెదుట నా? ఇట్టి యన్యాయమా? దేశభక్తిచే స్వదేశమాత నగ్గించి స్వదేశనాయకు శ్లాఘించినందుల కిట్టిదియా శిక్ష?

ఉ॥ ఎంచగరాని సంగరమహీస్థలులన్ మును విక్రమక్రమా
భ్యంచితశత్రుసైనికవిహారము నోర్చి జయించి కీర్తి నా
ర్జించిన గ్రీకుశూరులకుఁ జెల్లు నె? నిర్జితు, నిస్సహాయు, ని
ర్వ్యంచితవిక్రముల్ నిగళబద్ధునిఁ గ్రించులమాడ్కిఁ ద్రుంచుటల్.

సెల్యూ: పాత్రకులా! ఇంత త్వరయా (దగ్గరిచూచి) ఆయన గాయము స్వల్పము. పుత్రీ, ఇట్లు వంచిన వంగని విఱిచిన విఱుగనివారి నేమి సేయుమనెదవు?

శిఖ: దానిని మీరే నిశ్చయించుకొనవలయు. కసాయివానివలె యుద్ధమాడవచ్చినఁ జంపివేయుదు. వర్తకునివలె రణమొనర్పవచ్చిన ధనముఁగొని వదలివేయుదు. రాజువలె సంగరము సలుపవచ్చిన జికిత్సచేసి వదలివేయుదు. ఇక మీ యిష్టము.

సెల్యూ: హిప్పను, వీనిం గొంపోయి యీ గాయమునకుఁ జికిత్స చేయించి పంపివేయుము (హిప్పఁడు శిఖరకునితో నిష్క్రమించును.)
సేనాని! నీవు సత్వరముగ నేగి కార్యమును జక్కపెట్టుకొనిరమ్ము (నిష్క్రమింప) హెలెన్, చింతింపకుము. రమ్ము, భోజనశాల కేగుదము. (హెలెన్ సెల్యూకస్ నిష్క్రమింతురు.)

రద: ఆహా! దైవము నేడే శిఖరకునంపెను. నెచ్చెలి వలవంతను భారతేశ్వరునకుఁ దెల్పి యాతని హెలెన్ కడకు రప్పింప నవకాశము గలిగినది. పోయి సమయముఁజూచి యట్లొనర్చెద. (నిష్క్రమించును.)



# చంద్రగుప్త నాటకము.

## తృతీయాంకము—ద్వితీయరంగము.

స్థలకము, వితస్తానది-బ్యూసెఫేలసు నగరము- తాచనగరు.

(మౌర్యుడు కొన్ని లేఖలఁజదువుచు పటమునుఁజూచుచుండును- మైత్రేయుఁడు చెంతనుండును)

మైత్రే: వయస్యా, నిన్నొకభార్య వదలిపోయినను నీ వొకభార్యనువదలినట్లులేదే?

చంద్ర: మైత్రేయా; ఏ మీ వెఱ్ఱిప్రసంగము.

మైత్రే: కాదోయి, ఈ పనిపడతిని నీవు వదలననుచున్నావు. మిట్టమధ్యాహ్నమైనది, కడుపులో మలమల మాడుచున్నది. నీ వేమైన క్షారసముద్రములో లభించిన సుధను దినినావా?

చంద్ర: మిత్రా! నీకింత యాకలియైన నీవేగి భుజింపరాదా? నే వలదంటినా?

మైత్రే: భళీ! బాగుగ బలికితివే వయస్యా! నీవుపవాసమున్న నా కన్నము మ్రింగు వడునా? ఇట్లింత కాల మొకయొడ్డున గ్రీకులు వేఱొకయొడ్డున మనము శిబిరముల వేసికొని వితస్తానదీ దేవతను గొల్వవలెను? ఒక్కసారి యేరుదాటి భీముడు రాక్షసుల నుగ్గాడినట్లు వైరుల పీచమడచరాదా? అట్టికార్యము నీచేఁగాకున్న నాబోటి శూరోత్తంను పంపరాదా?

చంద్ర: నీ సాహసము నేనెరుగనిదా? నిన్ను వైరులపై వదలిన మాకుఁగీర్తి నిలుచునా? కొంచెము తాల్మిఁ వాల్పుము. కార్యముపట్ల నోర్పులేకున్న నెట్లు? త్వరపడి కార్యముఁ జెరచుకొననచ్చునా?

చ॥ మనపొరపాటుచే భరతమాతకు గ్రీకులచేఁ బరాభవం
బని నొనఁగూడెనేని, ధర, నా విధుభాస్కరతారకంబుగా
మన కపకీర్తిఁ గల్గునని మౌర్యుర వెంటనే మార్కొనంగ నే
వెనువడినాడఁగాని, యొకవేలొ నఁగూడిన నూరకుంమనే!

నేటివార్తలచే నాసమయ మాసన్నమగుచున్నదని తెలియవచ్చుచున్నది.

మైత్రే: నీ విటులే యనుచుంటివి. మొట్టమొదట నీ సుక్కురుల మన దేశములో గాల్పెట్ట నిచ్చియుండఁ గూడదు.

చంద్ర: మిత్రా! సెల్యూకసు ముందుగనే మనము సంధి కొడంబడమని తెలిసి మున్ముందుగా సేనల నాయితము చేసికొని సుభాకనుమలో మలయకేతువును కూటయుద్ధమున బంధీకృతునిఁగ జేసి మన దేశమును బ్రవేశించె. మించినదేమియు లేదు. సింహాగారము జొచ్చు మృగంబులకుఁబలె మన దేశంబున వారెంతదూరము ప్రవేశించిన వారికంత యాపత్కరము సుమా. నిజంబుగా మనకుఁ గొన్ని దినములలో జయము చేకూరు.

మైత్రే: మాటలు చెప్పుటకేమి? నా యవస్థ పరమాత్మని కెఱుక. సమయమున కన్నము లేదు, నీళ్లు లేవు. ఇంతకు మున్ను నేఁ బెండ్లికొడుకువలె నుంటిని. నిన్నుఁజేర వినుముచే నగ్గికి నుత్తిపెట్టినట్లు నాకుఁ బ్రాణాపాయమగుచున్నది.

చంద్ర: మిత్రా! నిన్నుఁ బాటలీపుత్రమునకే యుండమంటినే! నా మాట వినక వచ్చితివి గదా.

మైత్రే: పిల్లికి చెరలాటము, ఎలుకకుఁ బ్రాణసంకటమన్నట్లు నా యవస్థ నీకు హాస్యాస్పదమా? త్వరగా యుద్ధము ముగించి ఇంటికిఁ బోవుద మంటిని. ఇష్టము లేనిచో నిక్కడనే యిల్లు కట్టుకొనియుండుము. నా పుట్టేమి మునిగెడి. నే బోయెద (పోవుచో బ్రతీహారి ప్రవేశించిన నిలుచును.)

ప్రతీ: రాజేంద్రా! ఆర్యచాణక్యులు (ప్రవేశము చాణక్యుడు, మౌర్యుఁడు నమస్కరించును.)

చాణ: శీఘ్రమేవవిజయోస్తు. వృషలా,

(జనాంతికము) ఇప్పుడే శకటదాసు మనకొక శుభవార్తఁ బుత్తెంచె. నేఁడు ప్రదోషకాలమున సెల్యూకసు నదిని పైనదాటి మనపై నాకస్మికముగాఁబడ నున్నాడట. మన మీ దరిని గాచుచుండ బహిరంగముగా గెలువలేమని మంత్రాలోచన మొనర్చి యిట్లు సేయఁదలచినట్లున్నది.

చ॥ మును పిటులే సికందరుఁడు మోసముగాఁ బురుషోత్తమాఖ్యతో
నని బొనరించి గెల్చె నిపు డట్టులె మౌర్యునికూడ గెల్వఁగా
నను వగునంచు సెల్యుకసు డహంకృతిమై పటుతెంచునట్టి భ్రాం
తిని వెడలించి తెల్లముగఁ దెల్పుము తావక ధైర్యశౌర్యముల్

చంద్ర: గురూత్తమా! తమ యాశీర్వాదమున్న నిదెంతపని?

చాణ: ఇతఁడు త్రవ్వఁదలచిన గోతిలో నితఁడే పడునట్లొనర్పుము. గూఢముగా సేనను నిల్పి మన్యమార్గమున నడ్డగింపుము. (ప్రకాశము) భారతమాతౄణ మొకింత తీర్పుము.

ఉ॥ ఏనును నీవునుం గలిసి యెన్నియొ సారులు దేశమాతృసే
వానిరతిం విరోధుల విపన్నులగా నొనరించి దేశమా
తౄణ మొకింత దీర్చితి మదేవిధి నేనును నాచరించి య
ద్దానినొకింత వితతంబుగఁ దీర్చెదమో మురాత్మజా.

మైత్రే: (స్వగతము) అట్లయిన సెల్యూకుని పనివెక్కిరింపఁబోయి వెల్లకిలఁబడినట్లగును.

చంద్ర: స్వామీ! అందులను సందియమేమి? తమ యాజ్ఞానుసారము వర్తించెద నమ్ముఁడు.

చాణ: వత్సా! నేబోయివచ్చెద. కర్తవ్యాంశముల నప్రమత్తుఁడవైయుండుము. (నిష్క్రమించును.)

మైత్రే: (చంకలు దట్టుకొనుచు) రేపటితో నా కష్టములు గట్టెక్కును. భళీ భళీ పెండ్లా మీఁడే కెనన్నను నింత సంతసముగలుగదోయి. వాడు నా ఆయుస్సు బోసికొని బ్రదుకుగాక; అతని పేరుఁ జెప్పికొని నేను నేటినుండి సుఖంబుగా గారెలు, బూరెలు, బొబ్బట్లు తినియెద.

చంద్ర: ఎంత యల్పసంతోషివి. ఒక్క యోటమితో యుద్ధమంతమగునా?

ప్రతీ: (ప్రవేశించి) మహారాజా! ద్వారమున మలయకేతు సేనాని శిఖరకుఁడు వచ్చియున్నాడు.

చంద్ర: లోనికి రప్పింపుము (ప్రతీహారి నిష్క్రమించును, శిఖరకుఁడు ప్రవేశించును)

శిఖ: రాజేంద్రా! జయము.

చంద్ర: శిఖరకా! పాపము పర్వతేశుఁడు యవనులచేఁ జిక్కెనట. అతని ద్వగలో విడుదలఁ జేయించు యత్నము లొనర్చుచున్నాను.

శిఖ: రాజకంఠీరవా! మీరు పూనుకొనిన నదెంతపని? ఇప్పుడు నేనొక రహస్య సందేశము దెచ్చినాడ.

మైత్రే: (తనవంకఁ జూచుటఁ గాంచి) మా కిద్దఱికభేదము. నేనున్నను నీ వార్తఁ దెల్పవచ్చును.

శిఖ: (మౌర్యుఁడూరకుండ) రాజేంద్రా! నేను యవనులచేఁజిక్కి యిప్పుడు నాకు ప్రాణదాన మొసంగిన సెల్యూకసుని పుత్రి హెలెన్ మీపై మరులుకొన్న దనియు మీ దర్శనంబున కనుదిన మెదురుచూచుచున్న దనియు నాకని చెలికత్తె రదనిక తమతో నివేదింపుమనియె. ఇకఁ గార్యభారము తమపై నున్నది.

చంద్ర: ఏమేమీ? సెల్యూకసుని తనూజ నాపై మరులుగొనెనా? అహో! దైవమాయ (స్వగతము)

ఉ॥ చందనదాసు వర్తకము సల్పినటుల్ చని, సెల్యుకేశ రా
ణ్ణందనఁబోలుసుందరి వినన్ గన లేదని తెల్పినంత, నా
కందని మ్రానిపం డెది యటంచుఁదలంచితినో, యదే ధరా
స్యందనుమాయచేఁ, గరతలామలకంబుగఁ నయ్యె; బాపురే!

మైత్రే: వయస్యా! ఏమోయి నీ బ్రహ్మానందము? యవనస్త్రీయేమి! నిన్ను వరించుటేమి! ఇదేమి మోసమో?

శిఖ: రాజచంద్రా! ఇందేమి వంచనలేదు. రదనిక యార్య రాక్షసుని గూఢచార బృందములోనిది. ఆ రాకన్య అసదృశసౌందర్యనిధి. అసమానగుణఖని. అవశ్యము రక్షణీయ.

చంద్ర: శిఖరకా! నిన్ను నా సేనానులలో నొకనిగఁ జేసితి. పోయిరమ్ము, కర్తవ్య మొనర్పుద.

(శిఖరకుడు నిష్క్రమించును)

మైత్రే: వయస్యా! కొంపఁదీసి యా యవనకన్యకై వైరి శిబిర మేగెదవా యేమి? ఆమాటఁ దలపెట్టినంతటనే నా దేహము కాకరకాయవలె గగుర్పొడుచుచున్నది. పోయెదవా? చెప్పుము.

చంద్ర: నా యుద్దేశమదియే యనుటకు సందియమేమి. మైత్రేయా.

ఉ॥ సుందరి, "వచ్చి" ప్రోచుడనుచున్ గుయివెట్టుచునుండ, మానసా
నందము, "పోయి, రక్షణ మొనర్పుము" నా బురికొల్పుచుండ, ఈ
కందువ, లేనిపోని యుపకారములందలపోసి, నాతి ప్రో
వం దమకింపకుండుటొక పౌరుషమా! రసికత్వధర్మమా.

మైత్రే: పౌరుషము పాడుగానీ! రసికత్వము రాలిపోనీ! నీవు మాత్రము పోవద్దు నిన్ను వేడెదను.

చంద్ర: మిత్రమా! ఇంత భయమేల? నాచేతఁ గృపాణ మున్నదనుక నొరులకు నన్నుఁ జెనకనగునా? ఏల పోవల దనియెదవు?

ఉ॥ ఏలకొ యిట్లు భీతినహియించివచింప, సుహృద్వరేణ్య! నా
కేలఁగృపాణముండఁదమకించి యెదుర్కొను శత్రుకోటులన్
దాళగలే నటంచొ? మది దృష్టిమనోధనవశ్యతోఁ హారల్
గోలలు, వారిఁగాంచ వెతగూరునటంచొ? మరేమొ తెల్పుమా?

మైత్రే: అదియంతయు నాకుఁ దెలియదు. ఎట్లు పోఁగలవు. నీవుమాత్రము పోవలదు.

చంద్ర: అతిస్నేహము పాపశంకి కదా. వితస్తానదికిక్రింద నొక సొరంగమున్నది. అట్లుపోయెదను. ఆర్తరక్షణ మార్యజన కర్తవ్యము గదా! నన్నింక వారింపకుము. ఇప్పుడు లోని కేగుదము రమ్ము (యవనికపడును).



# చంద్రగుప్తనాటకము.

## తృతీయాంకము—తృతీయరంగము.

### స్థలకము—నికియాపట్టణప్రాంతోద్యానము.

(ప్రవేశము. హెలెన్ విరహార్తయై యొక చంద్రకాంత వేదికపై బరుండియుండును.)

హెలెన్: ఈ జ్యోత్స్నతోడ నా వలపు మిక్కుటమగుచున్నది. ఔరా! ఈ కాముని ప్రభావము? ఈ వియోగవ్యథ నెన్నినాళ్లోర్వగలను. నావలపు తెలుంగదెలింగించిన నా మనోహరుఁడు నాపైఁ గరుణించి చేకొనునో లేక తనంత తా వలచిన దీ తరుణి యని చులకనజేసి తిరస్కరించునో? ఈ సంశయముకంటె నెట్టియదార్థమైన మేలుగదా? ఈ యుపకారము నాకెవ్వరొనర్తురు? ఇంక నగ్గలించు సిగ్గును ద్రోచివైచి నిన్న యోచించినట్లు నా హృదయేశ్వరుని కొక లేఖ వ్రాసి రదనిక చేతికిచ్చెద. నా మనసుకుఁ గొంత స్వాస్థ్యమైన గలుగును. (పత్రముఁ గైకొని లిఖించుచు) అక్కటా! అశ్రుబిందువులడ్డము వచ్చుచున్నవే (విషాదమనస్కయగును)

(ప్రవేశము రదనిక)

రద: (స్వ) నెచ్చెలి దుఃఖముఁ జూడ దుస్సహమగుచున్నది. ఈ దిన మెట్లయిన రహస్యము గన్గొనెద (డాసి ప్రకాశముగా)

చ॥ కువలయనేత్ర నీముకనుగొల్కుల నిండియజస్రమశ్రు బిం
దువు లెడలేక చిప్పిల నధోముఖివై పలవింపనేమి హే
తువొ చెపుమాఁ త్వదీయముఖతోయజమందెల నవ్వువెన్నెల
ల్దవులగఁజేతు లేనియెడలన్ ననుదబ్బఱయుంచుఁబిల్వుమా.

హెలెన్: నెచ్చెలీ! ఎన్నిమారులు నీవు నట్లడగుట, నేనేమియు లేదనుట?

(లేఖను దాచి కన్నీరు తుడుచుకొనును.)

రద: నీ వొకప్పుడైన విసికి యథార్థమెఱింగింతువేమోయని యడిగితి. కన్నులు మూసికొని పాలుఁద్రావి యితరు లెఱుంగరనుకొను పిల్లివలె మాటాడెద వేల? నిప్పులేనిది పొగయుండునా? ఎవరిపైననో నెనరూని యిట్లువందురు

చున్నావు. తావి పూవు తావుంబోలె నీ చర్య నీ గుట్టును రట్టుచేసె. రహస్యము దాచుకొలఁది నగ్గివలె నపాయకరమగు. సిగ్గుపడి సుఖమేల చెఱచుకొనెదవు? చెప్పుము సుఖపడుము.

హేలెన్: రదనికా! నిర్బంధమేల? రేపో మాపో చెప్పెదనులెమ్ము.

రద: ఇప్పుడు చెప్పిననేమి? నీకు నాపైఁ బూర్ణ విశ్వాస మున్నట్లుఁ దోఁచదు, కాన నే నీ దాస్యవృత్తివదలి నావారికడ కేగెద.

హేలెన్: అక్కటా! నీవేగిన నెట్లు? నా మనోరథ సాఫల్యమంతయు నీచేతనే యున్నదిగదా (చింతించి)

చ॥ వినుమిక దాపనేల? జనవిశ్రుత విక్రముఁడైన చంద్రగు
ప్తుని పటమీవుచూపి తదపూర్వగుణాదులఁ బ్రస్తుతించి నం
తన నా హృదయమ్మునందొక వితమ్మగు గొంతెమకోర్కె యొండు సం
జననమునొందె యెప్పుడు విషాదము గూర్చునదేమొ నెచ్చెలీ!

రద: ఓసీ బేలా! ఇంతియేనా? ఇట్టిదని నే నెప్పుడో కనుఁగొంటి. అయిన నీ నోటనే వినవలెననియుంటి.

హేలెన్: ఎంత నేర్పరివి! ఇంక నాకేమి యుపకారమొనర్తువో చూతము.

రద: సఖీ! నీయవస్థఁజూడలేక యా శిఖరకునిచే మౌర్యునికి నీ వృత్తాంతమెఱింగించి నిన్ను రక్షింప సందేశమంపితి.

హేలెన్: అక్కటా! రదనికా! ఇట్లొనర్చిన నన్నతఁడు కులటయని తలంపకుండునా?

రద: భయపడకుము. రసికాగ్రేసరుఁడగు మౌర్యుడు 'కాముకస్యకుతో లజ్జా' యని యెఱుంగడా?

హేలెన్: అట్లయిన నన్ను రక్షింపరాదేమి? నెచ్చెలీ! నీవును నేనును భ్రమింతుముగాని యతఁడేలవచ్చును.

ఉ॥ ఎందఱో యార్యజాతి మతవృత్త విరాజిత సుందరాంగు లిం
పొంద భజింపఁదారకల నొప్పెడు చందురుమాడ్కి వెల్గుశ్రీ
హిందువసుంధరారమణుఁ డిందులకెందుల కాత్మ శత్రుదా
ణ్ణొందన నన్యజాతిమత నర్మిలిఁగోరగవచ్చు నెచ్చెలీ॥

రద: అట్లనకుము. ఆ సందేశ మతని కింకను జేరియుండదు. చేరినఁ దప్పక వచ్చియుండును. మఱియు,

చ॥ 'వలచితిరార, వచ్చి, నను బాలన సేయుర, ధీర' యంచు ను
త్పలదళనేత్రి నీవు పనుపన్ రసికాగ్రిణి చంద్రగుప్తుఁ డే
వలననురాక తామసిలు వాని మనంబు పలంబొ దారువో
కులిశమొ, లోహమో, కుటిలకుంతల, యింత యెఱుంగనేరవే.

హేలెన్: అట్టి మహద్భాగ్యము నాబోటి మందభాగ్యురాలికిఁ బట్టునా?

రద: పట్టకేమి? నీ ప్రజ్ఞ నెఱుఁగక మౌర్యు సుదారగుణ మెఱుఁగక యిట్లాడెద వింతియు.

హేలెన్: నీ మాటలే రూఢియగు గాక. అయిన నీ వలపు నాకు మావారిలోఁ దలవంపులు దెచ్చుఁగదా.

రద: అట్లెన్నటికి జరుగదు. ఒకవేళ నట్లగును బో, కామించు కాంతుని కౌగిలి కంటె నది యధికమగునా?

హేలెన్: (మౌర్యు చిత్రమును జూచి) ఈతని రూప మింతకంటె సుందరమా.

(ఇద్దరు చిత్రమునే చూచుచుందురు. గ్రీకు సైనికుని వేషమునఁ జంద్రగుప్తుడు ప్రవేశించును.)

చంద్ర: నారే హేలెన్ రదనికలు గాబోలు. ఆ విదేశీయ వస్త్రములఁ దాల్చి నదియె హేలెన్ గావలయు. లేనిచో నిట్టి యసమాన లావణ్యరాసు లిద్దఱుందురా? ఆహా! విరహవేదన గూడ నీ తన్వికొక క్రొత్త యందాలతం గల్పించె. చిత్తజుని వహ్నికీలల నెత్తు దగ్గినను వన్నె హెచ్చి మిఱుమిట్లుఁ గొల్పుచున్నది.

తే॥గీ॥ పర్ణముంబోలె మానంబుఁ బరిహరించి
పల్లవముబోలె రాగంబు పరిఢవించి
తలిరుగుమి వోలె నవనవోత్కలికమించి
కొమ్మ యలరారు నౌరౌర! ఇమ్మధువున.

ఈ కమలాక్షికి నారాక నెట్లు తెలియఁ జేయుదును
(పాత్రకుఁడు ప్రవేశించును.)

చంద్ర: ఎవఁడితఁడు! (దాగుకొనును)

పాత్ర: హెలెన్! దేనిని మీరిద్దఱు తదేకదృష్టితోఁ దిలకించుచున్నారు.
(ఇద్దఱులికిపడి లేతురు. పటమును దాచుదురు.)

హెలెన్: ఏమియు లేదు. ఏదోయొక పటమునుఁ జూచుచుంటిమి.

పాత్ర: రదనికా! నీవేగి హిప్పస్సిక్కడ నెక్కడనోయున్నాడు. తోడితెమ్ము.
(నిష్క్రమించును)

చంద్ర: (స్వ) ఈ ధూర్తుఁడేదో పన్నాగముఁబన్ని యిందుఁ జేరవచ్చినట్లున్నది. ఏమైన నేనున్నాఁడ గదా.

హెలెన్: సేనానీ! ఏలయిట్లు చెప్పి పంపక యకస్మాత్తుగా వచ్చితివి. రదనిక నేల పంపితివి.

పాత్ర: ఉ॥ నెచ్చెలి నీకునాకుఁగల నెయ్యముతియ్యము విస్మరించి నీ
విచ్చటికేమికై యిటులవచ్చితివన్న నికేమి మాఱు నా
ప్రుచ్చెదువాడ మన్మథవిరోధము సైపక నీదుపంచకే
వచ్చితిఁ బ్రాణభీతిసిఁకఁ బాలనముంచెదొ నీటముంచెదో?

చంద్ర: (స్వ) ఓహో! ఇదియా కథ! కానిమ్ము, హెలెన్ ఈ మూర్ఖుని వచ్చిన త్రోవన పంపకుండునా!

హెలెన్: సేనానీ! ఇందులకా వచ్చినది? ఇంక నీ వేలతలంపు మాని నీ త్రోవను బొమ్ము.

పాత్ర: హెలెన్! త్వరపడక నేఁజెప్పదలఁచుకొనినది వినుము. ఈ రాత్రి ఇకఁ గొన్ని గడియలకు హైందవ శిబిరముపై దాడివెడల నున్నాడ. అందు జయంబు మనకే యగు. అయిన రణసంరంభమున నాకేమి విపత్తు మూడునో దైవమునకే యెఱుక. నిన్ను మఱలఁ జూచెదనో లేదో! కావున నా కడసారి ప్రార్థన నాలకింపుము. నిన్ను నేఁ జాలకాలమునుండి కామించి యుంటి, నీకును నే ననిష్టుఁడఁగానని తలంచుచుంటి. నీ విప్పుడు యుద్ధాంతమున నీ తండ్రి యిష్టపడిన నన్నుఁ దప్పక పరిణయమాడెదనని స్వహ

చిత్తుఁడనై యుద్ధమున కేగెద. ఈ సంతోషవార్త నాకెక్కుడు సత్తువ నీయ శత్రువులఁ జక్కాడి విజయుఁడనై వచ్చెద. లేనిచో,

హెలెన: సేనానీ! చాలుచాలు. వినఁదగిన దంతయు వింటిని. ఇఁక గదలిపొమ్ము. నా మనంబన్యాసక్తము.

పాత్ర: అక్కటా! హృదయేశ్వరీ! ఒక్కమాటతో నా కొండంతయాసను రిత్త పుచ్చితివే!

చ॥ పనివడి నేడుగాని యెడ హారక లేపటికైన నన్ను బ్రీ
తిని గదియించి, సౌఖ్యజలధిం దమిదీరగ నోలలార్తువం
చనుదినమెంచి పల్పిన యనంత సపర్యలు వీటఁబోయె, బీ
డున వెదఁజల్లు బీజములటుల్, యువనీ నవనీత కామినీ

ఇదియేనా నీ కడసారిమాట? (ఊరకుండుటఁజూచి) అట్లయిన నీ మనోహరుఁడెవ్వరు?

హెలెన; సేనానీ, నీకుఁ జెప్పవలసిన విషయములఁజెప్పితి. ఇతర సంగతుల ప్రసక్తి నీకేల!

పాత్ర: అదిగో! అదేం పటము? నీ మనోహరునిదా? ఏదీ, మాత్రమిటు దెమ్ము (చేఁజాచును.)

హెలెన: ఓయీ! నీకీ యధిక ప్రసంగమేల! త్వరగా కాలికి బుద్ధిసెప్పుము లేనిచో నీ ధార్ష్ట్యము నా తండ్రితోఁ జెప్పెద.

పాత్ర: ఓసీ! టక్కరి! ఇంతమాత్రముతో నే వదలిపోవుదునా? ఇంక నీ యాటల సాగనిత్తునా (పటమును లాగికొనును)

హెలెన: నెచ్చెలులారా! రక్షింపుఁడు రక్షింపుఁడు. హా! ప్రాణేశా!

పాత్ర: ఓహో! (పటముఁజూచి) మగధేశ్వరుఁడా నీ మనోహరుఁడు. సరిసరి గానే దలంచితివే? (చంద్రగుప్తుఁడు బయటికివచ్చి పటమును లాగికొని)

చంద్ర: ధూర్తా! నీ బంటుతన మొంటరిగనుండు నబలల ముందటనా ప్రదర్శించెదవు!

పాత్ర: ఎవఁడవురా నీవు! ఎవరి ముందఱఁ బ్రదర్శించిన నన్నేమి సేయఁగలరు? నే నెవ్వఁడ ననుకొని యిట్లాడితివిరా?

చంద్ర: ఉ॥ ఇవ్వనజాక్షి ప్రాణసఖులెవ్వరు చెంగటలేని కాలమం
దవ్విధచేతి చిత్రపటమాదట గైకొని, యింతికాత్మలో
నెవ్వగఁగూర్చినట్టి మహనీయపరాక్రమ విక్రముండ వీ
వెవ్వఁడవైన నేమి? పొలియింపక యే నినువీడువాఁడనే?

పాత్ర: ఓరీ! సైనికాధమా! నీ జంఝాటములు నాకడ సాగునా? ఇంకొక చోటికి గొంపొమ్ము.

ఉ॥ భీరు వితండటంచు వెలిపింపఁగఁ జొచ్చితివేమొ కాని దు
ర్వార పరాక్రమక్రముఁడ వైరిజనౌఘ విదారకుండ నో
రోరి యుపైకిఁ దెల్పిఁగొని యుక్తవిధంబున నాత్మమాపణన్
గోరనిచో వధించెద నకుంఠిత శౌర్యధురంధరుండనై.

చంద్ర: ఓరీ ప్రేలరీ: మాటలచే భయపెట్టఁజూచెదవా?

క॥ నీశరణము నీభరణం
బాశించెను వైరికోటు లట్టియును చుమా
నీ శరణము నాకేటికి
నా శరణము వేడకున్న, నాశ మొనర్తున్.

పాత్ర: ఎవరు నాశన మొనర్తురో చూతము రమ్ము. (అని పోరాడుచుందురు.)

హెలెనా: ఈ మహాత్ముం డెవ్వఁడో నా పాలిటి దైవమువలె వచ్చెను. ఏమీతని ఖడ్గ కౌశల్యము? ఇతని ముఖవర్చస్సు భాషోచ్చారణముఁ జూచిన నితఁడు యవనుఁడు గాఁ దోచుటలేదు. ఏమీ విచిత్రము!

చ॥ ఇతనిని గాంచినంతనె యిదేమి విచిత్రమొ కాని కామితే
ప్సితమును జెందనేరక తపించెను నామనంబు సౌఖ్యసం
వృతమగు దీనిఁజూడ హృదయేశ్వరుఁ డీతఁడెయంచుఁదోచు, రే
వతి గనిగాని యుత్పల మవశ్యము రెక్కల విప్పఁజొచ్చునే.

ఈతనిఁ జూచుకొలది యితఁడే నా మనోహరుఁడని రూఢియగుచున్నది. ఆ పటమునందలి పోల్కట్లన్నియు విశదమగుచున్నవి. చిత్రకారుఁ డెంతయు ప్రౌఢుఁడుగదా.

(చంద్రగుప్తుఁడు ఖడ్గము నెగురగొట్టగా)

పాత్రి: ఓరీ తుత్రిళ్ళిపడకుము. ఇల్లలికిరం బందువయ్యెనా? (పారిపోవును)

చంద్రి: (చిత్రిము పట్టుకొని) రమణీమణీ! ఇదిగో! ఆ ధూర్తుండు నీ చేతినుండి లాగికొనిన చిత్రిపటము. (అందిచ్చుచోఁ గరస్పర్శనమగు)

హెలెక్: (స్వ) ఈతని కరస్పర్శముచే నమృతంపు సోనలు గురిసినట్లయ్యె. ఇతనితో నెట్లు మాటాడఁగలను. (ప్రకా) నెచ్చెలీ! రదనికా! ఇటురమ్మా. వచ్చి ఈ మహానుభావునకు నా కృతజ్ఞతఁ దెల్పి నామధేయాదులడుఁగుము.

చంద్రి: బేలా! సమ్ముఖమ్మున గాంయబార మేల? నే నెవ్వరినైనఁ నీ హృదయము తెల్పుటలేనా? నేను నీవాఁడ, నన్ను లోకులు మౌర్యుఁడందురు. నీ వేమని యెడవో కనుఁగొనవచ్చితి. (హెలెక్ దూరమేగి పెదమోమిడును.)

మ॥ అరవిందాక్షి! మదీయనామమును నీ వాలించి నల్లంత నీ
సరసీజాస్యము డాగురించి కబరీ సందర్శనప్రాప్తిఁ జే
కుఱగాఁ జేసితి, వైన నేమదియె మాకుం జాలదే? గంగక
ద్దరి మే లిద్దరి యెగ్గటంచు గలదే? తారుణ్యపాథోనిధీ.

ప్రియసీ! సిగ్గునకు సమయాసమయములు వలదా. ఇంక నాయెడఁ బ్రసన్న వగుము (ఊరకుండుటఁ జూచి)

ఉ॥ "ఇక్కడి కెప్పు డేగు మగధీశ్వరుఁ డెప్పుడు నన్నుఁ బ్రోచు" నం,
చొక్కట సిగ్గువీడి ప్రిణయోత్కలికం దపియించి నేమరాక్;
ఎక్కడలేని సిగ్గు వహియించి, వచింపవు చూడ వింక నా
యక్కర దీఱెనంచు నలినాక్షిరో! సిగ్గునఁ జేరఁజీరితే.

హెలెక్: ప్రాణేశ్వరా! మీ దర్శనము నాకు వాగ్బంధనకారణము. ఇంక మీ కెరుంగని దేమున్నది? మీ రిక్కడ నిల్చికొలది మీ కాపద హెచ్చుచున్నది. ఆ దుర్మార్గుఁడు పాత్రికులుఁడు పరిమందిని పోగుచేసి మీ పైకి వచ్చును.

చంద్రి: ప్రియసీ! నీమాట నిక్కువము. నీ పరువును గాపాడ నా తుచ్ఛపిఁ బ్రాణములతో వదలిన నయ్యది మన సౌఖ్యమున కంతరాయమాయె. పుణ్యముఁ జేయఁబోయిన పాపము వెంటనంటె (లోపలఁ గలకలము.)

హేలెన: వల్లభా! అదే ఆయుధధ్వానము. ఆ దుష్టుడు వచ్చుచున్నాడు. పోయి రండు. పోయిగండు.

చంద్రః: ప్రాణేశ్వరీ! వానిరాక నీకు విపత్కరము కాదుగదా?

హేలెన: మనోనాథా! అతఁడు నాకేమి సేయఁగలడు. మీరు నిర్భయముగాఁ బోయిరండు. నన్ను మఱువక త్వరలోరండు.

చంద్రః: హేలెనా! నామనంబు నీ యొద్దఁ బూఁటకాపుగాఁ వదలితినిగదా ఇంక రాకుందునా?

(ఇద్దరు వేర్వేర నిష్క్రమింతురు.)

పాత్రః: (సైనికులతోఁ బ్రవేశించి) ఆహా! పిట్టలు పారిపోయినవే! సైనికులారా! కొత్తయువన సైనికుఁడిక్కడ జొట్టుప్రక్కలనున్న బంధింపుడు. పొండు, (పరికించి) ఇదేమి ఇది? ప్రణయలేఖయా?

(జాబుఁగైకొని చదువును.)

ఉ॥ నీ మహనీయరూపరమణీయత నీ గణనీయసద్గుణ
స్తోమము నీ గరిష్ఠభుజశూరత నీ స్తవనీయసర్వరా
జ్యామలకీర్తిసంపదల నన్నిటిఁ గంటిని వింటి వెంటనే
కాముని వాఁడిఁ జిక్కితి నిక మగధేశ్వర ఎట్లు బ్రోచెదో.

ఉ॥ నమ్మినవారల న్నిరసన మ్మొనరింపవు చంద్రగుప్తుడం
చు న్నమ వేనవేల్నుదువు చోవిని సూనృతమంచు నమ్మి నా
జమ్మగు సిగ్గుఁబోవిడిచి సర్వముఁదెల్పితి నింక నీవు చి
త్తమ్మున మదీయ భాగ్యముకదా మగధక్షితినాథచంద్రమా.

కానిమ్ము. దీనితోనే హేలినిని నా దాసిగాఁ జేసికొనియెద.

(నిష్క్రమించును.)



# చంద్రగుప్త నాటకము.

## తృతీయాంకము—తురీయరంగము.

### స్థలము—నికియానగరము, రాజమార్గము.

(సెల్యూకస్, మెగాస్థనీసు, పాత్రికులుండు, భటులు ప్రవేశింతురు.)

సెల్యూ: సేనానీ! సైనికుల యామయామమునకు ద్వారముకడ మార్చుచుండవలయు. ఎప్పుడీ హైందవులు మనల ముట్టడింతురో తెలియదు గాన సప్రమత్తుఁడవై మెలగవలయు.

పాత్రి: రాజేంద్రా! తప్పక యట్లే యొనర్చెద.

సెల్యూ: మంత్రివరా! మన పరాజయమునకుఁ గారణము మన రహస్యదండయాత్రను మన వైరులకెవ్వరో తెలియఁజేయుటయ యగు.

మెగా: మన సైన్యములో గాంధారదేశము కుభాదేశమునందు హిందువులున్నారుగదా. వారలలో నెవ్వరైనఁ దెలిపియుందురు. అందుఁ గొందఱు మౌర్య వేగువారై యుందురనుట నిస్సంశయము.

సెల్యూ: ఉండిన నుండురుగాని వారెట్టులావార్త నచ్చటి కంపియుండఁగలరు?

మెగా. అందుకేమి యుపాయాంతరము లేకుండునా? పావురములద్వారా పంపియుందురు. లేక యాతీరమునుండి యీ తీరమునకు దొంగత్రోవలున్నవో!

సెల్యూ: సరే కానిమ్ము. నీవేగి ప్రతి గృహమును గాలించి పావురముల నన్నిటి బట్టి వధింపుమనుము. యవనేతరుల హైందవులపై యుద్ధమున నుపయోగింపవలదని యాజ్ఞాపింపుము.

మెగా: రాజేంద్రా! తమ యాన శిరసావహించెద. (నిష్క్రమించును.)

సెల్యూ: సేనానీ! ఆ చారుఁ డెవఁడై యుండునో కదా.

పాత్రి: ఆ చారుఁ డొకఁడవనేల? మౌర్యుఁడే మన శిబిరమునకు వచ్చియుండె.

సెల్యూ: ఏమీ ఏమీ! కుందేలు వంటిల్లు జొచ్చెనా? నీ వతని నిక్కడఁ జూచితివా? చూచియు వదలితివా?

పాత్రి: రాజేంద్రా! నా తప్పు క్షమింపవలయు. అతఁడు యవనసైనికవేషమున నుండ నే మొదట గుర్తింపలేనైతి. పిదప గుర్తించి పట్టుకొనఁబోఁదతికి వాఁడదృశ్యుఁడయ్యె.

సెల్యూ: ఎంత ప్రమాదము! ఎంత ప్రమాదము. యుద్ధము లేకయే మన యభీష్టము నీడేర్చుకొను తరుణమును రిత్తపుచ్చితివే. అతఁడట్టులేల మన శిబిరమున కేతెంచెనో నీకుఁ దెలియునా?

పాత్ర: (స్వగ) నేను వేచియున్న తరుణ మాసన్నమైనది. ఇతని కింకఁ బురికొల్పి హెలెన్‌ను నా వలలోఁ జిక్కించుకొనియెద (ప్రకా) తెలియనుగాని దానిని నుడివిన మీకు దుఃఖ మినుమడించునేమో యని చెప్పనోడెద.

సెల్యూ: ఈ పరాజయము కంటె నా కెక్కుడు దుఃఖ కారణ మేముండును? ఎట్టిదైనను వినఁగోరెద.

పాత్ర: నేనీ మూలమున మీకుఁ జింతపెంచిన క్షమింపవలయు, మౌర్యుఁడొక యవన స్త్రీ పఃపున నిటువచ్చె.

సెల్యూ: ఎవరా ధూర్త? ఎవరా దేశద్రోహి? చెప్పుము, తత్క్షణమే శిక్షించెద.

పాత్ర: రాజేంద్రా! నిన్న సంజవేళ శిబిరమంతయు భద్రముగ నున్నదో లేదో యని పరిశీలించుచుండ నొక్కచో నిద్దఱి సంభాషణ వింటి. అందొక వ్యక్తి కంఠ ధ్వని నాకుఁ జిరపరిచితమగు కాంత దగుటచే నిశ్చేష్టుఁడనై నిలుచుంటి. ఇంతలో నా తిన్వి తన్ను శిబిరమునుండి గొంపొమ్మని ప్రార్థించుచు నతనిని ప్రాణేశా! మగధేశా! యని సంబోధించుచుండె. అతఁడు వలదని నుడువుచుండె. ఆ కంఠధ్వని మౌర్యునిదని గుర్తించితి.

సెల్యూ: అహో! ఏమి కాలవైపరీత్యము.

క॥ భారతయువతులు యవనులఁ
గోరుట లటమాని యవనకుటిలాలకయే
భారతయువకుని నెమ్మదిఁ
గోరెనె? బెండులు మునిఁగె గుండులు దేలెన్.

పాత్రికలా? ఆ పాంసుల యెవ్వరు. త్వరగా నుడువుము. చించి చెండాడెద.

పాత్రి: ఇంకను మీరు గ్రహింపలేదా? ఆ తరుణి మ-మ-హే-ళి-ని-యే.

సెల్యూ: హా హతవిధీ! నా పుత్రికకా యిట్టిదుర్బుద్ధి పుట్టించితివి. నాకీ పరాజయమునకుండోడు పగాభవముకూడ నొసంగ సంకల్పించితివా! ఛీ! ఇది నీ స్వకపోలకల్పితము. అకుమరుంగు పిందెవలెనుండు నా పుత్రియేమి? ఇట్టి యకార్యమొనర్పుటేమి? పాత్రికులా! నీవెవతనుఁజూచి హెలెన్ యనుకొంటివో?

పాత్రి: రాజసత్తమా! అదియేని నిజమైన నెంతయు బాగుగానుండును. ఇదిగో ఈ లేఖఁబరికింపుడు.

సెల్యూ: (పరికించి) అక్కటా! మౌర్యునకు వ్రాసిన ప్రణయలేఖయే! సేనానీ! ఈ దుర్వార్త నితరు లెవ్వరెఱుఁగరుగదా.

పాత్రి: రాజేంద్రా! ఎఱుఁగరు. నా మూలమున నెఱుఁగఁబోవరు.

సెల్యూ: నీకు మా వంశగౌరవముపైనున్న యభిమానము ప్రశంసనీయము. అందుల కెంతయుఁ గృతజ్ఞుఁడ. ఇంటిగుట్టు లంకకుఁ జేటన్నట్లు దీనికిఁ బ్రతిక్రియ నొనర్పకున్న మనకుఁ జేటుగలుగు. ఇందులకుఁ గర్తవ్యమేమి?

పాత్రి: ఇందుల కా తరుణీమణి నమ్మునకిచ్చి వివాహ మొనర్చుటయే కర్తవ్యము.

సెల్యూ: పాత్రికులా! నీకంటె మనలో నెవ్వరు కన్యాగ్రహణ పాత్రులున్నారు? హేళినిఁ బెండ్లియాడి మా పరువు ప్రతిష్ఠల నిల్పుము.

పాత్రి: రాజాజ్ఞను నెదురాడుటకు నాకు నోరాడునా?

సెల్యూ: రమ్ము. హేళిని మందిరమునకేగి కార్యముఁ జక్కబెట్టెదను.

(నిష్క్రమింతురు.)



# చంద్రగుప్త నాటకము.

## తృతీయాంకము-పంచమ రంగము.

స్థలము:-నికియా నగరము. హెలెన్ మందిరము.

(హెలెన్ సెజ్జపైఁ బరుండియుండును. మౌర్యుని చిత్రపటమును జూచుచుండును)

హెలెన్: శా॥ ఏ మౌర్యుంగనినంత నిర్లజ్జనుగా నే తెంతు, నీరీతిగా
క్షేమప్రశ్న రచింతు, నీవిధముగా సేవింతు నంచాత్మలో
నేమేమో తలపోసి తుట్టతుద కొక్కింతైన గావింపఁగా
సామర్థ్యంబును దక్కయుంటినకటా! స్తంభీకృతారంభనై

కాముకులు భావనా శూరులేగాని కార్యశూరులగుదురా? అయిన నా చర్యఁ జూచి ప్రాణేశ్వరుఁ డేమనుకొనియెనో?

మ॥ 'అరుదేరుం'డనిపంప నేనరుగ సౌఖ్యంబీక నన్నంపె ద
బ్బఱపో హేళిని మోహమంచతఁడు సంభావించునో యేమొ ఆ
సరసాగ్రేసరుఁడామురాసుతుఁడు లజ్జామారుతప్రేరితం
బరవిందాక్షి మనోరథాబ్దచయమం చాలోచనల్నేరడే.

ప్రణయ ప్రవాహము లజ్జాహేతు బద్ధనుని యాతఁ డెఱుఁగకుండునా? కావున స్వస్థచిత్తనై యాతని పునరాగమనమున కెదురు చూచుచుండెద.

(రదనిక చాటునుండి బయటికి వచ్చి నవ్వుచు)

రద: నెచ్చెలి యసంతృప్త మనోరథయై యెప్పటి సిగ్గుపాటునకుఁ జిడిముడి పడుచున్నది. ఇది సాజమే కదా?

శా॥ అతఁడీడ నందునవ్వు డీసుమంతయు నెమ్మదిఁ జెంగలించు నీ
స్మితములసందసేరక, విచేష్టతఁబూని యతండుపీడ, ని
ర్వృతమునఁ దారుమారయి తపించుచు నెచ్చెలియుందు నక్కటా,
గతజల సేతుబంధనలు కావొకో? కాముకకోటి యోజనల్.

(ఎదురుగ నేసుదెంచి) నెచ్చెలీ! ఏలని లేనిపోని దుఃఖమున నిల్లుకట్టి వసించెదవు?

హెలెక: రదనికా! వలదన్నను నెన్నియో కళంకలు మనంబున స్ఫురించు చుండును. ఏమి సేయుదును.

రద: కొలది దినములలో మార్య పూర్ణాశ్లేష సుఖ మనుభవించు నప్పు డీకళంక లన్నియుం జెల్లా చెదరై పోవును లే.

హెలెక: అట్టి సుఖము నాకు సులభసాధ్యముగాఁ దోచుటలేదు. నిన్న పాత్ర కులుండు నా హృదయేశ్వరు జిత్రపటముఁజూచి గుర్తించె. (జ్ఞప్తి నభిన యించి) చెలీ! చెలీ! నిన్న గొప్ప ప్రమాదము జరిగినదే! నిన్న నీవు రాకమున్ను నా హృదయేశ్వరునకొక ప్రణయలేఖను వ్రాసితిని. దాని నచటనే సంభ్రమమునఁ వదలివచ్చితిని. అదెవ్వరిచేతులఁ బడెనో? నా గుట్టెవ్వరికిఁ దెలిసెనో? ఏమి ముప్పు రానున్నదో కదా?

రద: ప్రాణసఖీ! భయపడకుము. ఈ వృత్తాంతము నేడుగాకున్న రేపైనఁ దెలియ వలసినదేగదా?

హెలెక: రదనికా! మా తండ్రికిఁ దెలిసిన నేమగునో? అతఁడడిగిన నే నోరెత్తి ప్రత్యుత్తరమీయఁగలనా?

రద: అంతయు నీయఁగలవు. మారుఁడెట్టి భీరువులనైన మోహారక్షణమున ధీరులఁ జేయఁగల యైంద్రజాలికుఁడు.

(సెల్యూకసు పాత్రకులునితో రభసమునఁ బ్రవేశించి హెలెక నమస్కా రమును నిరాకరించును.)

సెల్యూ: ఓసీ! యవనకుల వినాశకారిణీ! ఇంక నీ దొంగ నమస్కారములఁ గట్టి పెట్టుము.

ఉ॥ అన్నము పున్నముం దెలియనట్టి యనూయకురాల వీ వటం
చెన్ని స్వతంత్రవృత్తిఁ జరియింపగనిచ్చిన యంతమాత్ర మా
కన్నుల మన్నుఁజల్లి విటకానిఁ దమింబిలిపించి క్షీరవా
రాన్నిధిబోలు మాకులవరంబున కెచ్చగు మచ్చఁదెచ్చితే?

(హేళినీ రదనికలు సెల్యూకసుని పాటునుండఁ జంద్రగుప్త పటమునుఁ బాత్రకులుఁడు సెల్యూకసున కీయ నతఁడద్దాని జించివైచి)

స్త్రీలశిక్షితపాటవశ్రీ లనుట నేడు తెల్లముగాఁగంటి. ఎంత మాయదారి తనము నేర్చితివి?

ఉ॥ మంచియొ చెడ్డయో యనుచు మానసమందుఁ దలంపకిట్టులో
క్రించును గీర్తిదూరఁగుని గ్రీకు జనావళి బద్ధశత్రుఁ గా
మించితి విస్సిరో యిదియు మేలొకొ శ్రీమ్మతి నింతనైన, మో
హించి మృగాంగనాత్మజుఁ ద్యజించి చమూపతిఁ జెట్టఁబట్టుమా.

లేకున్న నీవు నా కూతురవనుట మఱచి నీ కూళతనమునకుఁ దగినట్లు దండించెద. (రదనికఁజూచి) దుర్జాతా! కులటా! దీని కంతయు నీవు హేతుభూతమవు. లేనిచో నీ యవిధేయత నీ యసహ్య మోహము నీ కబ్బి కలవడునా.

హేళిని: (అడ్డమేగి) తండ్రీ! ఊరక నాపైఁ గోపము నా చెలిపైఁ జూపనేల? ఆ తన్వి తప్పేమి? మోహము నొరులు బోధింపవలయునా?

సీ॥ వల్లరులకు విటప పరిసారంబు బో
ధన మొనర్చిన యుపాధ్యాయుఁ డెవఁడో?
చంద్రకాంతములకుఁ జంద్రదర్శనమున
హరుసింపఁగఁ దెలిపిన గురుఁ డెవండో?
ఆపగావళికి రత్నాకరులోఁగూడ
నుపదేశ మొసగిన యొజ్జ యెవఁడో?
కంజపుంబులకు భాను కరపరామర్శబో
ధంబు నేర్పిన బోధకుఁ డెవండో?

తే॥గీ॥ ఆ సమస్త చరాచర వ్యాపకుండె
కాంతలకుఁగూడ ననురూప కాంతుఁజూడ
వలపుఁ జెందంగఁ దెలిపినవాఁడుగాన
వారివీరిని ననసేమి ఫలము తండ్రి.

సెల్యూ: (రదనికను జూచి) పాంసులా! ఇదంతయు నీ కుశాస్త్రసాఫలము. పో పొమ్ము. నా కంటి కగపడకుము. (రదనిక నిష్క్రమించును.)

హేలెనా! నీ మొఱకుదనము మానుము. ఇది నీకు శ్రేయమునకుఁ గాదు. నీ వెక్కడ? మాన్యుఁడెక్కడ? ఆతఁడు దస్యుజాతి మతస్థుఁడు, బహువల్లభుఁడు. యవన విజృంభణాహితుఁడు. ఆతని చేపట్టి యేల చెడెదవు. నా మాట విని పాత్రకులునిఁ బెండ్లాడి నీవును సుఖపడి నాకును సంతోషము జేకూర్పుము. ఏ మూరకుండెదవు? నీ పట్టు వదలవా?

పాత్రి: రాజచంద్రా! కోపమూనకుఁడు. ఈ తన్వికి నే బోధచేసెద. నాకు వదలుడు (రదనిక తొంగి తొంగి చూచుచుండును.)

సెల్యూ: అట్లే కానిమ్ము. నేనా వంకకేగి గడియలో వచ్చెద. (నిష్క్రమించును.)

పాత్రి: హేళినీ! నీ తండ్రికేల వృథా కోపముఁ దెచ్చెదవు? నీ బోంట్లతని వరింప నగునా?

సీ॥ సగ్వసర్వంసహా సంభారధారేయు
సెల్యుకేశ్వరుని వంశమునఁబుట్టి
సకలజానామోద సంధానసౌందర్య
రూపరేఖాలీల నేపుమీఱి
వివిధవిద్యానీకవిమలామృతాస్వాద
నాసక్తచిత్తవై ఖ్యాతిఁగాంచి
నిఖిలమానవసుత నిర్మలగుణగణా
భరణవై వాసియు వన్నెఁగాంచి

తే॥ గీ॥ పరిణయంబాడదగినట్టి వరునివదలి
యల్పజాతు నసదూత్రిపు నజ్ఞు ననయు
మార్యపాణి గ్రహించుట కార్యమంచు
నెంచగా లేవె! హేళినీ చంచలాక్షి.

కన్నులుండియుఁ గనక వీనులుండియు వినకఁ దెలివియుండియు దెలియక యున్న నవియుండియు లాభమేమి?

హెలెన్: సేనానీ! మౌర్యు నెఱింగిన నీవు నిట్లాడుదువే? అతని కీడు జోడు చెప్పఁగలవా? ఈ లోకమునఁ గలఁడా?

సీ॥ శరణొందు రిపుల నే, జనపతిచే రక్షఁ,
బడయలేని దరిషడ్వర్గ మొకటి।
పరకాంతలందు నా, ప్రభునిచేఁ గామింప,
బడియెడునది కీర్తిభామయొకతె।
ప్రాణులయందు నే పార్థివు పాపక,
మాశ్రయింపనిది పెద్దమ్మయొకతె।
ఫలములయందు నే, ప్రభున నుగ్రహమున
బడయరానిది పాపఫల మొకండె।

తే॥ గీ॥ అట్టిరాజలోక సపత్నునర్చితార్యు।
దశదిశాయిత ధీ శౌర్య ధర్మకార్యు।
మానుషాతీతగుణధుర్యు మౌర్యవర్యు,।
తోడు నీడౌటయేరికిఁ దుఃఖకరమొ॥

పాత్ర: హెలెన్! కామాంధలకుఁ గన్నుఁ గానవచ్చునా? అతని గుణ విక్రమములు నీకుఁ గ్రొత్తలైన మాకుఁ గ్రొత్తలా? నిజముగా విచారించిన నతఁడు నాతోనైనఁ దులఁదూఁగఁ గలఁడా?

హెలెన్: ఏమి నీ యహంభావము? నక్కకును నాకమున కెంతదూరమో నీకు మౌర్యున కంత,

చ॥ అతఁ డఖిలావనీశ నమితాంఘ్రిఁ డొకానొక రాచబంట వీ
వతఁ డరిబాణకల్పితకిణాంకభుజుం డతి డాంభికుండ వీ
వతఁ డతిపూజనీయ సుగుణాంచితుఁ డల్పగుణాస్పదుండ వీ
వతనికి నీకు హస్తిమశకాంతరమంచు నెఱింగి పల్కుమా.

పాత్ర: హెలెన్! ఈ పొడుపు మాటలచే నేమి ప్రయోజనము? నీ పూర్వ స్నేహితు నిట్లు తూలనాడ దగునా? (మోకరించి) ఇదే నీ పాదముల నున్నాను. నన్ను రక్షించి చేకొనవలసిన భారము నీది. అభయమీయనిచి నేను లేవను.

హెలెన: సేనానీ! లెమ్ము లెమ్ము. నా మిత్రుఁడగు చంద్రగుప్తుఁడు ధైర్యమూర్తి, ఉదార కీర్తి, న్యాయానువర్తి. నీవో భీరుఁడవు, అన్యాయవర్తివి, మిత్రద్రోహివి. అబలా సంతాప కారకుఁడవు. నీకు నాకెట్లు పొసగు. లేచి పొమ్ము.

సెల్యూ: (ప్రవేశించి) సేనానీ! నీ యనునయంబునఁ గార్యమేమైన సఫలమాయెనా?

పాత్ర: రాజేంద్రా! సాంత్వన వాక్యము లీ సతి యెడ నిరర్థకములయ్యె. ఇక నీ యిష్టానుసార మొనర్పవచ్చును.

సెల్యూ: హెలినీ! ఎంత చెప్పినను 'న సేమిరా' యనెదవా!

హెలెన: చెఱసాలయే నా కారెంట వరణీయము.

సెల్యూ: ఇవి గ్రుడ్డి బెదరింపు లనుకొనెదవేమో! నిక్కువము సుమా! మఱల నడిగెద, యోజించి రేపు ప్రత్యుత్తరమిమ్ము.

హెలెన: తండ్రీ! నా ప్రత్యుత్తర మెప్పటికి నొక్కటియయగు. ఒక్కని నాత్మ గోరి మఱియొక్కని జెట్టఁబట్టిన నా పతీత్వమునకు భంగమగును. మనము మనముం జేరనిచోఁ దనువు దనువుం జేరిన సౌఖ్య నాశమగు. వేయేల?

చ॥ బ్రతికెదు నాల్గునాళ్లు సుఖవంతముగా బ్రతుకంగ లేనిచో
బ్రతికిన లేకయున్న నొకపాటియగాదె ధరాధినాథ యీ
వితమున మీరలాడఁగనె భీతిలి యిష్టములేని కార్యముల్
మతిచెడి నే నొనర్చునెడ మాన్యత దక్కునె? సౌఖ్యమబ్బునే.

సెల్యూ: సరే కానిమ్ము! చూతము. హిప్పస్! (హిప్పసు ప్రవేశించును) ఈ హెలెనను చెఱసాలనుంచుము. పాత్రికులు నాజ్ఞలేనిది వేరిని జేర్చకుము. కొనిపొమ్ము.

(హెలిని తండ్రికి నమస్కరించి హిప్పసు వెంటరా ధీరగమనమున నిష్క్రమించును.)

సేనానీ రమ్ము. నీ మనోరథము త్వరలో నెఱవేరఁగలదు.

పాత్రి: రాజేంద్రా! మీ మనోరథ మీడేరుగాక. ఈ కాంతను రక్షించుటకై మౌర్యుఁడు రాకమానఁడు. మనచేఁ బడకమానఁడు.

సెల్యూ: అట్లయిన స్వార్థము తీర్థము రెండును గలసివచ్చును. రమ్ము.

(నిష్క్రమించును.)

# చంద్రగుప్త నాటకము.

తురీయాంకము—ప్రథమప్రసంగము.

స్థలము—హైందవశిబిరము, ఉద్యానవనము.

(ప్రవేశము చంద్రగుప్తుఁడు.)

చంద్ర: తే॥ గీ॥ అభ్రవీథినిసద్దణఁగుచుఁగు దేర
ఁగాము'నాటకఖేలనకాలమయ్యె
నంచు ద్విజసూత్రధరులు పఠించు
నాంది కరణిఁ దనరాను నీ కలకలరవంబు;

మరల హేళినీ ముఖదర్శనంబు కలుగక నొక పవలు గడచినది. అకటా! పగలు కార్యనిర్వాహణోద్వేగంబున నీ వలపు ప్రభావము ఒకింత మందమగు గాక. రాత్రి యథాప్రకారమగును. ఈ కాలము వియోగులపాలిటి బెబ్బులి. మద నోద్దీపకముల కాలవాలము. అట్లుండ రాత్రి నెట్లుగడపుదును?

ఎంత పట్టుదలతో యుద్ధమాడినను నికియూనగరము మా చేఁజిక్కదు. అందు నకు నాకు హేళినీ సంయోగ సౌఖ్య మసాధ్యముగదా! ఏమి చేయుదును.

మ॥ అలకాచ్ఛాదితమై ప్రహాసయుతమై ఆకర్ణ నేత్రాంతమై!
సులభానందదమై, సుధాంశునిభమై, సూనాంచితావాసమై
విలసత్కుండలయుక్తగండతలమై వెల్గొందు నాహేళినీ
జలజాతేక్షణమోము, నే మఱల నేఁజూడఁగ విలోకింతునో ॥

(ప్రతీహారి ప్రవేశించి) మహారాజా! ద్వారమున రదనికయను దూతిక వచ్చియున్నది.

చంద్ర: సత్వరముగ లోనికి రానిమ్ము (ప్రతీ. నిష్క్రమి.) ఈమె హేళిని నెచ్చెలి గాబోలు. హేళిని వృత్తాంత మీమెవలనఁ దెలియగలదు. హేళిని కేమ యిన విపత్తు వాటిల్లియుండునా?

(ప్రవేశము, రదనిక)

రద. రాజచంద్రా, జోహారు.

చంద్ర: రదనికా, హేళినికి.

రద: సేమమే. ఈ లేఖను మీ కంపినది.

చంద్రగు: (లేఖనందుకొని) ఏమి నా భాగ్యము (పఠించును.)

చ॥ ప్రణయనిధాన! మౌర్యకులపావన! భారతసార్వభౌమ! యే
మని లిఖియింతుఁ బాత్రకుఁడా ప్రమదావనమందు నాఁడు మి
మ్మును గనుఁగన్న సంగతి; నమోఘపుటీసున గొంచుఁబోయి నా
జనకునితోఁడఁ దెల్ప, రభసమ్మున నాతఁడు కోపచిత్తుఁడై
ననుఁబిలిపించి పాత్రకుఁడు నాథునిగా గ్రహియింపు మీక్షణం
బని విధియింప, నేనతనియాన, నలక్ష్యమొనర్చినంత, నా
తనివరియించి పెండ్లియగుదాక విమోచనసేయ నంచుఁగా
రను ననుఁద్రోసినా డెటుల రక్షణచేసెదొ? యెట్లు బ్రోచెదో?.

ఉ॥ నమ్మెదనో! మతిస్థితుని నమ్మవొ! ప్రోతువొ ప్రోవవో? యథా
ర్థమ్ముగఁబల్క దానఁ; త్వరితమ్ముగ మీ రిటు లేగుదేరిన
న్నమ్మె యున్నైనఁబోత్తురను నిమ్మగు నాశయొకండె, నాదు జీ
వమ్ములు సిల్పియున్న దిటుపై నెటుజేసెదొ? జీవితేశ్వరా!.

అయ్యో: నేఁదలంచినట్లే యయినది. ఆ ధూర్తుచే నా ప్రియసికి కష్టమే ఘటిల్లె.

రద: రాజకంఠీరవా! ఆధూర్త పాత్రకులుఁడు దినదినమే తెంచి మీపై నెన్నియో కల్పించి హేళినికి మీయెడ నౌదాసీన్య ముత్పాదింపఁ బ్రయత్నించు. తండ్రియు నెన్నియో విరసోక్తులు పలుకును. ఇట్లా యిరువురి వైరంబుచే హేళిని యవస్థ దుస్తరము గానున్నది.

తే॥ గీ॥ యువన హైందవనృపులు గయ్యంబొనర్ప
నడుమనీ హేళినికిబిట్టు నలుగుఁడయ్యె
పేర్చి యాంబోతు నాబోతు పెనఁగులాడ
నడుమజిక్కిన లేఁబెయ్య నలగునట్లు.

హేళిని కడపటి వాక్యము నా నోట వినుఁడు

శా॥ నాపై మోహము మీకుఁ బూర్ణముగ నున్నం గాని యీపాటి ప్రా
ణాపాయ ప్రదమైన కార్యమును జేయం బూనినన్ బ్రోచుటో
క్ష్మాపాలాగ్రణి మానుఁ డట్టియెడ సౌఖ్యం బేది యస్తోక సం
తాపం బుప్పతిలంగలాదు మన కెన్నండైన మున్ముందుగాన్.

చంద్ర: రదనికా! నీ నెచ్చెలి కిట్టి శంక లేల.

రద: రాజరాజా! కామినులు మనోహరులకుఁ దమ సర్వస్వము నివేదింతురు. కావుననే యిట్టి శంకలు. ఏలన, విశ్వాస మెందో యనుమానము నందే గదా! దివ్వెతోడుఁ గ్రీనీడలు గదా.

చంద్ర: రదనికా!

చ॥ ప్రమదలఁ గూడి యాడఁగ నె వారి మనోగతులెల్ల తేట తె
ల్లముగఁ జరింతురంచు నతుల ప్రమదంబున నుంటి, నేను స
త్యముగఁ గనుఁగొంటి నెంత రసికాగ్రణికైనను నారికేళపా
కము కద కామినీహృదయ కావ్యరసగ్రహణంబు కోమలీ!

అయినను నా విషయమున సంశయించు టొప్పదని చెప్పుము.

రద: రాజశేఖరా! నా నెచ్చెలి యెల్లప్పుడును మిమ్ము గాంచుచు మీ సేవ లొనర్చుచు మీ కానందము గూర్చుచుండ వలయునని కుల దైవములకు మ్రొక్కుచుండును.

చంద్ర: దైవ మనుకూలించుం గాక.

రద: మొన్నటి సమాగమమును గూర్చి యా మాలిని మాట.

ఉ॥ షమ్మిన కోపవేగమునఁ బాత్రకులుండరు జేరు, నింకఁ బో
పొమ్మని చెప్పి చెప్పకయ పూర్వము నా హృదయేశ్వరుండు ము
క్తమ్మగురీతి నా నెపవుగ్గై కొన కొంచొక పల్కు పల్క కొ
క్కుమ్మడి వీడిపోయెను, బయోజ శరార్తిఁ గలంచి, నెచ్చెలీ!

చంద్రి: రదనికా! యేల యిట్లు నన్నే యపరాధునిఁ జేసెదవు ప్రియ. తాఁ దరిమి చెప్పినగదా నే వీడివచ్చితిని.

మ॥ అలనాఁడిద్దరముంటి మొక్కటఁ నుద్యానంబునందుండ, న
న్నలినాక్షీమణి "వైరివచ్చె నదిగో నాయాన పొమ్మన్న" ద
వ్వల రాగా నను రాగహీనుఁడనుచుం బోనాడెనా! కాముకా
వళి నర్మోక్తుల కొప్పునౌరఁ ప్రధితవ్యాఖ్యాన కాఖ్యానముల్.

కానిమ్ము. ఈ పర్యాయము యుక్తరీతి పిలవు గైకొందును లెమ్ము. కాని ఆ తన్విని రక్షింప నే యుపాయము.

రద: స్వామీ! తమకుఁ దెలియనిదేమి? అయినను పాత్రకులుని శిఖాంగుళీయక మున్నఁజాలుం, నంతయు జక్కఁబడును. సంపాదింపుడు. సెల వొసంగుడు.

చంద్రి: రదనికా! ప్రేయసి ప్రియోక్తులఁ దనవిసీరదు. అయిన నందు నిన్ను వెదకుదు రేమో! ప్రియకెట్లు విశ్వాసము పుట్టబల్కుదువో నీభారము. చెప్పెడిదేమి. నా యీ ముక్తాహారము (ఇచ్చి) నీ కంఠస్థమై ప్రియను క్షణవినోదమగు గాక! నేడో రేపో పునర్దర్శనమయ్యెడు గాక.

(రదనిక నిష్క్రమింపఁబోవుచుండ మైత్రేయుఁడు ప్రవేశించి)

మైత్రే: ఏమి దాసీ చూపింపుము నా మిత్రుని! ఎక్కడ నున్నాడు. చూపింపుము లేకున్నఁ (బెదరించును.)

రద: (నమస్కరించి) అయ్యా నేను క్రొత్తదానను. తమ మిత్రుఁడెవరో తెలియదు.

మైత్రే: తెలియదా గిలియదా! నా మిత్రుని మౌర్యునిఁ దెలియవారున్నారా. ఇదిగో నీమెడలో నా మిత్రుని ముక్తాహారము. ఇఁకను నా మిత్రుని నీకుఁ దెలియదందువా. నా మిత్రుని నేమి చేసితివి. నీ యట్టి వారు మగవారి స్నేహమునకు వేరుపురువులు. చెప్పుము. లేనిచో నీ కొంపఁ దీసెదను సుమా?

రద: అయ్యా! తమ మిత్రుని తామే వెదకికొనుడు. నే బోవలెను. (పోఁబోవ మైత్రేయుఁ డడ్డగించును)

మైత్రే: ఆ పప్పులెక్కడ నుడుకవు. చూపియే పోవలెను. నా వయస్యునికడ కేల వచ్చితివి. నీవు అతని దగ్గర యీ యాతి చన వేమి. ఏమి మీ రహస్యము.

రద: వడ్లగింజలో బియ్యపు గింజ. ఇతరుల రహస్యములు నీ కేల? నన్నుఁ బోనిమ్ము.

మైత్రే: (చేతులు జాచి వెనుకకు నెట్టుచు) ఇంత మాత్రముతో నిన్నుఁ బోనిచ్చెదనా? రా రమ్ము, మార్యునిఁ జూపిపొమ్ము.

రద: నన్నుఁ బోనిమ్ము, లేనిచో నీ వయస్యునితో నీ దుండగముఁ జెప్పెద.

మైత్రే: చెప్పుకొనుము. నా కదే కావలసినది. సూర్యుని నోటిలో రాహువు వలె జిక్కినావు. నీ వెక్కడ తప్పించుకొందువు. నీకుఁ గావలసిన ధన మిచ్చెద గైకొమ్ము. (ఒక కాసు నియ్యబోవ)

రద: నన్ను పోనియ్యవయ్యా. నా కదియే పదివేలు. నీకొక నమస్కార మొనర్చెద, పోనిమ్ము.

మైత్రే: ఈ బోగపు టక్కులు కట్టిపెట్టి నే జెప్పినట్లు జేయుము. (పైబడ బోవ)

రద: రాజేంద్రా మగధేశ్వరా! నన్నీ పలుగాకి బాపనయ్య బారినుండి కాపాడుము.

చంద్ర: (లోపలినుండి) ఇదే వచ్చితి(వచ్చును.) మైత్రేయుఁడు రభసముగఁబోయి యతని కౌగలించును) మైత్రేయా! ఇదేమి యాగడమోయి. ఈ చేటికపై బడుచుంటివేల? ఇది నీబోటి భూసురున కుచితమా?

మైత్రే: మిత్రమా! ఈ ధార్ష్ట్యమంతయు నీ వార్తజనపరాయణుఁడవని నిన్ను రప్పించుటకుఁ బన్నిన పన్నాగమోయి. చేటీ! భద్రము, ఇకఁ గాలికి బుద్ధి చెప్పుము. (రదనిక నిష్క్రమించును)

మైత్రే: వయస్యా! ఈ నాల్గు దినములనుండి నన్నుఁ జూచి మశూచికమునుఁ జూచి పారిపోయినట్లు పారిపోవుచున్నావేల. ఆ యవన కన్యఁ జూచినంతనే మేమడుగున బడిపోయితిమే? క్రొత్తనీరు పాత నీరును కొట్టుకొనిపోయినట్లున్నది.

చంద్ర: వయస్యా, ఈ నిష్ఠురోక్తు లేల?

మైత్రే: మరి దీనికిఁ గారణమేమి.

చంద్ర: చెప్పినను నీకు మించిన పని. నా దుఃఖము నేనే యనుభవింపవలెను.

మైత్రే: ఓహో! మిత్రులు దుఃఖము బంచుకొనుటకు గాదా యుండునది. కోయిల వలెఁ గాక యనుదినము వెంటనుండు నాకుఁ దెలుపరాదా? ఆనాఁడు

యవనకన్య కడకేగి జయింతు ననుకుంటినే. నేనేమైన పొరవడితినా? ఏమి యూరకుండెదవు? తానై ఫలసిద్ధి నందఁజాలనియపు డితరుల సాయముఁ గోరుట బుద్ధిమంతుల లక్షణము. నీవట్లొర్వ నెంచవా? అట్లయిన నా కఱ్ఱను నీవు తీసుకొని నీ కత్తిని నాకిమ్ము. (తీసికొని) ఇంకను బలుకవా? ఇదిగో జంధ్యములతో నురిపోసికొని నీకు బ్రహ్మహత్యా పాతక మొడిఁ గట్టెద. (అట్లొనర్పబోవును.)

చంద్ర: (వారించి) మైత్రేయా! ఇదేమి యాగడము. నన్నెరిగిననాఁడ విట్లొనర్ప వచ్చునా? ఆ యవన కన్యను జూచిననాఁటఁ గోలె నా యవస్థ అనిర్వచ నీయముగా నున్నది.

ఉ॥ ఆ కరియాన కంటఁబడినంతనె, యేమివచింతు నాదు బా
హ్యాకృతి మార్పు నించుకయు నందక యెంతయు నిల్చెఁగాని,లో
నూకొను నంతరంగ మెటులో చటుమాయముగాఁ జరించె, నా
హా! కరిరాజభుక్తి గతమై బయలొందు కపిత్థముంబలెన్.

మైత్రే: ఎంతమోస మెంతమోసము. నే వలదంటినే, నా మాట వినవైతివి. అయిన మునిగిపోయిన దేమియును లేదు. ఆ యవనికంటె సౌందర్యవతుల హైంద వాంగనామణుల వేలఁ దెప్పించెద. ఆ కాంతను మఱచి వారల నొకరిఁ జెట్టఁబట్టుము.

చంద్రః వయస్యా! ఎట్టిబేలవోయి! మారుఁడాడిన దాటయుఁ బాడినదిపాటయుఁ గదా. ఆ కాంతాలలామతోఁ దులఁదూగు కన్యలెందైనఁగలరా? ఆ తన్వి రతిసతి యనుంగు కూఁతురుగాఁబోలు. అమృతాంశు వర్ధితయయియుండనోపు. వసంతోపాధ్యాయునికడ సర్వజన సమ్మోహన విద్య నేర్చియుండనగును.

మైత్రే: అట్టి వరవర్ణిని మ్లేచ్ఛవంశమున నెట్లుదయించెనోయి.

చంద్రః దానికేమి? సౌందర్య సౌశీల్యము లొక్క జాతిసొమ్మా. ఆ సుందరి నెట్లు వర్ణింతు.

సీ॥ కనులారఁ గాంచెనా? కంతుజయుంతులేఁ
గనుసన్నలను మెలఁగంగవలయు
మనసారఁ బలికెనా? వనసత్వములునేని
కూర్మిరభావముమాని కొలువవలయు
ముదమారనవ్వెనా! మునిపుంగవులెయైన
వైరాగ్యతమి నెడఁ బాయువలయు
రహిమీర నడచెనా? రాజహంసలుకూడ
తడఁబడి వెనువెంట నడువవలయు

తే॥గీ॥ సకియ రూపరేఖావిలాసం బఖండ
పూర్ణిమాయామినీ జ్యోత్స్నవోలె, నహహా!
దర్శనంబున దెలియంగదగును గాని!
వర్ణనంబునఁ దెలియంగ వశమె? మిత్రి!

మైత్రే: ఇట్టిది మనుజునికన్ను పినలేదు, చెవి చూడలేదు. నేను మాయింటిగూపెనిట్లే రొంచితిని. కొన్నినాళ్లకు సూర్యుడేగిన నక్షత్రములవలె గోపములన్నియు బట్టబయలయ్యె. ఇంత సౌందర్యవతి నీపై నెనరూనియుండ నీవు తల వేర్లాడవేయు నేల?

చంద్ర: ఆ కమలేక్షణ నన్నుఁ గామించినదిగాని సెల్యూకసు మా వివాహము నొల్లడు. తన సేనాని పాత్రికులునిఁ బెండ్లాడుమని నిర్బంధించుచుఁ జెఱసాలయందుంచియున్నాడు. విమోచనమొనర్పవలె.

మైత్రే: ఇంకను తీవ్రముగా యుద్ధమొనర్చి జయశాలివి గమ్ము. అన్నియుఁ గలిసి వచ్చును.

చంద్ర: అలస్యము వలదు. పట్టణముఁ జొచ్చుటకు గూఢమార్గమేమో ఉన్నది. కాని పాత్రకులుని శిఖాంగుళీయకము లేనిది పోలిని విడుదల పని పడదు.

మైత్రే: ఇంతియేనా! ఆర్య చాణక్యులవారికిఁ దెల్పరాదా! క్షణములో దెప్పించెదరే.

చంద్ర: మిత్రా! ఆ సర్వజ్ఞునకు నా వృత్తాంతము దెలియకుండునా? తెలిసియు నాతండా ప్రశంస నెత్తుకొనమిచే నతని కీ వివాహ మసమ్మతమని దోఁచుచున్నది.

మైత్రే: పోనీ! ఆతఁడు సాయము సేయకున్న నూరుగురు చాణక్యుల మించిన వాఁడను నే నుండలేదా! భయపడకుము. నేనెట్లయిన దానిని సంపాదించి తెచ్చెదనులే. నే నింక కార్యసిద్ధికై మార్గములను యోజించుచుండెద.

(చంద్రగుప్తుఁడు నిష్క్రమించును. మైత్రేయుడు యోజించుచుండును. శార్ఙ్గరవుఁడు ప్రవేశించును.)

శార్ఙ్గ: మా గురువు లార్యచాణక్యులు "శార్ఙ్గరవా! మొన్న పరాజయమున ఖిన్నులైయున్న యవనుల నిర్మూల మొనర్చుటయందు వృషలుఁ డుదాసీనుఁడై కార్యభారమును సేనాధిపతిపై మోపియున్నాడు. విజిగీషువు భారత మాతృ వినాశన బద్ధకంకణుఁ డట్లొనర్చుటకుఁ బ్రబల కారణముండ నోపును. అతని యంబగదృష్టి, యసౌష్ఠవ శరీరము, యస్వార్థ కార్యవైముఖ్యాధి చిహ్నము లాతడసంతుష్ట మోహబాధితుఁడైనట్లుఁ దెలుపుచున్నవి. దీనిని నా కాతఁ డెరిగింప సిగ్గుపడుచున్నాడు. అయిన నీ వృత్తాంతమును చందనదాసాదుల వలనఁ చూచాయగా వింటిని. నీ విపుడేగి మైత్రేయుఁ డెట్లయిన వలలో వైచికొని వృషలునకా యవని విషయమున నెట్టి సాయము కావలయునో కనుగొని రమ్మని యాజ్ఞాపించిరి కదా? అదె మైత్రేయుఁడు కూర్చుండి తలపంకించుచు హస్తముల నలుపుకొనుచు నేమిరో నెమరు వేయుచున్నాడు. (భక్ష్యముల వెలికిదీసి) ఈ భోజన ప్రియుని నోరు తెరచుట కీ తినుబండారమే తగిన తాళపుఁజెవి. (డాని గిలిగింత పెట్టును) ఏమోయి ప్రియ వయస్యుఁడా! ఇల్లు గుల్లయైనట్లు నిద్దుర మొగము పెట్టినావు. ఫలాహార లోపమైన నిదిగో.

మైత్రే: శార్ఙ్గరవా! నా కాకలి లేదోయి! నీవే తినుము.

శార్ఙ్గ: అటులా! పిల్లికిఁ బాలకట్టరలే దన్నట్లున్నదే! (తాఁ దినుచు) నీ కొఱకు దెచ్చిన వలదనవచ్చునా? నీ దుఃఖమున కిది పేరెన్నిన మందు సుమీ. ఎంత బాగున్నదోయి. కొంచెము రుచి చూడవోయి. (నోటియందుంచును)

మైత్రే: వలదు వలదు (తినును) రామాయణములో నర్జునునకువలె నాకొక ధర్మ సందేహము గలిగి బాధించుచున్నది. వలదు వలదు (అనుచుఁ దినుచుండును.)

శార్ఙ్గ: అవును. నీ వయస్యుని యవస్థ మూడు నాలుగు దినములనుండి చాల విచారకరముగానున్నది. అందువలననే కదా! నీకీ యరుచి తలపంకింపు. మైత్రియన మీదే. అతని మోహ మంత బలిష్ఠమైనది కాఁబోలు.

మైత్రే: అగాధమైనదోయి. ఈ కాముకులో అన్యోన్య ప్రేమబద్ధులై యున్నారు. కాని ఆ యవని తండ్రికీ సంబంధము రుచింపక ఇంకొకని వరింపుమని బెదరించి ఫలములేక చెరసాల వైచిరి.

శార్ఙ్గ: ఎంత ప్రమాదము. ఆర్యచాణక్యుల వారిదే చెప్పుచుండినారు.

మైత్రే: ఆయనకు శిష్యవాత్సల్యమమితమే. ఇట్లవస్థపడు మౌర్యునికిఁ బాత్రకులుని శిఖాంగుళీయకముఁ దెచ్చి యిచ్చిన క్షణములో నా కాంతను కారాగార విముక్తఁ జేయునుగదా.

శార్ఙ్గ: అదే ప్రయత్నమున నున్నారు. ఆమాట నివేదించుటకే నే నిపుడు వచ్చినది. నీమిత్రునికీ వార్త నివేదింపుము.

మైత్రే: మిత్రా, వయస్యా! (అని పరువెత్తును)

శార్ఙ్గ: ఈ రహస్యమును గురువులవారి కెరింగించెద (నిష్క్రమించును).



# చంద్రగుప్త నాటకము.

## తురీయాంకము—ద్వితీయరంగము.

### స్థలకము—హైందవ శిబిరము, రాజమందిరము.

(చాణక్యుఁడు ఒక దివ్వెవెలుఁగునఁ బత్త్రికలఁ జదువుచుండును.)

చాణ: (తలయెత్తి) అహో! అరుణోదయమైనదే (దీపమార్పి) ఈ చండకరునం దెంత మార్పు గలిగినది.

మ॥ ఉదయాస్తక్ష్మాధర సంగతింగనిన చో నుష్ణాంశుఁడౌరా! జగ
ద్విదితంబైన నిజోష్ణశుభ్రగుణసంప్రీతి న్విసర్జించి త
త్కుధరప్రాంచితశైత్యశోణగుణ సందోహంబు మైఁదాల్చు. సా
హృద మన్యోన్యగుణాగుణప్రదము కాదే సామెతల్ దప్పునే?

ఇట్లే నా యాత్రికుఁడగు వృషలునందు మార్పుజనించె.

ఉ॥ ఆ నలినాయతాక్షిఁ గనులారఁ గనుంగొనినంతమాత్ర నీ
మానవనాథుఁడెప్పుడు సమంచితభక్తినొనర్చు నీశ్వర
ధ్యానము దేశమాతృచరితామృతపానము ధర్మకార్య సం
ధానము విస్మరించెనహా! నాఁకిలొంగని ధర్మవృత్తున్నదే?

కానిమ్ము. కార్యసాఫల్యకాల మాసన్నమగుచున్నదిగదా.

(ప్రవేశము శార్ఙ్గరవుఁడు.)

శార్ఙ్గ: గురుపుంగవా! ఆర్యరాక్షసులు వచ్చియున్నారు.

చాణ: సత్వరము లోనికిఁగొనిరమ్ము. (శార్ఙ్గ రాక్షసునిఁ బ్రవేశపెట్టి సభివాదన మొనర్చి నిష్క్రమించును. రాక్షసుఁ డభివాదనమొనర్ప యుచితాసనముఁ జూపి)

చాణ: అమాత్యాగ్రణీ! నేఁడేమైనఁ గ్రొత్తవార్తలు మీకుఁ దెలిసెనా.

రాక్ష: శిఖరకుఁడు సిరియా దేశమునుండి వచ్చుచుండిన వార్తాహరు నొకని బంధించి తెచ్చి వాని శోధింప నీ లేఖ దొరకినది. ఇది మన కెంతయు నుపయుక్తమైనది.

చాణ: (చేకొని చదివి) ఓహో! సెల్యూకసు కుమారుఁ డాంటియోకస్ వ్రాసినదే! ఇందలి సమాచారము మొన్న జైనశ్రమణకుఁడు తెచ్చిన సంగతుల రూఢి పరచుచున్నది. ఇక నీ యవనుల జుట్టు మన చేతిలో దొరకినది.

రాక్ష: సెల్యూకసుఁ డొనర్చిన తెలివి తక్కువ పనికిఁ దగిన శాస్తియైనది. వెక్కిరింపఁ బోయి వెల్లకిలఁబడి నట్లయ్యె. ఇఁకఁ గర్తవ్య మేమి?

చాణ: మన పన్నాగము లన్నియు నీడేరె. సెల్యూకసు రాజ్యముపై నాంటియోకసునుఁ బురికొల్పితిమి, బ్యాక్ట్రియా పార్థియాలలో విప్లవములఁ గలిగించితిమి. ఇక్కడ సెల్యూకసును ససైన్యముగా నలుదిక్కుల నరికట్టితిమి. అతని సేనాపతులఁ దక్షశిలా పుష్కలావతీ నగరములందు ముట్టడించితిమి. అష్ట దిగ్బంధన మయ్యె. ఇక సంధి యొనర్చుటె బాగు.

రాక్ష: ఆర్యా! అతఁడు సంధికిఁ బూనుకొనవలయును గాని మనమిట్లు త్వరపడ నేల?

చాణ: దానికొక్క ప్రబల కారణమున్నది. మహారాజు సెల్యూకసు పుత్రిని హెలినిని గామించియున్నాడు. తత్కాంతా సంయోగము లేక యతఁడు రాచకార్యముల శ్రద్ధాళువగునట్లు లేదు.

రాక్ష: ఆర్యా! నే నీవిషయమును జందనదాసు మూలమున వినుచుంటిని. ఇట్టి సంబంధమునకు మన మియ్యకొనవచ్చునా.

చాణ: సచివసత్తమా! నీబోటి రాజనీతికోవిదునకు నేను బోధింపవలయునా? చంద్రగుప్తున కిదివఱకే బిందుసారుఁడు గలిగియున్నాడు. అతనికి యువరాజ పట్టాభిషేకము గానున్నదికదా! ఇంక నీ వివాహమువలన పరిపాలనా విషయమునఁ గష్టము లెట్లుండును? ఇట్టి వివాహము హైందవులకు ధర్మము గాదనెదవేమో? అదియుఁ బొసగదు. ఏలయన రాజధర్మము ప్రజలకు క్షేమకరమగు మార్గమునఁ బ్రవర్తించుటగదా! అట్టిచో భారతీయుల కత్యంతభద్రసంపాదనోపాదియగు నీ వివాహమునెడల సంశయ మేల? దీనివలన యవన హైందవులకు శాశ్వతమైత్రి చేకూరు.

మాగధులకు బహిష్కృతుని భయమంతరించి మాత్స్య విజృంభణమున కవకాశ మొదవును. కాన కువలయానందకరమగు నీకార్యము చంద్రగుప్త రాజచంద్రునకవశ్య కర్తవ్యము.

రాక్ష: ఆర్యాగ్రణీ! తమతో వివదింప శక్తులెవరు? తామన్నట్లె కానిండు. అయిన స్వజాతిగౌరవమదాంధుఁడీ యవనేశుఁడిందులకియ్యకొనునా?

చాణ: అదియే సంశయాస్పదము. కాన ముందుగా నా యవనిని మన శిబిరమునఁ జేర్పవలయును. తర్వాత సంధికి మొదలిడవగును.

రాక్ష: ఆ కార్యము నెట్లు నిర్వహింతురు?

చాణ: పుత్రికకు మహారాజుపైనున్న మోహమెఱింగి సెల్యూక సామెను జెఱసాలఁ ద్రోచె. అందుండి యక్కామినిని రక్షించుటకు పాత్రికులని శిఖాంగుళీయము వలయునట. దానిని సాధింపఁ జందనదాసుఁడే నేర్పరి.

రాక్ష: పంపెదను. అనంతర కర్తవ్యము?

చాణ: వృషలుఁడు 'నేడో రేపో తప్పకవచ్చి నిన్ను రక్షించెద'నని యవనీమతల్లికి వార్తఁ బుత్తెంచె. అతఁడు కామాంధుడై యేమైనఁ బొరపాటొనర్చిన మోసమగు. చందనదాసతని కడకేగి యుద్ధమును గలిసి నికియా నగరమేగినఁ గార్యము భద్రముగా నగు.

రాక్ష: ఆర్యా! అట్లె చందనదాసునకుఁ దెల్పెద.

చాణ: మంత్రివరా! ఇంక రేపు సంధివిషయములను ముచ్చటింతము. ఆ లేఖను నాకడ నుంచుము. వృషలునికీ వృత్తాంతముఁ దెల్పి యతని యభిప్రాయముఁ గన్గొనెదను.

రాక్ష: ఆర్యా! అట్లె కానిండు (లేఖవదలి సెలవుఁ గైకొనిపోవును)

చాణ: ఆహా! నాకిప్పటికి మనంబున కూరటగలిగె. ఈ పర్యాయము రాజ్యతంత్ర నిర్వహణము తోడఁ గామతంత్ర నిర్వహణమును లభ్యమయ్యె. 'గతానుగతికో లోకః' అని కదా!

చ॥ పరవశమెల్లవారల కభాగ్యద మాత్మవశంబు సౌఖ్యమం
చెఱుకగలాము నొక్కవచియించు హితోక్తిని విస్మరించి వా
రిరుహదళాక్షులంగనివరించి మనోధనమిచ్చి ధాత్రిపైఁ
బురుషులు గుందుచుండెదరు పో కరణీయవిధానభిజ్ఞులై

(యవనిక పడును)

# చంద్రగుప్తనాటకము.

తురీయాంకము—తృతీయరంగము.

స్థలము—నికియానగరము, రాజవీధి.

(ప్రవేశము, చందనదాసు వైద్య వేషమున మందులమ్ముచు)

చంద: కాళ్ళనొప్పులకు గండభేరుండ తైలము, కీళ్ళనొప్పులకు కీచక తైలము, అజీర్ణమున కామ్లకధృతి, జ్వరమునకు జ్వరాంకుశచూర్ణము, కంటిమంటలకు గాజేరి తైలము, కత్తిదెబ్బలకు ఖడ్గభస్మము, వలపునకు వశ్యౌషధము.రండు,కొనుడు. ఇది సమయముదప్పిన దొరకదు. రండు విగతరోగులుకండు. (స్వగ) ఈ వేషమునఁ బాత్రికులు వలలో వైచికొని మత్తుమందిచ్చి మా వేగులవారి కొప్పగించి యాతని యంగుళీయక మపహరించి నాతో వచ్చిన రాజేంద్రునకిచ్చి నేటిరాత్రియే యవనరాజాత్మకు బంధమోచన మొనర్చెద. (తెఱలో.ఓ వైజ్జా ఇటురమ్ము, నాకీగాయమునకు మందిమ్ము.) చందనదాసు నిష్క్రమించును.

(ప్రవేశము పాత్రికులుండు.)

మ॥ వనితారత్నము యానుగాక, సుకళాపారీణయాంగాక, లో
నిను జేపట్టగ నొల్లనట్టి యువనీనీ రేజపత్రాక్షిపై
నెనరుంబూని తపింపరాదనుచు నే నిత్యంబుబోధించుచో
మనసా! నా పలుకాలకింపవుగదా మోహాబ్ధి నిర్మగ్నవై

మనసా! నీవును హాలెక వలెనే మూర్ఛించుట తగదు. స్త్రీలమనంబులు ప్రకృతి కఠినమ్ములు. లేనిచో నా వేడికోలు నా ప్రేమద వ్యర్థీకరించియుండునా? నా ప్రార్థనలకు ముసలముగూడ చిగిర్చియుండు. ఇట్టి నిరర్థక మోహమును విస్మరించి సుఖమును గ్రమఱ ననుభవింతమనిన సాధ్యముగాకున్నది. అనుకొనినంత మాత్ర దేహము పులకాంకితమగుచున్నది. ఈ మోహము కంటకముకన్న నెక్కుడుగ నాద్యంతము బాధించుచున్నది. ఓయీ కామదేవా! నీ ననుగ్రహించిన యెంతయో సుఖమీయఁగలవు, ఇప్పుడు వంతియ సుఖమిచ్చుచున్నాడవు.

ఉ॥ భీరువు ధీరుఁ జేసెదవు పెంగలిపిత్తుఁ గవింబొనర్తువా
భీరిసిరంభఁ జేతు వటవీస్థలి స్వర్గమొనర్తు లేమి నిం
పాఱెడుకల్మిఁ జేయుదువు, దయుంగని, యల్గి విగతి జేతు వౌ
రౌర! మహేంద్రజాలికుఁడవయ్య మనోభవ! సూనసాయకా.

అదె! రదనిక వచ్చుచున్నది. దాని కిప్పుడైన నాపై కరుణగలుగునేమో చూచెద.

రద: (ప్రవేశించి) సేనానీ! ఈ దినమైన నా చెల్లెలిఁ జూచుటకు సెలవొసంగెదవా! లేదా?

పాత్రి: సెలవుకేమి? కాని రదనికా! నాపైఁ గొంచెము కరుణించి నా పక్షమున హేళినితో మాటలాడి నన్ను పెండ్లాడుఁటకొనర్చుము. నీ వేమికోరిన దాని నిచ్చెద. ఇంత మాత్రము పుణ్యము కట్టుకొనుము.

రద: సేనానీ! ఇది నాకు సాధ్యమా! తనకు మించిన పనిఁజేయుట వెరవా!

పాత్రి: రదనికా! ఈ మాటలెవరైనఁ దెలియనిమొఱకునకుఁ జెప్పుము. నీవు చెప్పిన మాట హేళిని జవదాటునా? నీవు ఘటనాఘటన సమర్థురాలవు. నన్నెట్లయినఁ గడతేర్పుము (మోకరించును.)

రద: అబ్బిన సిగ అబ్బకున్న కాళ్లు పట్టుకొనుట పురుషుల నైజగుణము కాఁబోలు. లెమ్ము! నాకు మోకరించిన నేమి ప్రయోజనము? హేళినిపై నీకింద్రియాసక్తి కాక నిజమైన మోహమున్న నాతన్వి నిట్టికష్టులనమ్మింతువా? వేయేల! అందని మ్రానిపండ్లకు ఱులు చాపక నింకెవరినైనఁ గోరి సుఖింపుము.

పాత్రి: రదనికా! నీవు నా మోహవిషయమున పొరపడెదవు. మాటలతో నది పోవునా?

ఉ॥ మాటవినంతమాత్ర మటుమాయముగాఁ జరియించునట్టి టా
టోటు ప్రియుం బెయున్నడనటుల్ నిరసించి కలంచుచో నిరా
ఘాటముగాఁ జరించి పెఱికాఁకని నోర్తువరింపకుండ న
ప్పాటలగంధి పాదములఁ బాయక యుండుదునే తలోదరీ.

రద: పౌరుషవంతు లిట్లుఁ దిరస్కరించు వారి వదలక నీ వలెఁ జూచు పట్టుకొని వ్రేలాడుదురా.

పాత్ర: పౌరుషధనుఁడనుఁగనుకనే పట్టిన పట్టు వీడకున్నాను.

రద: ఈ కోతిపట్టు కేమిలే. కన్నెలపై నున్నవి లేనివి నాల్గు కల్పించి కొండెములఁ జెప్పిన నీవు నొక పౌరుషవంతుడవేనా? ఈ మాటలతో నేమి? నన్ను హేలెఁ గడ కేగనిత్తువా లేదా?

పాత్ర: ఛీ! ధూర్తురాలా? మోమోటము నీ యెడ వ్యర్థము. నే పోనీయను పొమ్ము.

రద: (స్వ) నే నాడుదాననైన నా చెలిఁ జూడక వదలుదునా?

(నిష్క్రమించును.)

పాత్ర: అక్కటా! రదనిక నాకు సాయపడుఁను నాశయు భంగమయ్యె, ఇఁకేమి సేయుదును. పుట్టుగ్రుడ్డి నష్టనేత్రునికంటె నెక్కుడు సుఖ మనుభవించునట్లు మోహ మెఱుఁగనివాఁడె నిరాకృత మోహునికన్న సుఖి యని యందు. ఇం దజ్ఞానమే శ్రేయోదాయకముగా నున్నది.
(తెరలో చందనదాసు, మందులో' యనును.) ఏమి! ఏమి ఆ శబ్దము! ఎవఁడురా అక్కడ?

కైలక: ఎవఁడో యొక హైందవుడు మందులమ్ముచున్నాడు. మన వారి శీతోష్ణస్థితులచేతను శత్రుల బాణక్షతములవలనను బాధ నొందుచున్నందునఁ గొనుచున్నారు.

పాత్ర. హైందవుఁడా? వైద్యుఁడా? ఏమేమి మందులో? మంచివేనా?

కైలక: ఇప్పుడే కొనుచున్నాము. మందులెట్లుండునో కాని యాతని మాటలు కోటలు దాటుచున్నవి. సర్వరోగములకు జంతువుల కాట్లకు మందులున్నవట! శస్త్రచికిత్సయుఁ దెలియునట.

పాత్ర: వింతమందు లేవైన నున్నవా? వశ్యౌషధములున్నవా?

కైలక: ఉన్నవట. పోయి వాని నిచ్చటి కంపెదను. విచారింపుడు

(నిష్క్రమించును.)

పాత్ర: ఆహా! నా యదృష్టము!

మ॥ అదయాబద్ధమనస్కవై నను సతం బల్లార్చు నీ హేళనన్
మదధీనాత్మగఁ జేయు నౌషధమునో మంత్రంబో తంత్రంబో నా
కొదవం జేయఁగలట్టిదిట్ట డెవఁడుం జుల్లంబునం దెంచుచో
వెదుకం బోయిన తీవ కాల్దవిలె నీ వెజ్జిల్లు విచ్చేయుటన్.

(చందనదాసు ప్రవేశించును) భిషజ్మణీ! నీవద్ద స్త్రీవశ్యౌషధమున్నదా?

చంద: (స్వ) ఏమి వీని భ్రాంతి (ప్రకా) తమ గుణరూపములేకదా పురుషులకు వశ్యౌషధములు. అవిలేని హైందవ వైద్యుడుండునా? నాకడ నుత్తమ వశ్యౌషధమున్నది. ఆ మందుపయోగించిన తత్క్షణము ఆ స్త్రీ నిన్నే దైవముగాఎంచి నీడవలె వలచన్నను నిన్ను వెన్నాడును.

పాత్రి: ఏదీ! ఇటు దెమ్ము. దీనివలన నా కార్యమాయెనా నీ యెత్తు ధనమిచ్చెద.

చంద: (స్వ)పిట్ట వలలోఁబడినది. ఇక రాజకార్యము నెఱవేరినట్లే. (ప్రకాశము) స్వామీ! అదే సురాపణము. అక్కడి కేగుదము. అక్కడ మందు సిద్ధమొనర్చి దాని నుపయోగించు విధాన మెఱింగింతు. మీ కార్యము సఫలమైన నాకు బహుమాన మొసంగవచ్చును.

పాత్రి: సరితేసే? తోడ్రవచ్చియుము.

(నిష్క్రమింతురు.)



# చంద్రగుప్త నాటకము.

## తురీయాంకము—తురీయరంగము.

స్థలము:—నికియానగరము, చెఱసాల.

(లోన హేలిని, హిప్పను కావలిగాయుచుండును.)

హేలెన్:

శా॥ నాఁడే నంపిన నాఁతి లేఖ నొసఁగన్ మౌర్యుండు నన్ బ్రోవఁగా
నేఁడే వచ్చును రేపెవచ్చు ననుచున్ నిత్యంబుఁ గాంక్షించుచో
రాఁడే వేళకు నైనఁ గార్యభరుఁడై రాఁజాలఁడో, లేక వి
న్నాఁడో లేదొ మదీయవార్త, వినియున్నన్ గావ వాంఛింపఁడో॥

ఛీ. నా కీట్టు లా రసికాగ్రణిపై ననుమానము దగునా? అయిన రదనిక మరలి యేల రాదయ్యె? లేక నా తన్వి వచ్చినను పాత్రకులు నాజ్ఞచే నిందు రానీయకుండియుందురా? అక్కటా! ఎట్టి కార్యమునకైన వీరు వెనుదీయు నట్లులేదు. నా దండనుండు నా మనోవల్లభుని చిత్రమును లాగికొనిరి. వేలుపటమును చిత్రింతమన్నఁ బరికరముల నొసఁగకైరి. నెచ్చెలి నెడఁ బాపిరి. కన్నవారుగూడ అధర్మముగానిదానికై ఆత్మజల యెడ నెట్టి యధర్మమునకయిన నొడిఁగట్టెదరుగదా. కానిమ్ము, వారు నా దేహము నెంత బంధించినను అంతరాత్మను బంధింపలేరుగదా! అది స్వచ్ఛందముగా నుండఁ జెఱయన్న భయమేల?

(రదనిక ప్రవేశించును)

రద: (స్వ) అదుగో! హిప్పను! కుక్కవలె మూర్ఖవిశ్వాసముతోఁ గారాగృహము కాచుచున్నాఁడు. నిన్న వాని బెదరించి లోనికేగఁ బ్రయత్నించి భంగపడితి. ఈ దినము వేఱొకవిధమునవర్తించి లోనికేగెద. చెలిమిచే విషమును బెట్ట వచ్చునుగాని బలిమిచే నీరును ద్రావింపలేముగదా.

హిప్ప: (చూచి) ఎవరక్కడ? రదనికా! నేడు మఱల నేల వచ్చితివి. సేనాని యంగుళీయముతోఁ గాని రావలదంటినే?

రద: సేనాని మనస్సుగాని నీ మనస్సుగాని మారినదేమో కనుగొనవచ్చితి. ఏమి రాకూడదా?

హిప్ప: ఏమియు మారలేదు. పొమ్ము! వచ్చినత్రోవనే పొమ్ము, లేనిచో నాకు మాటవచ్చును.

రద: హిప్పను? చిరపరిచయమున్న నాతో నిట్లు కట్టెవిఱిచినట్లు మాట్లాడనగునా!

హిప్ప: దాసీ! నన్ను సైనికుని సేనాని యాజ్ఞ నేల నుల్లంఘింపఁ బురికొల్పెదవు? పొమ్ము.

రద: మిత్త్రుల కాముకుల నెడ నీయు శాసనము లవశ్యోల్లంఘనీయములు సుమా.

హిప్ప: ఏమో! నాబోటి యజ్ఞునికీ చర్చయేల? నాకు సేనాని యనుజ్ఞయే గ్రాహ్యము పొమ్ము! పోయెదవా? లేదా!

రద: పోకున్న నుండనిత్తువా? సైనికులు తోలుబొమ్మలే గాని మనుష్యులు గారు. (పోవుట నభినయించుచు) నీకు బిడ్డలు లేరు గాబోలు.

హిప్ప: నీ కేలుగవా (స్వ) అకటా! వారి నే నెప్పుడు కనుగుందునో కనులఁ గట్టినట్లున్నారు.

రద: నీ కొమరిత కొకతెకు దుఃఖము కల్గిన? సర్వవిధముల నపనయింప నీవు ప్రయత్నింపవా? అంతయేగదా?

హిప్ప: రదనికా! సందేహమేమి? అయిన నీ ప్రశ్నలవలన నేమి ప్రయోజనము? పొమ్ము.

రద: ఇతరుల పుత్త్రికల దుఃఖము, నీవుగాదులే, అన్యులే పాప నుద్యమించుచో నీ నడ్డము రాఁదగునా.

హిప్ప: నన్నేమి చేయమందువు? రాజసైనికులిచ్చవచ్చినట్లు చరింపనగునా?

రద: హిప్పను! హెలెను నీ బిడ్డవంటిదే గదా. ఒక్క క్షణము లోనికేగి ఆమె కొండలపాటు డిందఁజేయనిమ్ము. నీకు మాటరాకుండ నేఁజూచెద. సైనికులకుగూడ దయాదాక్షిణ్యములున్నవని నిరూపింపుము. (హిప్పను బల్లెము నడ్డుదీయును. రదనిక లోనఁబ్రవేశించును.)

హెలె: ఎన్నినాళ్లకు! వీవేగిన కార్యము, కాయయా, పండా?

రద: పండే! మౌర్యుఁడు నేడో రేపో తప్పకవచ్చి నిన్ను రక్షించును. పాత్రకులుఁడు నన్నిందుల రానీయకుమని యాజ్ఞాపింప హిప్పను రానీయలేదు. నేడు దయఁగొని రానిచ్చిన నిన్నుఁజూచి యీ వార్తఁ దెలుపఁగలిగితి.

హెలె: హిప్పనున కెట్లు మన కృతజ్ఞత జూపగలమో కదా! చెలీ! మౌర్యుఁడు తప్పక వచ్చునా? వచ్చి నన్నుఁ దోడ్కొని పోవునా! ఆ మాట యనుకొని నంతనే యపరిమితానంద మగుచున్నది.

రద: శా॥ ఓయంభోరుహపత్రనేత్ర! భవదీయోద్వేగమున్ మాను మే
మాయోపాయము చేతనైన యవనామాత్యుం బ్రతారించిని
న్నేయాలస్యము లేక చేకొనును మౌర్యేశుండు సుమ్మా
తడా
కాయోత్పన్నుడె నీకునై తరువు పోఁగా రాక కూర్చుండునే.

హెలి: చెలీ నిజమే, అయిన నీకాలముఁ గడపుట యెట్టికష్టమో నీకే మెఱుక.

రద: అంతమాత్రము నే నెఱుఁగనా! అయినఁ గాలమును దూలనాడిన లాభమేమి? కాలమెపుడు నొకటియే! మన మనస్సునుబట్టి మారినట్లుండును. ఇంక నీ హృదయేశ్వరుండెపుడు వచ్చిన నప్పుడే ప్రయాణమొనర్ప సన్నాహ మొనర్చుము.

హెలె: చెలీ! మనోహరు సంయోగము లభ్యమగునని సంతసమొందుచున్నను జనకుని వదలిపోవలెనన్న నాకు కాళ్ళాడకున్నవి. చిత్త మొల్లకున్నది. ఏ మొనర్తును.

మ॥ జననంబాదిగ సర్వవేళల మనస్సంకల్ప సంధాతయై
నెనరుల్ వీడక సౌఖ్యముం జెడక నన్నిద్దుర్గెఁ డెపోషించినే
సిన మాతాపితలన్ ద్యజించిచన నాచిత్తంబొక్కింతైన సూ
ల్కొనదింకన్ విభువెంబడించుటెటులొక్కో స్వల్పకాలంబునన్.

రద: చేలా! స్త్రీలకిట్టి వియోగము పుట్టినునాటనే నొసట వ్రాయఁబడియున్నది. ఇందుకు చింతయేల? ఈ శంకలకు కార్యాంతర లోలతయే మందు (వస్తువుల సవరించుచుండురు. చంద్రగుప్తుఁడు యవన సైనిక వేషమున శిఖాంగుళీయక ముతోఁ బ్రవేశించును.)

హిప్ప: (బల్లెమెత్తి) ఎవరావచ్చునది? నిలువుము.

చంద్ర: నే మిత్రుండ నుమా! ఇదె నేనాని శిఖాంగుళీయకము. రాజపుత్రి నతండు
దోడ్కొని రమ్మనియె.

హిమ్ప: (అంగుళీయకముంగొని చూచి కన్నుల కద్దికొని) హా మ్మ. ఆ కాంత యిష్ట
పడినం గొనిపొమ్ము.

చంద్ర: (లోనికేగి) వారుగో! హేళినీ రదనికలు నాతో వచ్చుటకుం గాంబోలు
ప్రయాణ సన్నాహమొనర్చుచున్నారు. నా మనోహారి యించుక వాడియు
నెట్లు దర్శనీయగా నున్నది.

తే॥గీ॥ విరహ వేదన నొకకొంత హరువుం బాసి
జనకుశిక్షమనొకకొంత ఛవినిం బాసి
మలయు వేళలయందె ఈ లలన మోము
ప్రతిపదమృతాంశు కళవలెం బ్రమద మొసగు.

నే వచ్చిపోయితునను నాశాబంధమే ఈ కుసుమకోమలి ప్రాణములనిల్పి
యున్నది. (పోయి వెనుకనుండి కన్నులుమూయును. రదనిక కూరుచుండుమని సైగం
జేయును.)

హేళి: రదనికా! ఏమి వేళాకోళము (చేతులందీసి) ప్రాణేశా! వచ్చితివా!

చంద్ర: మనోహారిణీ! నీవు రమ్మనుట! నే రాక సాహసించుటలు నా! రమ్ము.
త్వరగా వెడలనగును. అదిగో! చంద్రోదయమగుచున్నది. చందనదాసా
దులు మన కొఱకు వేచియున్నారు. రమ్ము, ఏల సంశయింతువు?

హేళి: ఆర్యాగ్రణీ! నాజన్మము నిస్మరింపం జేతసము చే వెట్టి కలచినట్లున్నది.

చంద్ర: చేలా! అతనినిగురించి భయపడకుము. ఆర్యచాణక్యులవారతని నైలైనం
గొలది కాలమున సంధికిచ్చగించునట్లొనర్చి పూర్ణాంగీకారమున మన
ద్వాహ మొనర్తునని నా కభయమిచ్చె. స్వస్థచిత్తవైరమ్ము. మన పరిణ
యమునకు మీ తండ్రి యంగీకరించు దనుక నా మహాత్ముని విడిచి యుం
దలిధివై యుండుము.

హేలెన: ప్రాణేశ్వరా! అట్లే యగుఁగాక! అయిన నొక ప్రశ్న. నేను వేలను. మీకు నాపైఁగల మోహము పూర్ణమో అకలంకమో కాదో ఇప్పుడైనఁ దెలుపుము. ఏలన.

ఉ॥ కన్యరో నాకు నీవయినఁ గామ మొకింతయు లేదట న్ననే
మన్యువునన్ దపింతునని మానసమందుఁ దలంచి క్రూరకా
రుణ్యముఁ బూని లేని నెనరున్ నటియించి వరించుకంటె న
న్యోన్య సుఖాంతకోద్యమము నాస్తిగదా మగధావనీశ్వరా?

చంద్ర: ముగ్ధా! నా మోహము నెడలను నిట్టి సంశయమా! అది వచనాతీతము. అఖండము, అనంతము, అయ్యది హృదయైకసాక్షికము. నా భావివర్తనమే నీకు దాని నైజము తెల్పు.

మ॥ చెలితండంబులు బాంధవోచ్చయములున్ జేఁదోఁడు సైదోఁడులై
కలకాలంబు పచారముల్ సలుపగా గారాబముల్ జూపగాఁ
దలపూవాడక యొండకన్నెసక సంత్రాణంబు నన్నంటి, విం
కలినీలాలక! యోలలార్చెదను రమ్మా కామపాథోనిధిన్.

'రాజానో బహువల్లభాః' యను నార్యోక్తి మృషయగు నట్లే యేకపత్నీవ్రతుఁడనై సర్వకాల సర్వావస్థల మెలంగెద. ఇదియే నా ప్రతిన. ఇందులకు సాక్షులు.

హెలెన: ప్రాణవల్లభా! సజ్జనులమాటలకంటె వేరు సాక్షులు వలయునా? రండు.

చంద్ర: ప్రేయసీ! ఇటు ఇటు. రదనికా! రమ్ము.

(నిష్క్రమింతురు.)



# చంద్రగుప్త నాటకము.

## పంచమాంకము-ప్రథమ రంగము.

స్థలము:-నికియా నగరము-రాచనగరు.

(అగ్రాసనములపై సెల్యూకస్, మెగాస్థనీసు)

సెల్యూ: మెగాస్థనీస్! ఈ చాణక్య నృపాంసనుఁడు వ్రాసిన దంతయు నిజమేనా?

మెగా: (చదివి) రాజేంద్రా! చాల వఱకు యదార్థమే. తమ పుత్రుఁడు ఆంటియోకను వ్రాసిన లేఖ దీనిని రూఢపఱచుచున్నది. ఆంటిగోనసు మీ రన్య దేశ దండయాత్రాలాలసులై యుండ నిదియే వైరము సాధింప సమయమని మన రాజ్యముపై దాడి వెడలెను. మరియు బ్యాక్ట్రియా, పార్థియాలు మన క్షాత్రపుల నిరంకుశ ప్రభుత్వము నోర్వక స్వరాజ్య సంపాదనోత్సాహముతోఁ దిరుగఁబడినవి. అవియు హైందవ గూఢచారులచేఁ బ్రేరితములట. ఆ దండయాత్ర నెదుర్కొనుటకు ఆ జన విప్లవము నణచుటకు హిందూదేశ దండయాత్ర ముగిసినను ముగియకున్నను సత్వరము మీరు రావలసినదిగా తమ పుత్రుని లేఖ.

సెల్యూ: అక్కటా! నా పుత్రుని కోర్కె నెట్లు నెరవేర్తు?

మ॥ తురగస్యందన పాదగద్విరద సందోహైక సంరంభియై
భరతోర్వీధవచంద్రపాలితధరావాల్లభ్యమాసించి యు
ర్వర నేతెంచి విరోధి చేఁగలనఁ బెడ్బాటొంది వెస్సిసినన్
వెఱపింపంజనుదేరి లా వెఱచి వెన్నిచ్చెనం జాడరే.

మెగా: రాజేంద్రా! ఎవరేమనుకొనినను వెనుక కేగుటకు వీలు లేదు.

సెల్యూ: ప్రధానీ! ఈ కల్లరి మనల నలువైపుల నెవరెవరో అరికట్టినారన్న నమ్మదవా యేమి.

మెగా: ఈ వార్త అవశ్యము విశ్వసనీయము. మన భాగలును నలువంకలకుం జని హైందవ సైన్యముఁ గనుఁగొనిరి. మఱియు నీ చాణక్యుని ప్రభావ మే

నెఱుఁగుదు. అతఁడు ప్రగల్భములాడువాఁడు కాడు. చెప్పినంతయుఁ జేయును. కర్తవ్య మాలోచింపుఁడు.

సెల్యూ: అహో! నాకెట్టి దురవస్థ దొరకొనె. ఎట్టి దుర్ముహూర్తమున నీ ప్రయాణమారంభించితినో గాని నా యాశలు నిరాశలయ్యె. నా నిరంతర విజయాభిధానంబు వేలపాలయ్యె. తుదకు నా గ్రహచార వశంబున దెల్హియందు దైవజ్ఞుఁడొసంగిన సందేశముగూడ నబద్ధమయ్యె. దైవ సహాయము లేక యేకార్య మొనర్ప వచ్చినను గొఱవితోఁ దలఁ గోకినట్లగు.

త॥ కటకట! సర్వభూభరణ కార్యధురంధర శాత్రవేశ్వరో
త్కట పటుగర్వ వైభవ విదారణయోగ్య పరాక్రమోల్లస
ద్భట పటలీపరివృతు నుదారబలప్రతిభాఢ్యు నన్ను ని
ట్లటమటఁజెందఁ జేసెనుగదా! విధికొక్కఁ డసాధ్యమున్నదే.

మంత్రీ! మన గూఢచారు లరిరాజ్యమున నంతఃకలహంబులఁ గలిగింప నేరరైరా?

మెగా: మన చారు లాంధ్రుల మగధరాజ్యముపై దాడి వెడలఁ బురిగొల్ప యత్నించిరి గాని భగ్నమనోరథులైరి. వారు వారిలో మనకెన్ని కలహము లున్నను నీ తరుణమునఁ గలహమునకు దిగి భారత మాతను దాసిఁజేయ మనిరి. ఇంక మాగధులు మౌర్య పరిపాలనమునఁ దృప్తి నొందియున్నారు. చంద్రగుప్త రాజచంద్రుఁడు సత్పథంబున వర్తింప కువలయానందం బొనఁగూడి అరివిజృంభణ మడుగంటి యుండఁ గామ్యార్థ సిద్ధులై యున్నారు. కావున మన చారు లేమియుఁ జేయనోపరైరి.

సెల్యూ: అమాత్యా! ఇరువది సంవత్సరముల క్రింద నన్యోన్య కలహంబులఁ జిక్కి దేశభక్తి రహితులయి అజ్ఞానాంధులై, అదృష్టులై యున్న హిందువులింత త్వరలో సంఘీభావమును రాజనీతిని దేశభక్తిని పరాక్రమమును యెట్లు నేర్చిరి?

మెగా: రాజేంద్రా! అందులకు రిచ్చపడనేల. ప్రతి జాతియును ప్రజాపీడనము నగ్నిదివ్యము నూర్చినంత రక్షకుని నొకనిఁ గాంచు. అసురలచేఁ దపించు సురలకు మధుసూదనుఁడుఁబోలె నిజప్రవారిచేఁ గందు నిర్జరులైట్సునకు హాసెనుం

బోరి మీడియనులచే బాధనొందు పారసీకులకుఁ గైరసుంబోలె యవనాదులచేఁ బీడనొందు హైందవులకు దేశోద్ధారకుండుగా మౌర్యుండవతరించి హైందవులకు స్వాతంత్ర్య మొసగూర్చె. ఆ స్వాతంత్ర్యాలయమునఁ జెటిగిన మొలకలే ఈ దేశభక్తి ధైర్య శౌర్య సంఘీభావములు. ఇక నే నేగి హైందవ రాయబారులఁ దోడితెచ్చెద.

(నిష్క్రమించును.)

సెల్యూ: అక్కటా! నా కిట్టి పాటు లౌదవునని కలనైన దలంచితినే. ఇట్టి మానహీనపు బ్రతుకు బ్రతుకుటకన్న పాత్రకసులునివలె మరణించుట మేలు.

అక్కటా, పాత్రకులా, నీ వెంత పుణ్యాత్ముకుఁడవు.

ఉ॥ ఆ కుటిలాత్ము యాన్యవసుధాధిపు వెంటఁ బలాయనంబుగా
గ్రీకులు యుద్ధభీతులయి కీర్తిఁ దలంపక వెన్నుఁజూపగా
మా కులగౌరవక్షయము మాసెడా నీయుల విక్రమాంతమా
లోక మొనర్పలేక యనిలో మృతినొందితివే చమూపతీ

నీ వలె నేను నొనర్పుదు లెమ్ము. ఏలయన నా పేరుతోడ నా సుఖమును మాయమయ్యె. నా యాత్మజాత నా కంటి రసాయనము నా చేతులయం దల్లారు ముద్దుగాఁ బెఱిగిన ముద్దుకూన నన్నుఁ బాసి నా శత్రువు నాశ్రయించి నా సౌఖ్యము రూపుమాపి నా దుఃఖమును నూఱు మడుంగు లెక్కువఁ జేసె.

ఉ॥ ఏ వనజాక్షి మాకు జనియించినదాది స్వలీల చేత, నా
నావిధ సౌఖ్యవార్నిధి ననారతమున్ మము నోలలార్చెనో
యా వనజాక్షియే యిటు లనర్థశిఖిన్ మముఁద్రోసిపోయె ఛీ
యేవి సుఖప్రదంబులో యవే యసుఖప్రదముల్ నిజంబుగాన్.

కానీ, కానీ, కీఁడులో మేలొనఁగూడదునా? (చాణక్య చందనదాసులతో మెగాస్థనీసు ప్రవేశించును. ఉచితాసనములపై నాసీనులగుదురు)

చాణ: సిరియాధిపా, మేము మా భూపాలుని పంపున సంధివిషయముల మాటాడ వచ్చితిమి.

సెల్యూ: రాయబారులారా! ఈ సంధి వలయునని నేఁ గోరితినా? ఈ పిలుపని పేరంటమేల?

మెగా: రాజేంద్రా! మాయార్యునిపైఁ గోపమున మీరిట్లందురే గాని లేనిచో వీరిని వినకయే యిట్లు నిరాకరింతురా!

చాణ: రాజేంద్రా! మీ మంత్రి ప్రాజ్ఞుఁ డతనిమాట లాదరణీయములు.

చ॥ మీకును మాకు నేటికి సమీరిత మిత్త్ర సిరియావనీశ! ల
క్ష్మీ కరుణాకటాక్షమునఁ జేకుఱె మాకు జయంబటంచు నీ
వీక విషాద మూనక వివేకము వీడక సంధిఁ జేయుమా
కోకచకోరకోటి కొనఁగూడునె కోరెడు కోర్కు లొక్కచోన్.

చంద: ఆర్యాగ్రణీ ఇంకను యుద్ధమొనర్చి జనక్షోభమొనర్చుట తగునా?

మ॥ హితులై లోకముఁ బెంప ముంపఁగల మీకీచాయ నెన్నాళ్లకుం
గ్రితమో మాసిన ద్వేషభావ మెద గారింపంగ నన్యోన్యశ
త్రుతఁ బోనాడక యుద్ధమాడి జననిర్మూలంబుఁ గావించి ప్రా
కృతులుం బోలె మెలంగగానగునొకో గ్రీక్ రాజన్యకంఠీరవా.

సెల్యూ: రాయబారులారా! మీకును మాకును సంధి యెట్లుపొసఁగును.

చాణ: భూపాలా! నే నంపిన లేఖ బఠించిన మీ రే స్థితిలో నుండునది మీకు విశదమైయుండు. ఆ విషయముపైఁ జెప్పుట చర్విత చర్వణమగు. మీకును మాకును సంధిపొసగుటకుమున్న మీరుకొన్ని నిబంధనల కియ్యకొనవలయును. వానిలో మొదటిది మీ కొమరితను మా రాజునకిచ్చి పాణిగ్రహణ మొనర్చుట.

సెల్యూ: అందులకే నియ్యకొనను. ఇంకేమైన నిబంధన లున్న నుడువుడు.

మెగా: ఆర్యులారా! దీనికి మా రాజు నంగీకారముతోఁ బనియేమి? ఆ కాంత మీ రాజునే వలచి యతనికడనే యున్నది కదా? అతఁడేల వివాహముఁ జేసికొనగాదు?

చాణ: మంత్రివరా! మా రాజునకు హేళినికిఁ బాణిగ్రహణ మిష్టముగాని రాక్షస వివాహముగాదు. మఱియు మీ రాజందుల కంగీకరించిన గ్రీకార్య

క్షోణులకు శాశ్వతమైత్రి గుదురును. లేనిచో క్షణభంగురమగు. రాజేంద్రా! యోచింపుఁడు.

మ॥ యవనానీకము శౌర్య ధైర్యముల కావంతైన బద్ధుండు గా
ని విపక్షుండు మురాసుతుండు యవనీ నిస్సీమలావణ్య వై
భవ సంపన్నత కోడి సంధికిటు లంపంగా రణాపన్ను లీ
రవివేకంబున దాసిఁ ద్రోయుటలు బాఁగే గ్రీకు భూపాలకా!

సెల్యూ: ఏమైనఁ గానిమ్ము. నా ముందఱ నా ధూర్త ప్రశంస వలదు. దానికి నాకు నెన్నఁడో ఋణము దీరినది.

శా॥ ఏనాఁడా కుటిలాత్మ నా సుతుల నొక్కింతైన నాలింప క
త్యానందంబున గ్రీక్జనాంతకుని నార్యాధీశు వెన్నాడెనో
యానాఁడే తెగె సర్వబంధములు నాకా బాగకింకేల వృథా
గా నా యౌవతి యేల నాతి భరతక్ష్మాపాలుఁ బెండ్లాడఁగన్.

చంద: మీ రిట్లనుట పాడిగాదు. ఆ కన్యారత్నముపై వాత్సల్యము మీ కింతతో నంతరింప నగునా? ఆ కాంత మీ కొసంగిన సుఖమొక్కింత స్మరింపుఁడు. ప్రకృతి ప్రేరిత దోషము సైరింపుఁడు.

చాణ: మీకును మాకును జాతి మత వర్ణ వైరస్యంబు లుండుట నిజమే. అవి దైవ నిర్మితంబులు, అనివార్యంబులు. వాని వదలి మీ కుమారితను మా రాజున కొసఁగుటకు వెనుఁదీయనేల? అతనికి వరోచిత లక్షణములు కలవరయ్యునా? భారతేశున కైశ్వర్య లోపమా? ఆర్య వంశజాన కన్యాయ లోపమా! చతుష్షష్టికళాపారంగతునకు విద్యాలోపమా? ఇట్టి మార్యునకుఁ గన్యనీయఁ గుహానాజాత్యభిమానంబునఁ గొంకఁగునా! వృగతవ్యుండు మృగయుండా యెనని తిరస్కరింపకుము.

మెగా: రాజేంద్రా! వీరి వాక్యములు సమంజసములు, ఆదరణీయములు. వీరిందు కంగీకరించిన సర్వశ్రేయములగు. యవన హైందవులకుం జిరమగు మైత్రి చేకూరు. మనకును మన శత్రువులపై భారతీయుల సాయము లభ్యమగు. మీ ప్రియ పుత్రికకు నిరంతర సౌఖ్యముం గలుగుననుట సంశయింప వలదు. వీరి ప్రార్థన కియ్యకొనుఁడు.

చంద: యవనేశ్వరా! ఇంత శీఘ్ర కోపము మీ పుత్రికపై మీకుఁ దగునా?

చ॥ అజితపరాక్రమక్రము ననంగవిలాసుని మహార్యుఁగాంచియు
క్కజపడి మీ తనూజ తమకంబునఁ గుందుచు మీ యనుజ్ఞ చి
త్తజగురుబోధఁ జేసి జవదాటిన నిల్లు క్షమింపకుండెదె? యా
త్మజకొఱనరించుచుఁ దప్పుఁ దలిదండ్రులు సైపకయుంట ధర్మమే?

చాణ: ఆర్యా! ఇంకను బలుకవేమి! మమ్ముఁ గలవుఁ గోపము నెదరా (లేవ నుంకించును.)

మెగా: రాజచంద్రా! ఇదేమి విపరీతము? (లేచివచ్చి చెవిలో నేదియో నుడువును)

సెల్యూ: రాయబారులారా! కూర్చుండుఁ డింక ఆ మాట నేఁ ద్రోసివైవఁజాల. ఆట్లే నా పుత్రి మీ భూపాలుని చెట్టఁబట్టుఁగాక! ఈ పరిణయమే యవన హైందవ మైత్రి కస్తిభారమగునుఁగాక.

చాణ: తథాస్తు! యవనేశ్వరా! కయ్యంబు వియ్యంబునకు వియ్యంబు నెయ్యంబునకు మూలమగుగాక. ఇంకఁ దక్కిన నిబంధనలన్నియు క్షణములో ముగింపనగు. మీ పుత్రికకరణముగా ఆరియా, యరకోసియా, పరోపనిషాద, దక్షిణ గెడ్రోసియా దేశముల నిత్తురుగాక. ఈ దేశములు విస్తారముగా నార్య ద్రావిడ జాతుల కావాస భూములు. అట్టిచోఁ బ్రస్తుతమున్న హిమవంతమునకు బదులు హిందూకోశ పర్వతము మన దేశముల కెల్లయగు.

సెల్యూ: మే మొడకయే యింత విశాల భూమిని మీ కొసఁగుదుమా?

చంద: మీరోడిరని మేము వీని నడిగితిమా? మీ పుత్రిక కరణముగా నీయఁ గోరితిమే.

మెగా: (జనాంతికము) రాజశేఖరా! ఆ భూము లెప్పుడు మనపైఁ దిరుగఁబడుచుండు. వానివలన మనకు లాభము లేదు. కావున వీని నొసఁగుట దుఃఖకరము గాదు. ముందు వెనుక లాలోచించి యుత్తరమిండు.

సెల్యూ: సరియే, తర్వాత.

చాణ: ఇక మేము కోరఁదగిన దేదియు లేదు. మీ కేమైన నిబంధనలఁ గోరెదు చో వింటము.

మెగా: మీ రాజునొద్ద మా రాయబారి నొకని నుంచుకొనవలయును.

చాణ: అందులకు సందియమా? మీరనునట్లు ఒనర్తుకేని మెగాస్థనీసునే మాకడ కంపిన బాగు.

సెల్యూ: ఉభయ పక్షముల బందీల విడిపింపవలయు.

చాణ: అట్లే. వలయుచో మీ కాంటిగోనసుపై సాయము వలసిన నొనర్తును.

సెల్యూ: ఆర్యా! వలసిన సాయ మర్థింతును లెండు. మా కైదువందల గజముల నీయవలయు.

చాణ: తప్పక యొసంగెదము. ఒక గజగామినికి బదు లైదువందల గజముల నిచ్చుట మా శాస్త్రసమ్మతమే.

సెల్యూ: మనవారల కందఱకు సంధియైనదని తెలియఁజేయుదము.

(మెగా. నిష్క్రమించును.)

చాణ: రాజచంద్రా! ఇంక సత్వరమేగి మనరాకకెదురులు చూచు హెలెన్ చంద్రగుప్తులకు హర్షమొనర్తము. రండు. తక్కంగల విషయములఁ దర్వాత తీర్మానింతము. రమ్ము.

సెల్యూ: ఆర్యా! అట్లే కానిమ్ము. (నిష్క్రమింతురు.)



# చంద్రగుప్త నాటకము.

## పంచమాంకము—ద్వితీయరంగము.

స్థలము—హైందవ శిబిరము, రాచనగరు.

(మైత్రేయ చంద్రగుప్తు లాసీనులై యుందురు.)

చంద్ర:

చ॥ కువలయబాంధవర్క్షనటకోటి వియత్తలరంగమందునం
దవిలినటింపఁ బ్రాణులమితంబుగ నిద్రలుచోఁప్రభాతమ
న్యవనిక దించివైచి సమయాభిదసూత్రధరుండు లోకబాం
ధవనటునిం బ్రవేశముఁ బొనర్చెడు రక్ష్యుపపాదనార్థమై.

మైత్రే: మిత్రా! మీ సుఖమునకును రాత్రి చని వేకువ గావచ్చినదిగదా!

చంద్ర: వయస్యా! ఇదంతయు మీ సహాయ ఫలమేకదా! ఈ మారుతము మందమందముగ వీచుచున్నవి.

తే॥ గీ॥ రాత్రియంతయుఁ బూకనిర్ఝరిణులందు
స్నాతులై ప్రభాతంబున వాతపోత
తతులు పుష్పవతులైన లతలనంట
వెఱచికాబోలు మెలమెల్లవీచుచుండు.

మైత్రే: అవునవును. నీ కిపుడు మనసంతయుఁ బుష్పలతపైననేగదా! వయస్యా! ఇంకను రదనికా హేళినులు రాలేదేమి? శుభ ముహూర్తము డాయుచున్నది గదా? సెట్టి శృంగారించునప్పటికి పట్టణము కొల్లబోయినట్లు వీరి సింగార మగునప్పటికి మీ ముహూర్తము దాటిపోవుచున్నదే? సహజ సౌందర్యవతులకు సొమ్ములేల? అదిగో, వారును వచ్చుచున్నారు. వారల నా ప్రశ్న యడుగుము (రదనికా హేళినులరుదెంతురు. చంద్రగుప్తుఁడెదురేగి హేళిని కైఁగొని పరిక్రమించును.)

చంద్రి: ప్రేయసీ! ఎప్పుడు వచ్చునాయని మన మెదురు చూచుచున్న కాల మాసన్న మైనది. నా సంతోషమును జిక్కఁబట్టినను నిల్వక పొంగి పొంగి పై పై వచ్చుచున్నది.

హేలి: మనోనాథా! నాకు నట్లేయున్నది.

శా॥ అవ్యాజప్రణయావరోధము లసంఖ్యాకమ్ములంచుఁ మహా
కవ్యాదుల్ వచియింతురట్లి మనరాగవ్యాప్తియందుఁ విఘా
త వ్యూహంబులు దోచె నైన నితరార్థవ్రాత మిద్ధాత్రి మో
హవ్యాపారములోడ సాటియగునా! రాజపంచాననా!

చంద్ర: ఈ సుఖమునకంతయు నీ రదనికయే కారణము. రదనికా! నీ కెంతయు మేము కృతజ్ఞులము. నీవు మా సంయోగమునకుఁ బాటుపడి నీ ప్రభుభక్తిని దేశభక్తిని వెల్లడించితివి.

రద: భారతేశ్వరా! నెచ్చెలి తోషణంబు నాకుఁ గర్తవ్యము. నేను మీ మెప్పుల కెంతదాన. మీ రిర్వురు సుఖంబుగ దీర్ఘకాలము కాపురము సేయుఁ జూచుటయే మా కొక కోటిసేయు.

మైత్రే: వయస్యా! (గంతులు వైచుచు) ఇదేనోయి ఇహలోక స్వర్గము. మిమ్ముఁ జూచుకొలది నా కా స్వర్గ సుఖము ననుభవింప నాస వొడము చున్నది. రదనికా! ఏమనియెదవు! నన్ను సుఖపెట్టెదవా?

రద: ఎగతాళిమారీ! పొమ్ము. నీ పరియాచకము లింకొక చోటికిం గొంపొమ్ము.

మైత్రే: ఏమే దాసీ! నావంటి యందగాఁడు తెలివిగలవాఁడు నీవు తలక్రిందులు తపమొనర్చినను దొరకునా?

రద: తపమొనర్చి చూచిన తర్వాత నీకుఁ బ్రత్యుత్తరమిత్తును. వారుగో రాజేంద్రు లిటు వచ్చుచున్నారు.

(సెల్యూకస్ చాణక్య మెగాస్థనీస చందనదాసులు ప్రవేశింతురు.
దంపతులు నమస్కరింతురు.)

హేలెన: తండ్రీ! నా మనోజ్ఞప్రేరిత దోషము సైచినన్నాశీర్వదింపుము.

సెల్యూ: అమ్మాయీ! నిన్నెప్పుడో మన్నించితిని. మనకు వీఁకి జాతిమతములు వేఱైనను పతివ్రతా ధర్మకంబు లొక్కటె. పతిభక్తియే సాధ్వికిసొమ్ము. తదనురూపంబుగా మెలంగి పుట్టినింటికి మెట్టినయింటికిఁ గీర్తిఁదెమ్ము. మగధేశ్వరా! మన నిరంతర సఖ్యాభివృద్ధికై నా పుత్రిని నీ కర్ధాంగిగానొసగెద. గ్రహింపుము. (హెలెన చేతిని చంద్రగుప్తుని చేత నిడును. చందనదాసు పుష్పదామంబుల నందీయ నొండొరుల దంపతు లలంకరింతురు.) ఇక నీ తన్వితోఁబాటీ యార్యావర్తముం బాలింపుము.

మ॥ మదశత్రువ్రజముం హరించి హితులం బాలించి దేశైకమ
త్యదనుజ్ఞానమునించి సేద్యరచనాతంత్రాదివిద్యాళినం
పదచే మేలొనరించి యీతి వెడలన్ మాయంబుగావించి సౌ
ఖ్యదమై వెల్గెడు మీప్రభుత్వ మిల స్థైర్యస్ఫూర్తి వర్ధిల్లుతన్.

(దంపతులు చాణక్యునకుఁ బ్రణమిల్లుదురు.)

చాణ: (ఆశీర్వదించి) ఇష్టకామ్యార్థ సిద్ధిరస్తు! వృషలా,

చ॥ హిమగిరిరాట్తనూజను మహేశ్వరువైఖరి, వాగ్రమామణిన్
కమలజుమాడ్కి శ్రీసతిని కంజదళాక్షునికైవడిన్ రతిన్
సుమశరుభాతి రోహిణిని సోమునిచొప్పున, భారతీశ! ఈ
రమణిభరించి లోకమునఁ బ్రస్తుతిఁగాంచుము ధర్మకామివై.

చందనదాసా! నీవేగి మన విశాల రాజ్యంబున హస్తివాహనంబులఁ దక్కఁ దక్కిన వానినెల్ల బంధవిమోచన మొనరింప నాజ్ఞసేయుము. వృషలా, మున్ను రాజ్యంబుఁగూర్చితి! రమణి గూర్పనైతి! నిపుడా కొఱంతయుఁదీఱె. ఇంక నార్యోక్త విధానమున వివాహము జరిపింపవలయు రమ్ము. ఇంకేమి కోరుదువు?

చంద్ర: ఆచార్యోత్తమా! ఇంకను నాకును గామ్యేతర మేమున్నది.

ఉ॥ నందకులంబు నాకొఱకు నందముగా నొనరించి యార్యరా
జ్యేందిర నేలఁజేసితి, వహీనగుణాభరణాంక హేలినీ
సుందరిఁగూర్చి విస్తరవసుంధరఁ గైకొని గ్రీకురాజుతోఁ
బొందొనరించితింక గురుపుంగవ! కొంతొక కామ్యముండునే!

అయిన నిట్లగుగాక!

(భరత వాక్యము)

మ॥ ఖలపాపోచ్చయులై, ప్రకీర్తిధనులై, గ్రీక్ రాజ రాణ్మిత్రులై,
జలజాతేక్షణపాదభక్తిపరులై సౌభ్రాతృసంబద్ధులై
బలులై బల్లిదులై ప్రభావయుతులై భద్రార్థులై భవ్యులై
కలకాలంబు చరింత్రుగాత భరత క్ష్మామాతృ సంతానముల్!



క॥ పౌత్రుండగు కౌండిన్యస |
గోత్రుండగు ముత్తరాజుకుల కువలయనే |
న్మిత్రుండగు సుబ్బార్యుని |
పుత్రుండగు సుబ్బరావు పొనరిచె దీనిన్॥

క॥ ఈ కరణిం బాటువడి నే |
నీకర మొనరించినకృతి శ్రీకరమై, శో |
భాకరమై బుధజననుతి |
కాకరమై వెలయుగాత మశ్రాంతమిలన్॥

Ramakrishna Press, Nellore.

# తప్పొప్పుల పట్టిక.

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 1 | 20 | గిరికలఙ | గిరికుల్ |
| 3 | 25 | సెల్యా | శల్యా |
| 10 | 3 | చుండు | చుండురా |
| 11 | 12 | నేకాని | నేకానియి |
| | 13 | ఇట్లని | ట్లని |
| 12 | 28 | బ్రేమమార్పులం | బ్రేమమార్పులను |
| 13 | 1 | కడవి | కదలి |
| | | విభువిని | భువిని |
| 15 | 16 | జంకుదలంకు | జంకుశలంకు |
| 20 | 6 | ఉల్లంబందున | ఉల్లంబందును |
| 24 | 6 | సౌహార్ద్రి | సౌహార్ద |
| | 9 | యనుల్ | అనుల్ |
| 25 | 3 | ప్రణమ్య | ప్రణత |
| 26 | 16 | క్జాలం | క్జాలాలం |
| 27 | 9 | గిరిక్జాలం | గిరిజ్గాలాలః |
| | 12 | డిటో. | డిటో. |
| | 16 | గాల్వెట్టి | గాల్వెట్ట |
| 29 | 6 | ముందు | ముంద |
| 30 | 2 | నిధీ | నిధి |
| | 15 | విచక్షణకు | విచక్షణతకు |
| 31 | 13 | సెల్యా | శల్యా |
| | 25 | గ్రీకారి | గ్రీగారి |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 32 | 6 | ఛాత్రు | చ్ఛాత్రు |
| 33 | 9 | మోమఱ | మోమర |
| | 17 | గలించు | గలింప |
| 34 | 17 | ప్రేమాంజనా | ప్రేమాంజన |
| 40 | 8 | నొకింత | నొకింత? |
| 45 | 5 | తామసిలు | తామసిల |
| | 7 | మహాద్భా | మహోభా |
| 47 | 10 | నవనీత | నవనీత |
| 50 | 5 | మఱువక | మఱవక |
| 53 | 6 | అదియేని | అదియే |
| 54 | 14 | పేతు | సేతు |
| | 19 | శా॥ | చం॥ |
| 55 | 23 | యమాయకు | యమాయికు |
| 57 | 14 | సెల్యూ | శల్య |
| 58 | 3 | నే | నా |
| | 7 | నే | నా |
| | 9 | నే | నా |
| | 12 | యితే | యత |
| | 14 | దుఃఖకరమె | దుష్కరమ్మె |
| | 17 | నాతో నైన | నాతో కలనైన |
| | 20 | నమితాంఘ్రిద్వా | వినుతాంఘ్రియొ |
| | 21 | డాంభి | దాంభి |
| 59 | 8 | యనెదవా | యనెదవా? కడసారి యడిగెద. నీవు పాత్రకులు పాణిగ్రహించెదవా? లేక చెఱసాల నుండగోరెదవా? |
| 60 | 6 | పఠించు | పఠించు నాంది |
| | 7 | నాందికరణి | కరణి |
| | 9 | నిగ్వాహ | నిర్వాహ |
| | 15 | సూనాంచితా | సూనాంబికా |

| పుట. | పంక్తి. | తప్పు. | ఒప్పు. |
|---|---|---|---|
| 61 | 20 | మీ | ఈ |
| 62 | 11 | యూడగ | మాడగ |
| | 12 | ‹జరింతురం | స్ఫురించునం |
| 63 | 1 | యపగాధు | యపరాధి |
| | 19 | దెలియనా | దెలియని వా |
| | 26 | యతిచన | చన |
| 65 | 5 | జంధ్ర | జందె |
| 66 | 6 | వైరాగ్యతమి | వైరాగ్యరతి |
| 74 | '4 | వారి | వారు |
| 76 | 7 | భగుడై | పశుడై |
| 77 | 25 | కాయయూ | కాయూ |
| 79 | 19 | నా...స్మరింప | నా జనకుని సంస్మరింప. |
| | 23 | ద్వాహ | కుద్వాహ |
| 80 | 4 | పయిన | పయిని |
| 82 | 22 | అదృష్టు | అధృష్టు |
| 83 | 3 | తాళ్యలయము | తాళ్యలవాలము |
| | 15 | నాకంటి | నా కంటి యమృత |
| | 21 | ఛీ | చీ |
| 84 | 14 | రాజన్యకం | రాజకం |
| 85 | 21 | మృగ | మృగి |
| 87 | 12 | కెదురులు | కెదురు |
| 88 | 5 | మందునం | మందోగిన్ |
| | 8 | ము‹బో | ముపో |
| 89 | 8 | సాటియౌనా | సాటియననౌనా |
| 90 | 2 | దర్మకంబు | ధర్మంబు |
| | 9 | సేద్య | సీర |
| | 14 | వాగ్రిమా | వాక్సతీ |